Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!



సంపుటి: 56 • సంచిక: 135 • శుక్రవారం 25 ఆగస్టు 2017 • హైదరాబాద్ * పేజీలు: 12 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ చవితి రా. 9.32 వరకు, అనంతరం పంచమి; నక్షత్రం: హస్త సా. 4.38 వరకు, అనంతరం చిత్త; అమృతకాలం: ఉ. 10.40 నుండి 12.15 వరకు; వర్జ్యం: రా. 1.00 నుండి రా. 2.41 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.17 నుండి 9.08 వరకు, తదుపరి మ. 12.32 నుండి 1.23 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 3.00 నుండి 4.30 వరకు




శ్రీ చండీకుమార అనంత మహాగణపతిగా ఖైరతాబాద్ గణనాథుడు దర్శనం

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రప్రభ' **వినాయక చవితి శుభాకాంక్షలు**

గణేశ్ చతుర్థి సందర్భంగా శుక్రవారం మా కార్యాలయానికి సెలవు. శనివారం సంచిక వెలువడదు. పునర్దర్శనం ఆదివారం.
– ముత్తా గౌతమ్, మేనేజింగ్ డైరెక్టర్

నేటి ఆంధ్రప్రభ సంచికతోపాటు **వినాయక చవితి వ్రతకల్పం** పుస్తకం ఉచితంగా అందుకోండి



కొత్త సంవత్సర కానుకగా

భగీరథ నీళ్లు



రాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభోత్సవం

- నీళ్లివ్వకుంటే ఓట్లు అడగబోమన్నాం
- డిసెంబరుకల్లా పనులు పూర్తికావాలి
- జనవరి ఒకటి నాటికి ప్రజలకు చేరాలి
- మన సవాలుని మనమే అధిగమించాలి
- మిషన్ భగీరథకు నీతిఅయోగ్ ప్రశంసలు
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్



సెప్టెంబర్ నుంచే పైపులు
డిసెంబర్‌కు పూర్తి చేయాలి
ఆరునెలల్లో గ్రామాల్లో ట్యాంకులు
పైపులైన్లతోపాటు నల్లాలు ఏర్పాటు
జాప్యం జరిగితే కఠిన దండన
ఇది తెలంగాణకు ప్రతిష్టాత్మకం
సర్కారుకు గౌరవప్రదం
మంత్రులు, ఎమ్మెల్యేలకు బాధ్యతలు
పనులపై నిరంతరం సమీక్షలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి నూతన సంవత్సర కానుకగా ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా నీరివ్వబోతున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు.. నిజానికి ఇదొక పెద్దసవాల్అని, దీన్ని ఇష్టంతో స్వీకరించి, రాత్రింబవళ్ళు శ్రమిస్తున్నామని ఆయన వెల్లడించారు.

రాష్ట్రంలోని అన్ని ఆవాస ప్రాంతాలకు సురక్షిత నీటిని అందివ్వకుంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోమని సవాల్ తీసుకొని మిషన్ భగీరథ పనులు చేస్తున్నామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు మరోసారి గుర్తు చేశారు. దేశంలో ఎవ్వరూ సాహసం చేయని రీతిలో సవాల్ని స్వీకరించామని, దానికి తగ్గట్టుగా పనిచేయాలని, సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు సురక్షిత నీటిని అందించడం మన రాష్ట్ర గౌరవానికి సంబంధించిన అంశమని సీఎం కేసీఆర్ చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి గ్రామాలకు మంచినీటిని అందించాలని, ఈ లోగా ఇన్‌టెక్‌వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం పూర్తయి నీటిని అందించాలని చెప్పారు. గురువారం ➪ 3వ పేజీలో...

మెడికల్ కౌన్సెలింగ్‌లో

3వ విడతకు ముడి!



- మొదటి, రెండో విడత సీట్లు సాధించిన విద్యార్థులు మలివిడత కౌన్సెలింగ్‌కు అనర్హులు
- సంచలన ప్రకటన చేసిన కాళోజీ హెల్త్ వర్సిటీ
- రేపటి నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వైద్య, దంత కోర్సుల ప్రవేశాల స్లైడింగ్‌లో జరుగుతున్న అక్రమాలకు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ చెక్ పెట్టింది. ఈనెల 26వ తేదీ నుంచి రెండు రోజులపాటు జరప తలపెట్టింది. తొలి, రెండోవిడత కౌన్సెలింగ్ అనంతరం 367 సీట్లు మిగిలిపోగా, ఇందులో 84 ఎంబీబిఎస్, 283 బీడీఎస్ సీట్లు ఉన్నాయి. మూడోవిడత కౌన్సెలింగ్‌కు కఠినమైన నిబంధనలను అమలు చేయాలని నిర్ణయించింది. తొలి, రెండు విడత కౌన్సెలింగ్‌లో ఆప్షన్లను ఇచ్చి కోర్సులను ఎంపిక చేసుకున్న విద్యార్థులు వారికి కేటాయించిన ➪ 5వ పేజీలో...



కాళేశ్వరం

జై!



మెట్‌పల్లి ప్రజాభిప్రాయ సేకరణ సభలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్

- పదకొండు గ్రామసభలు పరిసమాప్తం
- మూడో రోజు నిరసనల మధ్య మూడు సభలు నిర్వహణ
- కాంగ్రెస్, అధికార పక్షాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు
- రేపు మరో నాలుగు సభలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి.. గురువారం మూడోరోజు స్వల్ప నిరసనల మధ్య ముగిశాయి. ప్రాజెక్టు వల్ల పర్యావరణ ప్రభావ అంచనా కోసం గత మూడురోజులుగా 11జిల్లాల్లో గ్రామసభలు జరగ్గా, వీటికి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. శనివారం మరో నాలుగు జిల్లాల్లో ఈ గ్రామసభలను కాలుష్యనియంత్రణ మండలి నిర్వహించనుంది. దీంతో ఈ ప్రక్రియ మొత్తం ముగియనుంది. కాగా ప్రజాభిప్రాయసేకరణను అడుగడుగునా అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తున్నదని, సభలు ప్రారంభం కాక ముందే నుండే ఆ పార్టీ కుట్రల ముఠా ఫిర్యాదులు, సభల విచ్ఛిన్నానికి కుట్రలు పన్నిందని మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. బుధవారం మెట్‌పల్లిలో జరిగిన సభలో చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ కాంగ్రెస్ నేతల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తగా, మెదక్‌లో జరిగిన సభలో మాజీ మంత్రి సునితా లక్ష్మారెడ్డి నిరసన వ్యక్తం చేశారు. నిర్మల్‌లో సభ ప్రశాంతంగా జరగ్గా, మొత్తంగా ప్రజలు ప్రాజెక్టును కోరుకుంటున్నారని.. కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రజామోదం ఉందని అధికారులు ప్రకటించారు. ఇప్పటివరకు నిజామాబాద్, కరీంనగర్, యాదాద్రి, మేడ్చల్, పెద్దపల్లి, సంగారెడ్డి, కామారెడ్డి, నల్లగొండ, జగిత్యాల, మెదక్, నిర్మల్ జిల్లాల్లో సభలు ముగియగా.. శనివారం భూపాలపల్లి, రాజన్నసిరిసిల్ల, మంచిర్యాల, సిద్దిపేట జిల్లాల్లో ఈ సభలు జరగనున్నాయి. సభలు అధికారపార్టీ బలప్రదర్శనలుగా మారాయని.. కాంగ్రెస్ నేతలు విమర్శిస్తుండగా, టిఆర్ఎస్ విమర్శలను ఎప్పటికపుడు తిప్పికొడుతోంది. బుధవారం పెద్దపల్లిలో మాజీమంత్రి శ్రీధర్‌బాబు వ్యవహరించిన తీరుపై మంత్రి హరీష్‌రావుతో పాటు టిఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు తీవ్రంగా స్పందించారు. ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమాలు అడ్డుకునేందుకు కాంగ్రెస్ ఉద్దేశపూర్వరంగా కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ముఖ్యమంత్రి కేసీఆర్ ➪ 3వ పేజీలో...

ఆర్టీసీ విభజనకు

రైట్!

- ఉమ్మడి ఆర్టీసీ బోర్డు ఆమోదం
- స్థానికత ఆధారంగా ఆయా రాష్ట్రాలకు ఉద్యోగుల బదిలీలు
- ఆస్తుల పంపకంపై వీడని చిక్కుముడి, 5న మళ్లీ భేటీ
- ఉమ్మడి అకౌంట్లకు అంగీకారం

8

ఎంపీ కవితకు

నారీ ప్రతిభా పురస్కార్

2



ఔరా..!





6

ఇన్ఫోసిస్ కొత్త చైర్మన్

నందన్ నీలేకని

- శేషసాయి, వెంకటేశన్ రాజీనామా

రేపోమాపో మోడీ మెరుపులు

కొత్త కేబినెట్!

- భారీగా శాఖల మార్పులు, చేర్పులు
- ఒకే గొడుకు కిందకు రోడ్డు, రైలు, వాయు మార్గాలు!

2



గుజరాత్ మళ్లీ

మనదే కావాలి

- మోడీ, అమిత్‌షా వ్యూహాలు
- జైట్లీకి బాధ్యతలు అప్పగింత

9













రేపోమాపో మోడీ మెరుపులు

కొత్త కేబినెట్!

- భారీగా శాఖల మార్పులు, చేర్పులు
- ఒకే గొడుగు కిందకు రోడ్డు, రైలు, వాయు మార్గాలు
- నూతన శాఖల విలీనంతో కొత్త పంథా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: త్వరలో జరగబోయే కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో ఎవరూ ఊహించని మార్పులకు ప్రధాని మోడీ శ్రీకారం చుట్టారు. కేవలం కొన్ని శాఖల మంత్రులను మార్చడం, కొత్త వారిని చేర్చుకోవడంతో సరిపెట్టకుండా భారీ ప్రక్షాళనకే పూనుకున్నారు. ఇందులో భాగంగా వేర్వేరుగా ఉన్న కొన్ని శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అన్ని రకాల రవాణా వ్యవస్థలను కలిపి ఒకే మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ప్రధాని మోడీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే కీలక శాఖల్లో సమూల మార్పులకు సిద్ధమయ్యారని సమాచారం. కేబినెట్ పునర్వ్యవస్థీకరణతో పాటు పార్టీ బాధ్యతల్లో సైతం మార్పులు, చేర్పులకు కసరత్తు చేస్తున్నారు. పార్టీ అధినేత అమిత్ షాతో కలిసి చేపట్టిన ఈ కసరత్తు దాదాపు ఒక కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. అంతా అనుకున్నట్టు జరిగితే ఈ శనివారం లేదంటే సోమవారం కొత్త మంత్రివర్గం కొలువుదీరే అవకాశాలున్నాయి.

ఎన్నికలే లక్ష్యంగా యువ సైన్యం

2019 సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ అందుకు తగ్గట్టుగా పావులు కదుపుతోంది. ఈ రెండేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఈ క్రమంలో ఇటు ప్రభుత్వంలో మంత్రులు, అటు పార్టీలోని నాయకులు మరింత చురుగ్గా, క్రియాశీలంగా వ్యవహరించాల్సిన అవసరముందని అధినేతలిద్దరూ భావిస్తున్నారు. ఇందుకోసం యువశక్తి చాలా అవసరమని అనుకుంటున్నారు. మోడీ ప్రధానిగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి వరుసగా కురు వృద్ధ నేతలను పక్కకు పెడుతూ వస్తున్నారు. ''బీజేపీ అంటే అద్వాణీ, అద్వాణీ అంటే బీజేపీ'' అన్న రీతిలో ప్రాచుర్యం పొందిన నేతను కూడా మార్గదర్శక మండలి పేరుతో పక్కన పెట్టిన విషయం తెలిసిందే. అదే తరహాలో మురళీ మనోహర్ జోషి వంటి సీనియర్లనూ పక్కన పెట్టారు. ఆ తర్వాత కేంద్ర కేబినెట్‌లో అనధికారికంగా 75 ఏళ్ల గరిష్ట వయో పరిమితిని అమలు చేస్తూ వచ్చారు. ప్రతి కేబినెట్ పునర్వ్యవస్థీకరణలోనూ 75 ఏళ్లు దాటిన సీనియర్లను పక్కన పెడుతూ వచ్చారు. ఆ క్రమంలో నజ్మా హెప్తుల్లా కేంద్ర మంత్రి నుంచి గవర్నర్‌గా మారారు. ఇదే బాటలో ఇప్పుడు కల్‌రాజ్ మిశ్రాను కూడా కేబినెట్ నుంచి తొలగించనున్నారని తెలుస్తోంది. ఆయన 76వ అడుగుపెట్టిన నేపథ్యంలో ఆయన్ను ఖాళీగా ఉన్న బీహార్ గవర్నర్ పదవికి పంపనున్నారని తెలుస్తోంది. ఇలా మొత్తానికి వయోభారాన్ని వదిలించుకునే పనిలో అమిత్ షా, మోడీలిద్దరూ నిమగ్నమయ్యారు. తద్వారా ఆ ఖాళీలను యువనేతలతో భర్తీ చేయాలని

రాజ్యసభ మంత్రులకు టార్గెట్లు

చూస్తున్నారు. రాజ్యసభ ద్వారా కేంద్ర మంత్రి వర్గంలో కొనసాగుతు న్నవారిపై అదనపు భారం పడనుంది. కొందరిపై వేటు కూడా పడే అవకాశం కనిపిస్తోంది. అలాగని కేబినెట్ నుంచి తొలగించి మూలకు పడేయడం జరగదు. కాకపోతే వారంతా పార్టీ కోసం శ్రమించాల్సి ఉంటుంది. దీన్నిక్కారణం వారంతా పార్టీకి అందించిన సేవల కంటే పార్టీ నుంచి పొందిన ప్రయోజనమే ఎక్కువ. పార్టీ ద్వారా వారంతా రాజ్యసభ సభ్యులయ్యారు. పైగా కేంద్ర మంత్రులయ్యారు. మరి వారు పార్టీకి తిరిగిచ్చిందేంటి అన్న ప్రశ్న లేవనెత్తుతున్నారు. ఈ క్రమంలోనే రాజ్యసభ ద్వారా కేంద్ర మంత్రులైన వారికి కొన్ని రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. మరి కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో గుజరాత్ రాష్ట్ర బాధ్యతల్ని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు అప్పగించారు. అలాగే కర్ణాటక బాధ్యతల్ని ప్రకాశ్ జవడేకర్, పీయూష్ గోయల్‌కి అప్పగించారు. వీరంతా ఈ రాష్ట్రాల్లో పార్టీ గెలుపు కోసం శ్రమించాల్సి ఉంటుంది. ఓవైపు కేంద్ర మంత్రులుగా తమ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పార్టీ కోసం శ్రమించాల్సి ఉంటుంది. కేవలం ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పని చేయడంతోనే సరిపెట్టడం లేదు. రాజ్యసభ మంత్రులందరికీ 2019 ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలోనూ గెలవాలన్న టార్గెట్లు పెడుతున్నారు. అందుకు ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. వారు పోటీచేయాలనుకున్న లోక్‌సభ క్షేత్రాలను నిర్ణయించుకుని, అక్కడ ఇప్పటి నుంచే ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని పని చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ క్రమంలో మోడీ హవాలోనూ ఎదురీదుకుంటా గెలుపొందిన ప్రతిపక్ష నేతల నియోజకవర్గాలను ఒక్కో మంత్రికి అప్పగించారు. కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్‌ను ఢీకొట్టడానికి ప్రకాశ్ జవడేకర్‌ను సిద్ధం చేస్తున్నారు.

2014లో రాహుల్ గాంధీపై అమేథీ నుంచి పోటీ చేసిన స్మృతి ఇరానీని ఈసారి కూడా పోటీ చేయాల్సిందిగా ఆదేశించినట్టు తెలుస్తోంది. కేంద్ర మంత్రులుగా వారికి ఎన్న గుడ్‌విల్‌తో ప్రతిపక్ష నేతలను ఓడించగలిగితే పార్టీకి అదనపు బలముపుతుందన్న వ్యూహంలో బీజేపీ అధినేతలున్నారు. ఒకవేళ ఓడిపోయినా పెద్దగా వచ్చే నష్టం లేదు. వారి రాజ్యసభ సభ్యత్వాలు కొనసాగుతాయి. అయితే ఇదంతా 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న ప్రయత్నం. ఈ క్రమంలో రాజ్యసభ ద్వారా మంత్రులైన కొందరిపై వేటు వేసి పార్టీకి పూర్తిగా అంకితం చేసే అవకాశాలున్నాయి. అందులో ధర్మేంద్ర ప్రధాన్ పేరు తాజాగా వినిపిస్తోంది. అలాగే నిర్మలాసీతారామన్ పేరు కొన్నాళ్ల క్రితం వినిపించింది. వీరికి పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించి కేబినెట్ నుంచి పూర్తిగా తప్పిస్తారని ప్రచారం జరుగుతోంది. ఇలా మొత్తం 6 నుంచి 7 మంది మంత్రులపై వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

శాఖల విలీనం

రైల్వే మంత్రి సురేశ్ ప్రభు రాజీనామాకు సిద్ధపడ్డ తరుణంలో రైల్వే శాఖను ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి అప్పగిస్తారన్న చర్చ మొదలైంది. కేవలం అదనపు బాధ్యతగా అప్పగించకుండా, అన్ని రకాల రవాణా వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి దాన్ని గడ్కరీకి అప్పగిస్తారన్న చర్చ కూడా మొదలైంది. తద్వారా ఉపరితల రవాణా, జాతీయ రహదారులు, రైల్వే, పౌర విమానయానం, జల రవాణా వంటివన్నీ ఒకే గొడుగు కిందకు వస్తాయని అర్థమవుతోంది. అయితే ఈ ప్రతిపాదన చాలా కాలం క్రితం నుంచే ఉన్నప్పటికీ, గత కేబినెట్ విస్తరణలో అమలు చేయలేదు. ఈసారి కూడా అమలు చేస్తారా లేదా అన్న ఆసక్తి నెలకొంది.

వినాయక చవితి శుభాకాంక్షలు: వెంకయ్య



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దేశ ప్రజలకు ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఏదైనా మంచి పనిని ప్రారంభించే ముందు వినాయకుడిని స్మరించడం భారతీయుల ఆచారం అని అన్నారు. ఈ పండుగ దేశప్రజలకు శాంతి, సౌభాగ్యాలను కలిగించాలని వెంకయ్య ఆకాంక్షించారు.

విఘ్నాలు లేకుండా సంక్షేమ పథకాలు కొనసాగాలి : కేసీఆర్



వినాయక చవితి సందర్భంగా ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన అన్ని పథకాలు ఎలాంటి విఘ్నాలు లేకుండా కొనసాగాలని, అన్ని పథకాల ప్రయోజనాలు ప్రజలకు అందించాలని సిఎం ఆకాంక్షించారు.

ఆనందంగా జరుపుకోవాలి : ఉత్తమ్

రాష్ట్ర ప్రజలు ఆనందంగా వినాయక చవితి జరుపుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, ప్రధానంగా రైతులు, నిరుద్యోగులు, కూలీలు కష్టాల్లో ఉన్నారని, వారికి విఘ్నాలు తొలగించి ఆదుకోవాలని వినాయకుడిని ప్రార్థిస్తున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు.

ముస్లిం దంపతులకు కేటీఆర్ ఫిదా..

- ట్విట్టర్ ద్వారా ప్రశంసలు
- ఐదేళ్ళుగా మట్టి గణేష్ ప్రచారానికి హ్యాట్సాఫ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆ ముస్లిం దంపతులు చేసిన పని.. రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి కల్వకుంట్ల తారకరామారావును ఫిదా చేసింది. వినాయకచవితి పండుగను పురస్కరించుకుని.మట్టివినాయకులనే ప్రతిష్ఠించండి, పర్యావరణాన్ని కాపాండండి అంటూ ఆ దంపతులు చేస్తున్న ప్రచారాన్ని కెటిఆర్ చిత్రాలతో సహా తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసిన వాళ్ళ కృషిని ప్రశంసించారు. మహబూ బాబాద్ జిల్లాకు చెందిన మహ్మద్ సుభాని, సలీమా దంపతులు 2013 నుండి మట్టివినాయక విగ్రహాల ప్రాముఖ్యతను వివరిస్తూ , వినూత్నంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. సుభాన్ పంచెకట్టుకుని, చొక్కాలేకుండా శరీరం మొత్తం మట్టిరంగు పులుముకుని మట్టితో చేసిన వినాయకుని ఆకారాన్ని తలపై ధరించి రిక్షామీద గణపతి లాగా కూర్చుంటాడు. ఆ రిక్షాను సలీమా వీధులగుండా తోసు కుంటూ వెళ్తూ మట్టి వినాయకుడి ప్రాముఖ్యత తెలియజేస్తుంది. సుభానీ దంప తులు మహబూబాబాద్‌లో నేను సైతం స్వచ్ఛందసేవా సంస్థను ఏర్పాటుచేసిఅనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తన ట్విట్టర్ ఖాతాకు ఈ ఫొటోను ట్యాగ్ చేయడం తో చూసిన కేటీఆర్ ముస్లిం దంపతులు చేస్తున్న కృషికి ఫిదా అయ్యారు. ఐదేళ్ళు గా ఈ ప్రయ త్నం చేయడం అభినందనీయమంటూ తన కామెంట్‌ను ఫొటోతో పాటు పోస్ట్ చేశారు.

ఆరోగ్య తెలంగాణకు కృషి

- ఎంతో చేసినా... మరెంతో చేయాల్సి ఉంది
- క్యాన్సర్ స్క్రీనింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి
- ఐయామ్ ఎ సర్వైవర్ పుస్తకావిష్కరణలో ఎంపీ కవిత



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆరోగ్యకరమైన తెలంగాణను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెరాస ఎంపి కె.కవిత అన్నారు. వైద్య, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అయినా ఎంతో చేయాల్సి ఉందని ఆమె అన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ నిర్ధారించేందుకు ప్రభుత్వం ఒక కార్యాచరణను అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రశేఖర రావును తాను కోరనున్నట్లు ఆమె చెప్పారు. ప్రాథమిక దశలో వ్యాధి గుర్తిస్తే చికిత్స తేలికవుతుందని, ఇది ఎందరి జీవితాల్లో కొత్త వెలుగులు ఇస్తుందని ఆమె అన్నారు. క్యాన్సర్ వ్యాధినుండి కోలుకున్న వారి వాస్తవ జీవితంలోని విస్మయం కలిగించే స్ఫూర్తిదాయకమైన కథల సంకలనం 'ఐ యామ్ సర్వైవర్' అనే పుస్తకాన్ని గురువారం ఆమె ఆవిష్కరించారు. ప్రముఖ అంకాలజిస్ట్, అపోలో క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ విజయ ఆనంద్‌రెడ్డి రచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ జిఎన్ రావు, క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్, అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి, పుస్తక రచయిత డాక్టర్ విజయ్ ఆనందరెడ్డి హాజరయ్యారు. క్యాన్సర్ వ్యాధిబారినపడి వైద్యచికిత్సతో పూర్తిగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో నూతన జీవితాన్ని అనుభవిస్తున్న వారు ఈ సందర్భంగా తమ అనుభవాలను వివరించారు. 108 మంది క్యాన్సర్ రోగులకు కొత్త జీవితాన్ని ప్రసాదించే విధంగా డాక్టర్ విజయ ఆనంద్‌రెడ్డి మానవీయ కోణంలో చికిత్స చేసి తమలో మనోధైర్యాన్ని కల్పించడంతో పాటు ఆధునిక చికిత్స చేశారని క్యాన్సర్ వ్యాధిని అధిగమించిన పలువురు చెప్పా రు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, దేశంలో ఏటా 10 లక్షల మందికి క్యాన్సర్ వ్యాధి స్క్రీనింగ్ చేస్తున్నారని, ఇందులో వేలాది మందికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అవుతోం దని, ప్రాథమిక దశలోనే గుర్తించడంతో ఎందరో ప్రాణాపాయం నుంచి బయట పడుతున్నారని అన్నారు. నిజామాబాద్ నియోజ కవర్గంలో అపోలో హాస్పిటల్స్ గ్రూపు సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తున్నామని, వ్యాధి లక్షణాలు నిర్ధారణ అయితే వెంటనే చికిత్స చేయిస్తున్నట్లు ఆమె చెప్పారు. క్యాన్సర్ వ్యాధి చికిత్సకు ఒకపుడు తలవెంట్రుకలు ఊడిపోయేవని, కానీ ఇప్పుడు కొత్త టెక్నాలజీతో అలాంటి సమస్యలను అధిగమిస్తున్నారని ఆమె అన్నారు. ప్రజా ప్రతినిధులుగా సమాజానికి తమవంతు కర్తవ్యం నిర్వహిస్తున్నామని కవిత అన్నారు. వైద్యరంగంలో వస్తున్న టెక్నాలజీ, డాక్టర్ల అంకితభావంతో క్లిష్టమైన వ్యాధిబారిన పడిన వారిని కాపాడి వారికి కొత్త జీవితాలు ప్రసాదించడంలో డాక్టర్లు ప్రధాన భూమిక వహిస్తున్నారని ఆమె అన్నారు.

లక్ష్మణ్ మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల పట్ల సానుభూతి చూపించడం కాదని, మానవీయ కోణంలో వారికి చేయూత ఇవ్వాలని కోరారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని, ప్రాథమిక దశలోనే గుర్తిస్తే దాని అధిగమించడం సమస్య కాదన్నారు. తమ తోటి క్రికెటర్ యువరాజ్ సింగ్ క్యాన్సర్ వ్యాధి లక్షణాలతోనే ఇంగ్లాండ్‌లో క్రికెట్ మ్యాచ్ ఆడారని, ఆ తర్వాత పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయిందని గుర్తుచేశారు. యువరాజ్ సింగ్‌కు తన తల్లి అండగా నిలిచి మనోధైర్యం కల్పించగా, వైద్యులు ఉన్నతమైన చికిత్స చేసి మామూలు మనిషిని చేశారని లక్ష్మణ్ చెప్పారు. ప్రతివ్యక్తి క్రమేపీ వైద్యపరీక్షలు చేయించుకోవాలని, దీనిపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని లక్ష్మణ్ అన్నారు.సంగీతారెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఏటా 7 లక్షల మంది పిల్లలు క్యాన్సర్ వ్యాధిబారిన పడుతున్నారని అన్నారు. క్యాన్సర్‌ను అధిగమించిన వారిలో 80శాతం మంది మొదటి ఒకటి, రెండు దశల్లో వ్యాధి నిర్ధారణ అయిన వారేనని ఆమె చెప్పారు. జాతీయ స్థాయిలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని సంగీత కోరారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని, ఈ వ్యాధి గురించి తెలియని వారందరికీ విద్యావంతులు వివరించాలని ఆమె కోరారు. క్యాన్సర్ చికిత్సలో ప్రోటాన్ థెరఫీ టెక్నాలజీని త్వరలో తమ హాస్పిటల్స్‌లో అందుబాటులోకి తేనున్నామని, ఇది దేశంలోనే మొదటి వైద్య ప్రక్రియ అని సంగీత చెప్పారు.

కొలువుదీరిన గణనాథుడు

- ఘనంగా పూజలు అందుకోనున్న ఖైరతాబాద్ వినాయకుడు
- భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్న గణపయ్య
- రాష్ట్రమంతటా వెలసిన లంబోదరుడి మంటపాలు
- నేటి నుంచి పదకొండు రోజులు ఉత్సవాలు
- మట్టి విగ్రహాలనే పూజించాలి: రాష్ట్ర మంత్రులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆది దేవుడి వేడుకలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి పదకొండు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలు అత్యంత శోభాయమానంగా, కన్నుల పండువుగా నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా రాష్ట్రంలో లక్షలాది వినాయక మండపాలు వెలిశాయి. ఒకవైపు భక్తిభావాన్ని చాటుతూనే....మరోవైపు రకరకాల మండపాలను ఏర్పాటు చేశారు. రాజుల కాలం నాటి కోటలు, వివిధ దేవాలయాల నమూనాలతో పాటు అనేక విధాల మంటపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇక ప్రతి సంవత్సరం మాదిరిగానే నగరంలోని ఖైరతాబాద్ వినాయకుడి ప్రతిమ ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్శిస్తోంది. 63వ సంవత్సరం శ్రీ చండీకుమార అనంత మహాగణపతిగా పూజలు అందుకోనున్నారు.ఈ వినాయకుడికి దేశ, విదేశాల్లోను అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రపంచంలో ఎక్కడున్న తెలుగువారు మాత్రం ఖైరతాబాద్ వినాయకుడిగి గురించి తెలుసుకోకుండా ఉండలేరు. దీనిని బట్టే ఈ వినాయకుడికి ఉన్న ప్రాధాన్యతను తెలుసుకోవచ్చు. కాగా ఈ వినాయకుడి మొదటి పూజా కార్యక్రమాల్లో గవర్నర్ దంపతులు పాల్గొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ఈ పూజా కార్యక్రమం జరగనుంది. ఈ పూజా కార్యక్రమంలో పలువురు రాష్ట్ర మంత్రులు, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారుల కూడా పాల్గొంటారు. కాగా గవర్నర్ దంపతులు పూజకు హాజరుకానున్న నేపథ్యంలో సెంట్రల్ జోన్ డీసీపీ జోయల్ డేవిడ్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే స్వామిని దర్శించుకు నేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం తెల్లవారు జామున కమిటీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించి పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతారు. ఉదయం ఏడు గంటలకు ఖైరతాబాద్ పద్మశాలి సంఘంఆధ్వర్యంలో 73 అడుగుల కండువ, జంధ్యాన్ని ఏకదంతునికి అందించనున్నారు. రాజ్‌దూత్ చౌరస్తా నుంచి వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యా ల నడుమ స్వామికి వారికి చేనేత కండువను, జంధ్యాన్ని తీసుకవస్తారు.తెలుగు ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే తొలిపండుగ వినాయక చవితి అని రాష్ట్ర డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. ఎటువంటి విఘ్నాలు ఎదురుకాకుండా ఉండేందుకు మనం పూజిస్తున్న విఘ్నేశ్వరుడి విగ్రహాలను మట్టితో తయారు చేసిన ప్రతిమలకే ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు.


శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్



వినాయక పండుగను పురస్కరిం చుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు ఇరు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు ప్రజల్లో మరింత సోద రభావాన్ని, ఆప్యాయతను పెంపొం దిస్తాయ న్నారు. కుల, మతాల కు అతీతంగా జరుపుకునే ఈ వేడుకలకు ఎలాంటి విఘ్నాలు లేకుండా సాఫీగా, ప్రశాంతంగా జరుపుకో వాలని ఆకాంక్షించారు. అలాగే ఆ దేవుడి ఆశీస్సులను కూడా ప్రజలకు అందించాలని కోరుకుం టున్నట్లు గవర్నర్ పేర్కొ న్నారు.

కవితకు నారీ ప్రతిభా పురస్కార్

అవార్డును అందజేసిన కేంద్ర ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వశాఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రతిష్టాత్మక నారీప్రతిభా పురస్కార్ అవార్డు నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితను వరించింది. యువత, మహిళా సాధికారిత కోసం కృషి చేసినందుకు గాను ఎంపీ కవితను మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ మంత్రిత్వశాఖ, విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేశాయి. గురువారం హైదరాబాద్‌లోని వీ ఇండియా చైర్మన్ డాక్టర్ టి.వసంతలక్ష్మి ఎంఎస్‌ఎంఈ తరుపున ఎంపీ కవితకు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అంజేసి శాలువా కప్పి సన్మానించారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానో త్సవ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండగా, నిజామా బాద్ జిల్లా పోచంపాడు వద్ద ఎస్సారెస్పీ పునరుజ్జీవ సభ ఏర్పాట్లలో బిజీగా ఉండడంతో కవిత హాజరుకాలేకపోయారు. ఈ నేపథ్యంలో ఎంఎస్‌ఎంఈ మంత్రి కల్‌రాజ్ మిశ్రా ఆదేశాల మేరకు వసంతలక్ష్మి హైదరాబా ద్ వచ్చి అవార్డును అందజేశారు. మొదటిసారి ప్రవేశపెట్టిన నారీ ప్రతిభాపురస్కార్ 2017 అవార్డును ఎంపీ కల్వకుంట్ల కవితతో పాటు వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన కల్పకం ఏచూరి, ఆషా ప్రకాష్, స్మృతి నాగపాల్, ప్రియా భార్గవ, షిర్లే అబ్రహం అవార్డును అందుకున్నారు. వీరితో పాటు తెలంగాణ ప్రభుత్వం మహిళా లక్షణ కోసం ఏర్పాటుచేసిన షీటీమ్స్ బాధ్యతలు చూస్తున్న ఐపిఎస్ స్వాతిలక్రా కూడా అవార్డును అందుకోవడం తెలంగాణకు గర్వకారణం. అటు సమాజాన్ని చైతన్యపరుస్తూనే యువత తమ కాళ్ళ మీద తాము నిలబడేలా చేసి సమాజాన్ని చైతన్యపరచడంలో ఐకాన్‌గా నిలిచారన్నారు. కార్యక్ర మంలో తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రయినింగ్ సెంటర్ సిఎఓ డాక్టర్ జగన్మోహనరావు, సిఈవో అబ్దుల్ బాసిత్, ప్రోగ్రాం మేనేజర్‌లు, అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్‌లు, తెలంగాణ జాగృతిరాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజీవ్‌సాగర్, మంచాల వరలక్ష్మి, మహిళావిభాగం కన్వీనర్ డాక్టర్ ప్రభావతి, యూత్, స్టూడెంట్స్ కన్వీనర్లు కోరబోయిన విజయక ఎనార్, పసుల చరణ్, రాష్ట్ర కార్యదర్శులు రోహిత్ రావు, విక్రాంత్ రెడ్డి, మర్యాద కృష్ణారెడ్డి, విక్షితి, కుమారస్వామి పాల్గొన్నారు.

పర్యావరణం కోసం మట్టి విగ్రహాలు

- మట్టి గణనాథులను పంచిన అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి
- కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలి: హరీశ్‌రావు



సిద్దిపేట, కెఎన్ఎన్: అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ రకాల సేవా కార్యక్రమాలతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతీ యేట మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమని రాష్ట్రభారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. పట్టణంలోని వెంకటేశ్వరాలయం వద్ద అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యం లో చేపట్టిన మట్టి వినాయక విగ్రహా ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రజలను సకల సంతోషాలతో ఉంచాలనే భగవంతు డిని ప్రార్థిస్తూ ప్రకృతికి హాని చేస్తూ పర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలను ఏర్పాటు చేసి తోటి మానవులను ఇబ్బందులకు గురి చేస్తున్నా మన్నారు. హోటల్‌కు వెళ్లినప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడానికి నిమ్మకాయను వాడుతాం కాని తాగడానికి మాత్రం ప్రాణానికి హాని చేసే ఆర్ట్‌పిక్చర్ జ్యూస్‌ను తాగుతామన్నారు. కోమటి చెరువును అందరి సహాయ సహకారాలతో పర్యావరణాన్ని కాపాడుకునే విధంగా చర్యలు చేపట్టి ఒక గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాల న్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టే అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి పట్టణంలోని ఒక రోడ్డులోని చెట్లను పరిరక్షించేం దుకు దత్తత తీసుకొని అందులో సభ్యులైన తనతో పాటు ప్రతీ ఒక్కరు చెట్లను కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. రోజు రోజుకు పట్టణంలో వాహనాల రద్దీ పెరిగి కాలుష్యం ఎక్కువై పర్యావరణా న్ని కాటేస్తుందన్నారు. దానిని నివారించేందుకు చెట్లను పెంచడమే పరిష్కారం అన్నారు. అనంతరం ప్రజలకు మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, అమర్ నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు చికోటి మదుసుధన్, బండ అంజయ్య, ఇల్లెందుల అంజయ్య, గంప మహేందర్ రావు, నందిని శ్రీనివాస్, కాశీనాథం, శ్రీనివాస్, చిన్నా, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కైలాసం పాల్గొన్నారు.

కొత్త సంవత్సర కానుకగా భగీరథ నీళ్ళు



(మొదటిపేజీ తరువాయి)

మిషన్ భగీరథపై ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ సెప్టెంబర్ నుంచే పంపులు ప్రారంభించాలని, డిసెంబర్ నాటికి వందకు వందశాతం పూర్తి కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వానికి మిషన్ భగీరథ జీవన్మరణ సమస్యఅని, అధికారులు, ప్రజాప్రతి నిధులు, వర్కింగ్ ఏజెన్సీలు రేయింబవళ్లు పనిచేసి లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. ఎక్కడ చిన్న జాప్యం జరిగినా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ఏ సమస్య వచ్చినా జోక్యం చేసుకొని పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

రూ.43వేల కోట్ల వ్యయంతో దేశంలో మరెక్కడా లేని విధంగా యావత్ రాష్ట్రం కోసం ఇంత పెద్ద పథకం తెస్తున్నామని సీఎం చెప్పారు. అతి పెద్ద సవాల్ తీసుకున్నాం, కనుక ఇకపై తానే స్వయంగా కార్యక్షేత్రాలను సందర్శించనున్నట్లు ఆయన చెప్పారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ పరిధిలో పనులను నిరంతరం సమీక్షించాలని, పర్యటనలు జరపాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ సెగ్మెంట్ల పరిధిలో జరుగుతున్న ఇంటెక్‌వెల్స్, వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, విద్యుత్ సరఫరా, వర్కింగ్ ఏజెన్సీల పనితీరు, పైపులైన్ల నిర్మాణం, రిజర్వాయర్లలో నీటి విలువ, అంతర్గత పనులు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు.

19 ఇంటెక్‌వెల్స్‌లో 16 పూర్తయ్యాయని, మిగతావి త్వరలో పూర్తవుతాయని అధికారులు చెప్పారు. 50 ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో 15 పూర్తయ్యాయని, 27 పూర్తి కావచ్చాయని, మిగతా 8 పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 49,238 కిలోమీటర్ల పైపులైన్లకుగానూ 43,427 (88శాతం) పైపులైన్లు సిద్ధంగా ఉన్నయాని తెలిపారు. 421 సంపుల్లో 247 పూర్తయ్యాయని, 143జీఎల్‌బీఆర్‌లో 73 పూర్తయ్యాయని, 562 ఓహెచ్‌బీఆర్లో 192 పూర్తయ్యాయని, 248 పంపుహౌజ్‌ల్లో 51 పూర్తయ్యాయని, మిగతావి కొద్ది రోజుల్లో పూర్తవుతాయని అధికారులు చెప్పారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్మించాల్సిన సబ్‌స్టేషన్లు, విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనులు అన్ని నిర్ణీత ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయని అధికారులు వివరించారు. గ్రామాల్లో అంతర్గత పనులు మినహా మిగతావన్నీ డిసెంబర్ చివరినాటికి పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. .

ఈఏడాది డిసెంబర్ చివరినాటికల్లా పనులు పూర్తి చేసి అన్ని గ్రామాలకు శుద్ధి చేసిన నదీ జలాలను జనవరి 1నాటికి నూతన సంవత్సర కానుకగా ప్రజలకు అందించాలని సీఎం కేసీఆర్ సూచించారు. ఆ తర్వాత ఆరునెలల్లో గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు, నల్లాలు బిగించడం లాంటి పనులు పూర్తి చేయాలని సీఎం చెప్పారు. వచ్చే నెల నుంచి ఇంటెక్‌వెల్స్ నుంచి డబ్ల్యూటీపీల ద్వారా మంచినీటిని పంపింగ్ చేయడం ప్రారంభించాలని చెప్పారు. మొదట్లో బాలారిష్టాలు తప్పవని, ఎప్పటికప్పుడు ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలని సీఎం చెప్పారు..పనులు చేసే వర్కింగ్ ఏజెన్సీలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఏజెన్సీలు సమాఖ్యగా ఏర్పడి పరస్పరం సహకరించుకోవాలన్నారు. ఎక్కడైనా పనిలో జాప్యం జరిగినా, ఏజెన్సీలకు వేరే ఇబ్బంది వచ్చినా ఇతర ఏజెన్సీలు జోక్యం చేసుకొని సహకరించుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ పథకం కేవలం ప్రభుత్వానికే కాదని, వర్కింగ్ ఏజెన్సీలకు కూడా ప్రతిష్టాత్మకమని అన్నారు. ఇంత గొప్ప పనిచేయడం మీకు కూడా గౌరవప్రదమని, మంచి అనుభవమని అన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఏ మాత్రం పెండింగు లేకుండా బిల్లులు చెల్లిస్తున్నదని తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేసిన వారికి 1.5శాతం ఇన్సెంటివ్ కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని వర్కింగ్ ఏజెన్సీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఏజెన్సీ సకాలంలో పనులు పూర్తి చేసి ఇన్సెంటివ్ అందుకోవాలని కోరారు. ఎక్కడ ఏ సమస్య తలెత్తిన స్థానికంగా ఉండే మంత్రులు, ఎమ్మెల్యేలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇంత సహకారం అందుతున్నా పనుల్లో జాప్యం జరిగితే మాత్రం సహించమని తెలిపారు. పనులు ఆలస్యంగా చేస్తున్న వర్కింగ్ ఏజెన్సీల నుంచి పనులను తప్పించడానికి కూడా ప్రభుత్వం వెనుకాడదని హెచ్చరించారు.

ఇంటెక్‌వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం పూర్తయ్యేనాటికి వాటికి కావలసిన కరెంట్ కూడా అందుబాటులోకి రావాలని తెలిపారు. దానికి అనుగుణంగా సబ్‌స్టేషన్ల నిర్మాణం జరగాలన్నారు. విద్యుత్ కేటాయింపు జరగాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా అందాలన్నారు. మిషన్ భగీరథ పనులను పర్యవేక్షించేందుకు ట్రాన్స్‌కో, ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్‌లకు చెందిన ముగ్గురు అధికారులను ప్రత్యేకంగా నియమించాలని సీఎం కేసీఆర్ సూచించారు.

జలశయాల నీటిని వాడుకొనే విషయంలో మంచినీటికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అందుకోసమే ప్రాజెక్టుల్లో 10శాతం నీటిని మంచినీటి కోసం కేటాయిస్తూ చట్టం తెచ్చామని తెలిపారు. తెలంగాణలోని అన్ని బ్యారేజీలు, రిజర్వాయర్లలో 10శాతం నీటిని మిషన్ భగీరథకు కేటాయిస్తామని తెలిపారు. దీని కోసం నీటిపారుదలశాఖతో కలిసి అంచనాలు రూపొందించాలని సూచించారు. ఏ రిజర్వాయర్లలో ఎంతమేర ఎండీడీఎల్ ఉంచాలో నిర్ణయించాలని తెలిపారు. దీని కోసం ప్రాజెక్టు ఆపరేషన్ మాన్యువల్ మార్చాలన్నారు. రాష్ట్రంలోని 19 ప్రాంతాల్లోని నీటి వనరుల్లో కేవలం దుమ్ముగూడెం వద్ద మాత్రమే 365 రోజులు నీటి లభ్యత ఉంటుందన్నారు. మిగతా 18 నీటి వనరుల్లో ఎప్పుడ నీరు అందుబాటులో ఉండడం కోసం ఎండీడీఎల్ ఉండేలా చూడాలని తెలిపారు.

రాబోయే 30ఏళ్లల్లో అవసరాలను దృష్టిలో ఉంచుకొని మిషన్ భగీరథ పథకాన్ని రూపొందించామని తెలిపారు. దీనికి అనుగుణంగా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మేర మంచినీటిని అందించే ఏర్పాటు చేయాలన్నారు. ట్యాంకులు, పైపులైన్ల సామర్థ్యాన్ని మరోసారి మదింపు చేయాలన్నారు. అవసరమైతే ట్యాంకుల సంఖ్య, వాటి నీటి విలువ సామర్థ్యం పెంచాలన్నారు. ఇందుకోసం ప్రతి జిల్లాలో మంత్రుల సమక్షంలో ఎమ్మెల్యేలు, అధికారులు సమావేశమై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

సమావేశంలో వర్కింగ్ ఏజెన్సీలు జీఎస్టీ వల్ల తమపై అధికభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పరికరాలు, మెటీరియల్ కొనుగోలు సందర్భంగా తాము 18శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తుందని, దీనివల్ల నిర్మాణ వ్యయం పెరుగుతుందని చెప్పారు. సీఎం కేసీఆర్ చొరవ తీసుకొని జీఎస్టీని తగ్గించడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. దీనికి స్పందించిన సీఎం ప్రజోపయోగ పనులకు అధిక జీఎస్టీ విధించవద్దని తాము కేంద్రాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే హైదరాబాద్‌లో జరిగే జీఎస్టీ సమావేశంలనూ ఈ అంశాన్ని గట్టిగా ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రం కూడా సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం స్పందించకుంటే వర్కింగ్ ఏజెన్సీలకు నష్టం కలగని విధంగా విధానం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మంత్రులు ఈటెల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తమ్మల నాగేశ్వరరావు, జగదీష్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, మహేందర్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్ రావు, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్పీ సింగ్, సీఎం కార్యదర్శి స్మీతా సభర్వాల్, ఈఎన్‌సీ బీ సురేందర్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను అధిగమించాం

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూడు కార్యక్రమాల్లో నిరంతర విద్యుత్, రైతులకు సాగునీటిని అందించడం, ప్రజలకు సురక్షిత తాగునీటి అందించడమని తెలిపారు. విద్యుత్ సమస్యను విజయవంతంగా అధిగమించామన్నారు. 45శాతం వ్యవసాయ పంపుసెట్లకు 24గంటల విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే 100శాతం పంపుసెట్లకు 24గంటలు ఉచిత విద్యుత్ అందిస్తామని తెలిపారు. విద్యుత్ రంగంలో అద్భుత విజయం సాధించాం. సాగునీరు అందించడం కోసం ప్రాజెక్టుల నిర్మాణం జరుపుతున్నామని తెలిపారు. బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించడంతో పాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి నిధులను సమకూర్చు కున్నామని తెలిపారు. మొత్తం ఏడాదికి రూ.58వేల కోట్ల వరకూ నీటిపారుదలశాఖ ప్రాజెక్టులకు ఖర్చు పెడుతున్నా మని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే ఏడాది నుంచే గోదావరి జలాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణం పనులు అనూహ్యంగా జరుగుతున్నాయని, ప్రగతి నిరోధక శక్తులు, ప్రతీపశక్తులు ఆటంకాలు కలిస్తున్నా ప్రభుత్వం మొండి పట్టుదలతో ముందుకు పోతున్నదని తెలిపారు. ప్రాజెక్టులను శరవేగంగా నిర్మిస్తున్నామన్నారు.

మిషన్ భగీరథ పనులు నిర్ణయించుకున్న ప్రకారం జరుగుతున్నాయని, అధికారులు, ఇంజనీర్లు, వర్కింగ్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. దేశంలో ఇంతపెద్ద పని మరెక్కడా జరగదన్నారు. ఇది అతి గొప్ప ఇంజనీరింగ్ ఫీట్ అని అన్నారు. ఇప్పటికే 11 రాష్ట్రాలు వచ్చి చూసిపోయాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రశంసించింది. నీతిఆయోగ్ కొనియాడిందన్నారు. ఇతర దేశాల ప్రతినిధులు వచ్చి చూస్తున్నారని తెలిపారు. ఆర్థిక సంస్థలు మిషన్ భగీరథను చూసి అబ్బురపడుతున్నారని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ఇంత గొప్ప కార్య క్రమంలో పాలుపంచుకోవడం మనందరికీ గౌరవమని అన్నారు. ఇంతటి గొప్ప పనిని మరింత బాధ్యతగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడా ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరమైన సహకారం అందిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి స్వయంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అని కేసీఆర్ అన్నారు.

రేపు తెలంగాణ భవన్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేల భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈనెల 26న మధ్యాహ్నం 2గంటలకు తెలంగాణ భవన్‌లో టిఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిర్ణయించారు. 80ఏండ్ల తర్వాత రాష్ట్రంలో భూరికార్డులను ప్రక్షాళన చేసే కార్యక్రమం జరుగుతుండడంతో దీనిని విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు పోషించాల్సిన బాధ్యతపై సిఎం ప్రజాప్రతినిధులకు వివరించనున్నారు. గ్రామ, మండల, జిల్లా రైతుసంఘాల నిర్మాణం కూడా జరగాల్సి ఉన్నందున.. ప్రజాప్రతినిధులు ఎలా వ్యవహరించాలన్న దానిపై సిఎం క్లాస్ తీసుకున్నారు. ఏడాది తర్వాత ఎన్నికలు జరగనున్నందున.. ఈ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎలా ముందుకు వెళ్ళాలి, భవిష్యత్‌కు ఎలా వినియోగించుకోవాలి అన్న అంశాలపై సిఎం సమావేశంలో వివరించనున్నారు.

కాళేశ్వరం ప్యాకేజీ జిల్లాకు వరం

ప్రజాభిప్రాయ సేకరణలో ముక్తకంఠంతో నినదించిన రైతులు, ప్రజాప్రతినిధులు



నిర్మల్, కెఎన్ఎన్ : తెలంగాణ రైతాంగానికి దిక్సూచి కాళేశ్వరం ప్రాజెక్టు అని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నూతనంగా ఏర్పడిన నిర్మల్ జిల్లాకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా పర్యావరణ ఈఈ బిక్షపతి, ఎంపీ గెడం నాగేశ్, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌లు పేర్కొన్నారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ మున్సిపల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కాళేశ్వరం 27, 28 ప్యాకేజీపై ప్రజాభిప్రాయ సేకరణను జిల్లా కలెక్టర్ ఇలంబరిది, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, ఆర్డీఓ ప్రసూన్నాంబలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే నిర్మల్ జిల్లాకు ఎంతో మేలు జరుగుతుందని, పర్యావరణ అనుమతుల విషయంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారు స్పష్టం చేశారు. అలాగే అధికారులు మాట్లాడుతూ తాము సేకరించిన ప్రజాప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆంధ్రా ప్రాంత పాలకుల నిర్లక్ష్యంగానే కాళేశ్వరం ప్రాజెక్టు కుంటుపడిందన్నారు. వృధాగా సముద్రంలోకి పోతున్న నీటిని ఒడిసి పట్టుకుని తెలంగాణలోని 13 జిల్లాల్లో 18.26 లక్షల ఎకరాలు సాగులోకి వస్తుందని, దీంతో తమకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. కాళేశ్వరం నుండి ప్యాకేజీ 27 ద్వారా నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండల శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలాశయం నుండి గ్రావిటి కాలువ ద్వారా నీరు సరఫరా అయినట్లయితే సుమారు 37వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని రైతులు పేర్కొన్నారు.

ప్రాజెక్టును అడ్డుకునే నేతలను తరిమికొట్టాలి

మెట్‌పల్లి, కెఎన్ఎన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టులను ఆపే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రాకుండా తరిమికొట్టాలని ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం పట్టణంలోని నరేందర్‌రెడ్డి గార్డెన్స్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజి నం.21 పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా 13 జిల్లాల్లో 19 లక్షల ఎకరాల సాగు భూమికి నీటి పారుదల కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్



ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. జలయజ్ఞం చేస్తూ ముఖ్యమంత్రి ప్రాజెక్టులు నిర్మాణానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరందించి రైతే రాజుగా కావాలని ఆకాంక్షిస్తూ ఈ కాళేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల కు 3 గంటల కరెంటు ఇవ్వడానికి నానా తంటాలు పడేవారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెరాస ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంటుతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రివర్స్ పంపింగ్‌తో వరదకాలువ ద్వారా ఎస్సారెస్పీ ప్రాజెక్టును నింపి లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించి సిఎం కేసిఆర్ అపరభగీరధుడు అయ్యారన్నారు. రైతలు గురించి మాట్లాడే నైతిక అర్హత కాంగ్రెస్‌కు లేదని, రైతులను నట్టేట ముంచింది కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు.

కాళేశ్వరం జై!

(మొదటిపేజీ తరువాయి)

సంకల్పమని, దాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఈ సందర్భంగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. 15జిల్లాల్లో 18లక్షల ఎకరాల ఆయకట్టుకు నేరుగా, మరో 18లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది.

కుట్రలు.. ఇవీ..

కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదంటూ.. మంత్రి హరీష్‌రావు గురువారం ఓ చిట్టా విడుదల చేశారు. ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టులో ఇమిడి ఉన్న డిజైన్ సమస్యల నుండి వివాదాలు సృష్టిస్తున్నదంటూ పేర్కొన్నారు. 152అడుగులపై తొలుత రాద్ధాంతం.. ఆందోళనలు చేశారని, ప్రభుత్వం అంతరాష్ట్ర సమస్యను.. నేర్పుగా పరిష్కరించి ఒప్పందాలు చేసుకుంటే భూసేక రణకు ఆటంకాలు సృష్టించారన్నారు. ఆ తర్వాత 123 జీవోకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్ళారని, పర్యావరణ అనుమతులు లేవంటూ ట్రిబ్యునళ్ళను ఆశ్రయించారన్నారు. ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమం చేపడితే.. ఆపాలంటూ మర్రి శశిధర్ రెడ్డి ఢిల్లీలో ఫిర్యా దులు చేశారని, పర్యావరణ అనుమతులు రాకూడదని అడ్డుకునే కుట్రలు చేస్తున్నారన్నారు.

సీఎం సంకల్పాన్ని ఎవరూ ఆపలేరు

• కాంగ్రెస్ అడ్డు పడటం సిగ్గుచేటు • కాళేశ్వరం ప్రాజెక్టు అభిప్రాయ సేకరణలో వక్తలు

మెదక్, కెఎన్ఎన్ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం సీఎం కేసీఆర్ సంకల్పమని, దాన్ని ఎవరూ అడ్డుకోలే రని అధికార ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకులు స్పష్టం చేశారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి అధ్యక్షత వహించగా ఉమ్మడి జిల్లా నుంచి టిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రతి నిధులు, రైతులు పాల్గొన్నారు. ప్రజాభి ప్రాయం ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి సునీతారెడ్డి విమర్శలు చేసి నిరసన వ్యక్తం చేయగా అధికార పార్టీ నేతలు ఎదురుదాడికి దిగారు. దీంతో సునీతారెడ్డి సదస్సులో నుండి నిరసన వ్యక్తం చేస్తూ వెళ్ళిపోయారు. అనంతరం సదస్సు రాజకీయ విమర్శలకు వేదికగా మారింది.



ఇలావుండగా గోదావరి జలాలు సము ద్రంలో వృధాగా తరలి వెళ్ళకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపడితే తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని, ఇందుకు ఎవరు అడ్డువచ్చినా ఆపేది లేదని ప్రజాప్రతినిధులు, రైతులు అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆవశ్యకత ఎంత అవసరమో సదస్సులో అధికార పార్టీకి చెందిన నేతలు వెల్లడిం చగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు తాము ప్రాజె క్టులకు అడ్డంకి కాదని, ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంగా, రైతులకు సరియైన నష్టపరి హారం చెల్లించ కుండా భూ సేకరణపై అభిప్రా యాలు అడగడం సరికాదన్నారు. సమావేశంలో అధిక శాతం అధికార పార్టీకి చెందిన నేతలే ఎక్కువగా ఉండ డం, ఇతర పార్టీల నేతల మధ్య అభిప్రాయ సేకరణలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమ య్యాయి. అధికార పార్టీ నేతలు, రైతు సంఘం ప్రతినిధులు కాళేశ్వరం ప్రాజెక్టుముఖ్యమని, నీళ్ళు లేకుంటే అభివృద్ధి ఉండదని ఇందుకు అడ్డు చెప్పవద్దని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి సునీతారెడ్డి మాత్రం ప్రజాభి ప్రాయం ఏకపక్షంగా ఏర్పాటు చేశారని, గ్రామాల్లో రైతులకు సమా చారం ఇవ్వకుండానే సదస్సు ఏర్పాటు చేశారని ఆరోపించారు.

దౌర్జన్యంగా ప్రజాభిప్రాయ సేకరణ

• శ్రీధర్‌బాబు తదితర నేతల అరెస్టు అక్రమం

• ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్సే: జానారెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణను దౌర్జన్యంగా, భయపెట్టి జరుపుకోవడం టీఆర్ఎస్ నేతలకు సరికాదని, అది చట్టవిరుద్ధమని సీఎల్పీ నాయకుడు కె జానారెడ్డి విమర్శించారు. పర్యావరణంపై స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పుకునే పరిస్థితులకు విఘాతం కలిగించడం తగదన్నారు. గురువారం శాసనసభ మీడియా హాలులో ఆయన మండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్‌తో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు కట్టిందే కాంగ్రెస్ పార్టీ అనీ, ప్రాజెక్టులకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అధికారులు కూడా చట్టబద్ధంగానే అభిప్రాయాలు సేకరించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవసరమా అని అభిప్రాయ సేకరణ జరుగుతుందని తెలిసిందని, అలా చేయడం చట్ట విరుద్ధమని, పర్యావరణంపై ప్రభావంపైనే అభిప్రాయాలు సేకరించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతల ఒత్తిడులకు తలొగ్గవద్దని కోరారు.

పెద్దపల్లిలో అభిప్రాయ సేకరణ సందర్భంగా మాజీ మంత్రి డి శ్రీధర్ బాబు తదితరులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అక్రమమని జానారెడ్డి మండిపడ్డారు. టీఆర్ఎస్ ఆగడాలతో కార్యక్రమం రసాభాసగా మారిందని, టీఆర్ఎస్ నేతలు ఒక పథకం ప్రకారం కాంగ్రెస్ కార్య కర్తలను కొట్టారని, గొడవ చేశారని, పోలీసులు సైతం అధికార పార్టీకి మద్దతుగా లాఠీ చార్జీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తించాలని, పోలీసులు తమ బాధ్యతలు విస్మరిస్తే వ్యవస్థకే చెడ్డపేరు వస్తుందని జానారెడ్డి హెచ్చరించారు. పెద్దపల్లి ఘటనలో బాధితులకు చికిత్స చేయించాలని, కేసులు ఎత్తివేయాలని జానారెడ్డి డిమాండ్ చేశారు. నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. శాసనసభ సాక్షిగా ప్రజాసమస్యలపై అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటానన్న కేసీఆర్ వాటిని పట్టించుకోవడం లేదని, ఆయన చెప్పడమే గాని చేసి చూపించడం లేదన్నారు.

పెద్దపల్లిలో ప్రజాస్వామ్యం ఖూనీ : షబ్బీర్

పెద్దపల్లిలో పట్టపగలు ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని షబ్బీర్ అలీ ఆరోపించారు. లా అండ్ ఆర్డర్‌ను కాపాడే వారు అధికార పార్టీకి తొత్తులుగా మారి కాంగ్రెస్ నాయకులపై దౌర్జన్యంచేశారని విమర్శించారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వారి ఫోన్‌లు లాక్కున్నారని, ప్లకార్డులు సైతం తీసుకుపోనివ్వలేదని, అడుగడుగునా తనిఖీలు నిర్వహించారని, దీన్ని బట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఏమైనా చేస్తారనే భయానక వాతావరణాన్ని సృష్టించారని మండిపడ్డారు. ట్రిపుల్ తలాఖ్‌పై పార్లమెంట్‌లో చట్టం చేయాలని సుప్రీంకోర్టు సూచించిందని, కేంద్రం ఎలా చేస్తుందో చూద్దామని షబ్బీర్ అభిప్రాయపడ్డారు. పెద్దపల్లి ఘటన అమానుషమన్నారు.

కాళేశ్వరం వ్యతిరేకులను నిలదీయండి

శ్రీధర్‌బాబు రౌడీచర్యను ఎలా సమర్థిస్తారు? - ప్రాజెక్టులకు కాంగ్రెస్ వ్యతిరేకం: హరీష్‌రావు ధ్వజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీమంత్రి శ్రీధర్‌బాబు పెద్దపల్లిలో చేసిన దాదాగిరిని, రౌడీయిజాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీలు సమర్థించడం విడ్డూరంగా ఉందని.. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యతిరేకులను ప్రజలు నిలదీయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రజాభిప్రాయ సేకరణ వివాదాల నేపథ్యంలో.. గురువారం దీనిపై మంత్రి సుదీర్ఘప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు జరగాలని టి.కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారా? అని మంత్రి ప్రశ్నించారు. రైతుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ రైతుల దీర్ఘకాలిక ప్రయోజ నాలను దృష్టిలో పెట్టుకుని ఇరిగేషన్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తుండగా, కాంగ్రెస్ నాయకులు అటు గ్రీన్‌ట్రిబ్యునల్, ఇటు కోర్టుల చుట్టూ తిరుగుతూ మరోవైపు పబ్లిక్‌హియరింగ్ ప్రక్రియను సైతం విచ్చిన్నం చేసే చర్యలకు దిగుతున్నారన్నారు. 11జిల్లాల్లో గురువారం వరకు ప్రజాభిప్రాయసేకరణప్రశాంతంగా ముగిసిందన్నారు. నల్లగొండ, సంగారెడ్డి, కామారెడ్డి, పెద్దపల్లి, నిర్మల్, జగిత్యాల, మెదక్, కరీంనగర్, యాదాద్రి, మేడ్చల్, నిజామా బాద్ జిల్లాల్లో ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వం నమోదుచేసిందన్నారు. తాము ఈ ప్రాజెక్టుకు అనుకూలంగా ఉన్నట్లు ప్రజలు స్పష్టం చేశారన్నారు. గట్టిగా సమర్థించారని, దీనిని త్వరిత గతిన పూర్తి చేయాలని రైతులు కోరారన్నారు. ప్రభుత్వానికి ప్రజలేమనుకుంటున్నారో తెలుసుకోవడమే ముఖ్య మన్నారు. ప్రజలు, రైతులు, వివిధ రాజకీయపక్షాల నేతలు స్వేచ్ఛగా తమ అభిప్రాయం వ్యక్తం చేసే వాతా వరణం ప్రభుత్వం కల్పించినా ప్రతిపక్షం చౌకబారు ప్ర చారం కోసం ఆరాట పడు తున్నదన్నా రు. ప్రాజెక్టులను అడ్డుకోవడమే ఏకైక అజెండాతో పనిచేస్తున్న కాంగ్రెస్ నాయకులకు ఈ ప్రజాభిప్రాయ సేక రణ ఇష్టం లేద న్నారు. శ్రీధర్‌బాబు తదితరులు పెద్దపల్లిలో తమ అభిప్రా యాలను వ్యక్తం చేసే అవకాశం ఉన్నా పబ్లిక్ హియ రింగ్‌ను భగ్నం చేయడానికి ప్రయత్నించారన్నారు.

దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సహా 300మంది కార్యకర్తలతో సభా ప్రాంగణంలోకి వచ్చి ప్రశాంతంగా కొనసాగు తున్న సభను అడ్డుకునే యత్న ం చేయడంతో అరెస్ట్ చేయాల్సి వచ్చిందన్నారు. సిఎం డౌన్ డౌన్ అని నినాదాలు చేస్తూ ప్రజాభిప్రాయసేకరణ వేదికను రాజకీయం చేయడానికి, కలుషితం చేయడానికి ప్రయత్నించారన్నారు. తమ అభిప్రా యం చెప్పాలని.. మాట్లాడాలనుకున్న వారందరికీ అవకాశం ఇస్తామని, సభను డిస్ట్రబ్ చేయవద్దని పెద్దపల్లి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అనేకమార్లు విజ్ఞప్తిచేసినా సీఎం వ్యతిరేక నినాదాలతో అరగంట పాటు సభ జరగకుండా అడ్డుకున్నారన్నారు. సిపిఐ నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుండామల్లేష్ సహ పలువురు నేతలు సభలో తమ అభిప్రాయం చెప్పారన్నారు. కామారెడ్డి జిల్లా ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఐ నాయకురాలు పశ్యపద్మ, గతంలో పోటీచేసి ఓడిన ఎడ్ల రాజిరెడ్డి కూడా తమ అభిప్రాయం స్వేచ్ఛగా చెప్పారన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జడ్పీటిసి సంజీవరెడ్డి పాల్గొని తన అభిప్రాయం చెప్పారని హరీష్‌రావు వివరించారు. ఇక నల్లగొండ జిల్లా టిడిపి నాయకుడు కంచర్ల భూపాల్‌రెడ్డి, సిపిఐ నాయకులు నూనె వెంకటస్వామి, సిపిఎం నాయకులు నగేష్, కాంగ్రెస్ నాయకులు కందిమళ్ల శేషుపాల్ రెడ్డి తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పారన్నారు.

మెదక్‌లో మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి పాల్గొని తన అభిప్రాయం చెప్పారన్నారు. తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, రిటైర్డ్ సిఈలు కార్యక్రమాలలో పాల్గొని మద్దతు ప్రకటించా రన్నారు. నిబంధలకు విరుద్ధంగా పబ్లిక్ హియరింగ్ జరుగుతున్నదని కేంద్ర ప్రభుత్వానికి మర్రి శశిధర్‌రెడ్డి ఫిర్యాదుచేయడం కూడా ప్రాజెక్టుపై జరుగుతున్న కుట్రలలో భాగమేనన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకోవాలని చేస్తున్న ప్రయత్నాలను, కుట్రలను తెలంగాణ వాదులు, ప్రజలు, రైతులు నిలదీయాలని మంత్రి హరీష్‌రావు పిలుపునిచ్చారు.

అడ్డుకుంటే కాంగ్రెస్ కాలగర్భంలోకే



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నదని, ఈ ప్రాజెక్టును అడ్డుకుంటే కాంగ్రెస్ కాలగర్భంలో కలవడం ఖాయమని టిఆర్ఎస్ ఎంపీ బాల్క సుమన్ అన్నారు. గురువారం ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌తో కలిసి టిఆర్ఎస్ఎల్పి కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్త పరిచేందుకు అభిప్రాయసేకరణ వీలు కల్పిస్తోందని, వీటిని కాంగ్రెస్ నేతలు అడ్డుకునే యత్నాలు చేయడం శోచనీయమన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సభను అడ్డుకునేందుకు శ్రీధర్ బాబు ప్రయత్నించారన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ నేతలను ఇంకా ఆంధ్రానేతలే నడిపిస్తున్నారాన అనుమానం కలుగుతోం దన్నారు. ప్రాజెక్టుల వ్యతిరేక వైఖరిని కాంగ్రెస్ నేతలు వీడాలన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ


శుక్రవారం 25 ఆగస్టు 2017

ప్రమాదాలకు కారణాలివే...

అలనాడు ఎప్పుడో ఎక్కడో జరిగిన రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి రాజీనామా చేయడాన్ని ఆదర్శంగా తీసుకుని రైలు ప్రమాదం జరిగినప్పుడల్లా మంత్రులు రాజీనామా చేయడం, ప్రధానమంత్రి తొందరపడవద్దంటే వెనక్కి తీసుకోవడం ప్రహసనంగా తయారైంది. లాల్ బహదూర్ శాస్త్రి వంటి నిబద్ధత, త్యాగశీలత, నిరాండబరత, నిజాయితీ కలిగిన నాయకులెవరూ ఇప్పుడు లేరు. అయితే, తాజాగా రాజీనామా చేసిన మంత్రి సురేష్ ప్రభుని ఆయనతో పోల్చలేం కానీ, ఇప్పుడున్న మంత్రులతో పోలిస్తే సురేష్ ప్రభు నిజాయితీగల నాయకునిగానే పేరొందారు. ఉత్తరప్రదేశ్‌లో ముజఫర్‌నగర్ సమీపంలో ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిన ప్రమాదానికి నైతిక బాధ్యతగా ఆయన రాజీనామా చేశారు. ఇది విద్రోహచర్యకాదనీ, మానవ తప్పిదమేనని రైల్వే బోర్డు సభ్యుని ప్రాథమిక విచారణలో తేలింది. అయితే, రైలు పట్టాలు అరిగిపోవడం, సిగ్నలింగ్ వ్యవస్థ అధునాతనం కాకపోవడం, చాలినంత మంది సిబ్బంది లేకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రైల్వే మంత్రికీ, ప్రధానమంత్రికీ ఎంతో కాలంగా సందర్భం వచ్చినప్పుడల్లా అర్జీలు సమర్పిస్తున్నా వాటిపై సంబంధిత వ్యక్తులు దృష్టిని కేంద్రీకరించకపోవడం వల్ల ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా అన్ని జోన్లలోనూ రెండు లక్షలకు పైగా ఖాళీలు ఉన్నట్టు ఆ శాఖ వెలువరించిన లెక్కలే చెబుతున్నాయి. రైల్వేలలో భద్రతా ప్రమాణాల మెరుగుదలకు ఐదేళ్ళలో లక్ష కోట్ల రూపాయిలను ఖర్చు చేయాలని అనిల్ కాకోద్కర్ నేతృత్వంలోని కమిటీ ఐదేళ్ళ క్రితం సిఫార్సు చేసింది. ఆనాటి యూపీఏ ప్రభుత్వం పీపీపీ (ప్రభుత్వం, ప్రైవేటు, పార్టిసిపేషన్- భాగస్వామ్యం) పద్ధతిలో ఈ సిఫార్సుల అమలు చేస్తామని ఊదరగొట్టింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వేలకు ప్రత్యేక బడ్జెట్ పద్ధతిని రద్దుచేశారు. అది ఉన్నప్పుడే భద్రతా ప్రమాణాలను కాపాడేందుకు తగినన్ని నిధులకేటాయింపు జరగలేదు. ఇప్పుడు ఆర్థిక శాఖ బడ్జెట్‌లో భాగంగా రైల్వే పద్దులు సమర్పిస్తున్నారు. రైల్వే శాఖకు ప్రత్యేక బడ్జెట్ ఉన్నప్పుడు కూడా ఆనాటి రైల్వే మంత్రులు తమ సొంత నియోజకవర్గాల్లో ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు మంజూరు చేయించుకోవడంపైనే ఎక్కువ దృష్టిని కేంద్రీకరించేవారు. ఎన్‌డిఏ హయాంలో ప్రస్తుత బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, బీహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, యూపీఏ హయాంలో ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌లు తమ ప్రాంతాలకే ఎక్కువ నిధులు కేటాయించుకోవడం అప్పట్లో చర్చనీయాంశం అయింది. లాలూప్రసాద్ రైల్వేమంత్రిగా ఉన్నంత కాలం చార్జీలు పెంచకుండానే రైల్వేల ఆదాయాన్ని పెంచేశానని గొప్పలు చెప్పేవారు కానీ, వాస్తవానికి అప్పట్లో నిధులు కేటాయించకుండా మురగబెట్టడం వల్లే రైల్వేలు ఆర్థికపరమైన ఒత్తిడులకు లోనయ్యాయని యూపీఏ -2 హయాంలో రైల్వే శాఖ మంత్రిగా వ్యవహరించిన దినేష్ త్రివేది ఓ సందర్భంలో వెల్లడించారు. రైల్వే మంత్రులుగా ఎవరున్నా, భద్రతా ప్రమాణాలకు తగినన్ని నిధులు కేటాయించడం లేదన్నది కాదనలేని వాస్తవం. గతంలో కాపలాదారు లేని లెవిల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు ఎక్కువజరిగేవి. ఇప్పుడు బోగీలు పట్టాలు తప్పడం వల్ల జరుగుతున్నాయి. దేశంలో కొత్త రైలు మార్గాలను నిర్మించకపోగా, ఉన్న వాటినే భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా కాపాడుకోలేని దుస్థితిలో రైల్వే శాఖ ఉంది. పట్టాలను పర్యవేక్షించే సిబ్బంది రెండు లక్షల మందికిపైగా ఉన్నా, నిర్లక్ష్యం, సమన్వయం లేకపోవడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజా ప్రమాదానికి రెండోదే కారణం. రైల్వేల్లో 13.16లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. రైల్వేల రాబడిలో అధిక భాగం వారి జీతభత్యాలు, ఇతర సదుపాయలకే సరిపోతోంది.రైలు మార్గాల నిర్వహణకూ, ఆధునీకరణకూ తగినన్ని నిధులు కేటాయించలేకపోతున్న ప్రభుత్వం బులెట్ రైళ్ళను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేయడం హాస్యాస్పదం. బులెట్ రైళ్ళ ధాటికి తట్టుకోగల రైలు మార్గాలు మనకు లేవు. అంతేకాక, చాలా ప్రాంతాల్లో రైలు మార్గాలకు తగినంత రక్షణ లేదు. రైలు మార్గాలను పర్యవేక్షించే సిబ్బంది తగినంత మంది ఉన్నా,వారి ప్రమత్తత వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రైల్వేల భద్రతా నిధిని ఏర్పాటు విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడం లేదు. లోకోసిబ్బందిపై పని ఒత్తిడి పెరిగింది. దూర ప్రాంతాలకు వెళ్ళే రైళ్ళలో డ్రైవర్లు, గార్డులకు తగినంత విశ్రాంతి ఉండటం లేదు. సిగ్నలింగ్ వ్యవస్థలో మార్పులు చేసినా తరచూ మరమ్మతులకు గురి అవుతూనే ఉంది. ఈ కారణాలను బట్టి చూస్తే రైలు ప్రమాదాలకు సిబ్బంది నిర్లక్ష్యం కొంత ఉన్నా, సరైన సౌకర్యాలు, తగినంత మంది సిబ్బంది లేకపోవడం, భద్రతకు తగినన్ని నిధులు కేటాయించకపోవడం కారణాలని స్పష్టం అవుతోంది. రైల్వేల నిర్వహణ విషయంలో పూర్వపు ప్రభుత్వం కబుర్లతో కాలక్షేపం చేయగా, ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ లేకుండా చేసి, నిధుల కోసం అడగలేని పరిస్థితిని సృష్టించింది.

డిజిటల్ యుగంలో ఊపిరి పీల్చుకునే తీర్పు





డిజిటల్ యుగంలో నివసిస్తున్న భారతీయ పౌరులు ఊపిరి పీల్చుకోవచ్చు. గురువారంనాడు భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదే కాక ఆహ్వానించదగ్గది కూడా. వ్యక్తిగత గోప్యత భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రకారం ప్రాథమిక హక్కని సుప్రీం సుస్పష్టంచేసింది. సామాజిక మాధ్యమం, సైబర్ దాడులు, చౌర్యం, హ్యాకింగ్‌ల తీవ్రత నేపథ్యంలో సరైన సమయంలో వచ్చిన ఈ తీర్పు ఎంతో కీలకమైనది. పై కారణాల వల్ల మన జీవితాలు తెరిచిన పుస్తకాల్లా మారిపోయాయి. మనలో ఎందరో డిజిటల్ ఫియర్‌తో జీవిస్తున్నాం. ఆధార్ వివరాలు వెల్లడవుతుండడం, డూప్లికేట్ ప్యాన్ కార్డులు జారీ అవుతుండడం, మొబైల్ నెంబర్లు, ఈమెయిల్ అడ్రస్‌లను సైతం ఇతరులకు సరకుల బఠాణీల్లా విక్రయించేస్తుండడం వంటి పరిణామాలు మనలో డిజిటల్ ఫియర్‌ను పెంచుతున్నాయి. క్రెడిట్ కార్డులను తేలిగ్గా హ్యాకింగ్ చేయగలగడానికి కారణం మన సమాచారం మార్కెట్లో సులువుగా లభిస్తుండడమే. సుప్రీం తీర్పు కారణంగా పౌరులు తమ ప్రాథమిక హక్కుకు భంగం వాటిల్లిందని భావిస్తే ప్రభుత్వాలనూ, సంస్థలను నిలదీయవచ్చు. కోర్టు తలుపులు తట్టవచ్చు. తీర్పు రూపంలో సుప్రీం కోర్టు గోప్యత హక్కును వినాయక చవితికి కానుకగా ఇచ్చినట్లయ్యింది.



గోప్యత హక్కును ఆర్టికల్ 21 సహజంగా కాపాడలేనప్పటికీ, అతిక్రమించకూడని ప్రాథమిక హక్కులివని భరోసానిచ్చింది. వీటిపై అనేక కోర్టు తీర్పులున్నప్పటికీ గురువారం వరకూ అవి ఒడిదొడుకులకు లోనయ్యాయి. రాజ్యాంగ రచన సమయంలో వ్యక్తిగత గోప్యత గురించి స్పష్టంగా నిర్వచించకపోవడం దీనికి కారణం. జీవితానికీ, స్వేచ్ఛకూ సంబంధించిన హక్కుగా దీన్ని నిర్వచించినందున అప్పట్లో అంతగా ప్రాధాన్యతనీయలేదు. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసం వ్యక్తిగత గోప్యత, ప్రాథమిక హక్కుల గురించి సుస్పష్టమైన తీర్పు ఇచ్చినందున ఈ అంశం గురించి ఇప్పుడు విపులంగా ఆలోచించవలసిన సమయం ఆసన్నమైంది.

స్వేచ్ఛ పరిధిలోకి గోప్యత

సుప్రీం తీర్పు అనంతరం, వ్యక్తిగత గోప్యత ఇప్పుడు జీవితానికీ, స్వేచ్ఛకూ సంబంధించిన హక్కు పరిధిలోకి వచ్చింది. మిగిలిన ప్రాథమిక హక్కులలోనూ గోప్యత ఒకటని కోర్టు గుర్తించింది. ఆధార్ వివరాలను ఇతరులతో పంచుకునే అంశాన్ని వేరే ధర్మాసనం పరిశీలిస్తుంది. ఇది అటు ప్రభుత్వానికీ, న్యాయస్థానానికీ కూడా కఠిన పరీక్ష వంటిదే. చట్టం-పౌరసత్వం అంశాలతో ఇది ముడిపడుంది. తీర్పు వీటిపై ప్రభావం చూపుతుంది. గోప్యత హక్కుపై గతంలో వచ్చిన రెండు తీర్పులను సుప్రీం కోర్టు కొట్టేసింది. సాంఘిక సంక్షేమ పథకాలను వినియోగించుకునే అంశంలో ఆధార్ వివరాలను సమర్పించాలన్న కేంద్రం ఆదేశాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారిస్తున్నప్పుడు వివాదాస్పదమైన గోప్యత హక్కు వెలుగులోకి వచ్చింది. గోప్యత హక్కును ఆధార్ స్కీమ్ భంగపరుస్తుందన్న అంశంపై ఇచ్చిన తీర్పు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆధార్‌పై ఇది కచ్చితంగా ప్రభావాన్ని చూపుతుంది. బయోమెట్రిక్ ద్వారా ఆధార్ వివరాలను ఇచ్చే అంశంపై కోర్టు తన తీర్పులో ఎటువంటి వ్యాఖ్యా చేయలేదని ప్రఖ్యాత న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చెప్పారు.

గోప్యత ప్రాథమిక హక్కని కోర్టు గుర్తించింది. మనం చేసే చట్టాలు వ్యక్తిగత గోప్యతపై ప్రభావం చూపించకూడదు. బంధనాలు విధించకూడదని తెలిపింది. మీరు ప్రయాణించడానికి ఆధార్ అవసరమని ఆదేశిస్తే.. అది సహేతుకమైన నిబంధన కాదన్నది నా అభిప్రాయమని ప్రశాంత్ భూషణ్ చెప్పారు. గోప్యత హక్కు అన్నింటికీ అర్థమైన హక్కు కాదన్న కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు తీర్పు చెంపపెట్టని తెలిపారు. ఆధార్‌పై తీర్పు ప్రస్తుతం తొమ్మిదిమంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందుంది.

చారిత్రాత్మకమైన, సన్నాహకమైన తీర్పు ప్రపంచంలోనే అతి పెద్ద బయోమెట్రిక్ గుర్తింపు కార్యక్రమాన్ని తల్లకిందులు చేసే అవకాశముంది. ఆధార్‌పై కేంద్రం ఎన్నో ఆశలు పెట్టుకుంది. లేదా ప్రభుత్వానికి ప్రతిబంధకంగా ఉండే ఎన్నో షరతులను విధించవచ్చు. అవెంత కఠినంగా ఉంటాయో మనం త్వరలోనే చూస్తాం. కానీ ఈ అంశంలో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. ఆధార్‌ను నెంబర్‌ను సెల్‌ఫోన్‌లకు అనుసంధానించాలని ప్రభుత్వం ఒత్తిడి చేయగలదా అనేది ఇందులో ఒకటి. ఎందుకంటే సెల్‌ఫోన్లవి ప్రైవేటు రికార్డులు. అవి తెరిచిన పుస్తకం లాంటివి... వాటిని తేలిగ్గా హ్యాక్ చేయవచ్చు.

కాబట్టి ఇది గోప్యతను హరించడం కిందికే వస్తుంది. తీర్పు ఆధార్‌కు అనుకూలంగా వచ్చినప్పటికీ, వ్యక్తిగత సమాచారాన్ని రహస్యం గా ఉంచాల్సిన కీలకమైన బాధ్యత ప్రభుత్వానిదే. సమాచారం బయ టకు పొక్కితే అది గోప్యత అనే ప్రాథమిక హక్కును హరించినట్లే నని పరిగణించాల్సి ఉంటుంది.

ప్రాథమిక హక్కు కాదంటున్న మోడీ సర్కారు

వేరే రకంగా చెప్పాలంటే రాష్ట్ర యంత్రాంగం గోప్యతకు భరోసా ఇస్తున్నట్లే. అంటే ప్రభుత్వం నిందితుల్ని విచారించాల్సి ఉంటుంది. కానీ మోడీ ప్రభుత్వం గోప్యత ప్రాథమిక హక్కు కాదనే వైఖరిని అవలంబిస్తోంది. అలాగే, పేద ప్రజలకు ఆహారం, రక్షణ హక్కులను ఇచ్చేందుకు నిరాకరించడమూ కుదరదని అంటోంది. అలా చేస్తే అది అస్పష్టంగానూ, నిరాకారంగానూ ఉన్నట్లేనన్నది ప్రభుత్వ వాదన. గోప్యత అనే అంశాన్ని ప్రాథమిక హక్కులా ఓ చట్రంలో ఉన్నట్లు భావించలేమని అటార్నీ జనరల్ అభిప్రాయపడుతున్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన సాధారణ హక్కే తప్ప గోపత్య అనేది న్యాయ నిర్ణయాల ద్వారా చేసిందేనని పెద్ద ధర్మాసనాలు తీర్పులు చేశాయని అంటున్నారు. భారత రాజ్యాంగం సజీవంగా ఉన్న ఒక ప్రామాణిక పత్రమని మనం గుర్తుంచుకోవాలి. మన ప్రజాస్వామ్యానికి ఈ పవిత్ర గ్రంథం ఎప్పటికప్పుడు కాలానికీ, పరిస్థితులకు అనుగుణంగానూ మారిపోతోంది. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం తేల్చింది ఇదే. ఆర్టికల్ 21 కింద స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు భరోసా ఇవ్వాలనేది గోప్యత ఆంతర్యమని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్. ఖేహార్ నాయకత్వంలో ఈ ధర్మాసనంలో మరో ఎనిమిది మంది జడ్జీలున్నారు. ఆధార్ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన కేసును విచారించిన ఐదుగురు న్యాయమూర్తులు బెంచ్ రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది. రాజ్యాంగ పరిధిలో గోప్యతను ప్రాథమిక హక్కుగా పరిగణించాలో లేదో సూచించాలని కోరింది. తొలుత ఇదే ప్రశ్న ముగ్గురు సభ్యుల బెంచ్‌లో తలెత్తింది. సాంఘిక, సంక్షేమ పథకాలకు ఆధార్‌ను ప్రామాణికం చేయాలన్న కేంద్ర నిర్ణయాన్ని కొందరు పిటిషనర్లు సవాలు చేశారు. ఈ కేసును ఈ ఏడాది జూలై 7న బెంచ్ పెద్ద బెంచ్‌కు పంపింది. ప్రధాన న్యాయమూర్తి ఖేహార్ 5గురు సభ్యులతో ఆ ధర్మాసనాన్ని ఏర్పాటుచేశారు. ఆ బెంచ్ దీన్ని 9మంది సభ్యుల ధర్మాసనానికి నివేదించింది. గోప్యత అనేది పూర్తిగా అర్థతున్న హక్కు అనీ, కానీ దానికీ కొన్ని పరిమితులుంటాయనీ కేంద్రం వాదించింది. గోప్యత హక్కులో వ్యత్యాసాలున్నందున స్వేచ్ఛకు సంబంధించిన విభాగానికి చెందినందునా ఇది ప్రాథమిక హక్కు కిందికి రాదని అటార్నీ జనరల్ వేణుగోపాల్ ధర్మాసనానికి నివేదించారు. రాజ్యాంగంలోనే గోప్యతకు సంబంధించిన అంశం స్వేచ్ఛ, ప్రతిష్ట రూపంలో ఇమిడి ఉందని ప్రతివాది తరపు న్యాయ వాది గోపాల్ సుబ్రమణియం చెప్పారు. స్వేచ్ఛను దేనితోనూ సరిపో ల్చలేమన్నారు. అన్ని ప్రత్యామ్నాయాలూ స్వేచ్ఛకు సంబంధించిన ప్రక్రియలేనని స్పష్టం చేశారు. మానవుడనే వాడు స్వేచ్ఛ లేకుండా జీవించలేడు.. స్వేచ్ఛ రాజ్యాంగానికి ఆత్మ అని పేర్కొన్నారు. అది ఇప్పుడు పరిమాణంలో బాగా పెద్దదైంది. ప్రస్తుత కాలానికి అనుగుణంగా సరిగమలు పలుకుతోంది.

గోప్యతపై ప్రాథమిక సూత్రాల ప్రయోగం

తప్పుడు ఫిర్యాదులు చేసినప్పుడు గోప్యత హక్కుతో రాజకీయ ప్రతీకారాలను తీర్చుకోవడానికి కూడా వినియోగించుకునే అవకాశముంది. తప్పుడు ఉద్దేశాలతో సోషల్ మీడియాలో ఓ వ్యక్తి గోప్యత హక్కును భంగపరిచినప్పుడు కొత్తగా రూపొందించే ప్రాథమిక హక్కు సూత్రాలను ప్రయోగించగలరా? ఇదే విషయమైతే.. అవుననే సమాధానమే వస్తోంది. తీర్పు అలాగే ఉంటుందనీ చెబుతోంది. ఈ సందర్భంలో సోషల్ మీడియా యాప్స్‌ను కోర్టులు బాధ్యుల్ని చేయగలవా అనేది ఇక్కడి ప్రశ్న. ఆ సందేశాన్ని పోస్టు చేసిన వ్యక్తిని మినహాయించి ఈ పని చేయగలవా అనే ప్రశ్న కూడా ఎదురవుతుంది. ఒక వ్యక్తి గోప్యతను భంగపరిచే మెసేజిని మీరు ఫార్వార్డ్ చేస్తే ఏమవుతుంది? ఆ నేరంలో మీరు బాధ్యతుంటుందా.. చట్టపరంగా బాధ్యులవుతారా? ఈ ప్రశ్నలకు సమాధానం అవును అయితే చట్టప్రకారం పనిచేసే సంస్థలు మరింత బలోపేతమవుతాయి. బాధ్యతలూ రెట్టింపవుతాయి.

వాట్సాప్ విధానంపైనా ప్రభావం

సుప్రీం కోర్టు తాజా తీర్పు, వాట్సాప్ కొత్త విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన కేసును కూడా ప్రభావితం చేస్తుంది. కాదు..కాదు.. వర్తిస్తుంది. ఈ కేసు కూడా ప్రస్తుతం సుప్రీం కోర్టు పరిధిలో ఉంది. ఢిల్లీ హైకోర్టు 2016 సెప్టెంబర్ 23న దీనిని అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ అత్యున్నత న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. 2016 సెప్టెంబర్ 25 వరకూ ఫేస్‌బుక్ లేదా ఇతర కంపెనీలకు సమాచారాన్ని అందించేందుకు సోషల్ మీడియా వేదిక దూరంగా ఉంది. ప్రాథమిక హక్కుకు సంబంధించిన కేసు తొలిసారి 1954లో ఎనిమిదిమంది న్యాయమూర్తుల ధర్మాసనం ముందుకు వచ్చింది. ఎమ్‌పి శర్మ ఈ కేసును దాఖలు చేశారు. అనంతరం ఖరక్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను 1962లో ఆరుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారించింది. ఎమ్‌పి శర్మ కేసులో తమ ప్రైవేటు రికార్డులను తనిఖీ చేసేందుకు ప్రభుత్వానికి ఉన్న రాజ్యాంగ ప్రామాణికతను సవాలు చేశారు. తమ రికార్డులను తీసుకెళ్ళిపోవడాన్ని వారు ప్రశ్నించారు. తనిఖీ, స్వాధీనం అనేవి సామాజిక రక్షణకు ప్రభుత్వం చేపట్టాల్సిన బాధ్యతని బెంచ్ స్పష్టంచేసింది. ఆ అధికారాన్ని చట్టం నియంత్రిస్తుందనీ పేర్కొంది. ఆధారాలు లేకుండానే తనపై కేసు పెట్టి, షీటు తెరిచి, తనను నిఘా పరిధిలోకి తెచ్చారని పేర్కొంటూ ఉత్తర ప్రదేశ్ పోలీసు రెగ్యులేషన్స్ యాక్ట్ 20 ప్రామాణికతను 1962 కేసులో పిటిషనర్ సవాలు చేశారు. ఈ కేసులో కూడా ఆరుగురు సభ్యుల ధర్మాసనం, గోప్యత హక్కుకు రాజ్యాంగంలో భరోసా ఇవ్వలేద ని పేర్కొంది. వ్యక్తుల విషయంలో గోప్యతకు భంగం వాటిల్లిం దనడం ప్రాథమిక హక్కును ఉల్లంఘించారనడం కాదని పేర్కొంది.

మట్టిగణపతి మన శ్రేయోభిలాషి

ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనలను రక్షిస్తుందన్నది ఆర్యోక్తి. అలాగే, ప్రకృతిని మనం రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది. ఇది యుగయుగాలుగా, తరతరాలుగా నిరూపితమైన సత్యం. ధర్మాన్ని చెరపట్టే ధోరణులు పెరిగినట్టే, ప్రకృతిని చెరపట్టే ధోరణులు కూడా పెరిగి పోవడం వల్లనే అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. ప్రకృతిని దైవసమానంగా పూజించే మనిషి తాను ఆరాధించే దేవతా మూర్తులను ప్రకృతిలో లభించే మట్టితో తయారు చేసి, ప్రకృతి అందించిన ఆకులు, పువ్వులు, పండ్లతో అర్చించడం కూడా తరతరాల సంప్రదాయం. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, శక్తి స్వరూపిణి అయిన దుర్గా మాతలతో పాటు అంతటి స్థాయిలో మనం ఆరాధించే దైవం గణపతి. ఇంకా చెప్పాలంటే విఘ్నాధిపతి అయిన గణపతికి మిగిలిన దేవతలందరికన్నా ఎక్కువ ప్రాధాన్యం ఉంది. వినాయక చవితి పర్వదినాల్లో మట్టి గణపతిని, రంగులు, రసాయనాలతో ప్లాస్టరాఫ్ పారిస్‌లో చేసిన గణపతినీ, రజత గణపతినీ, స్వర్ణ గణపతిని తయారు చేసుకుని తొమ్మిది రోజుల పాటు అర్చిస్తారు. మట్టి గణపతిలను జలనిమజ్జనం చేయడం వల్ల ఎటువంటి చేటు కలగదు. విఘ్నేశ్వరునిది పృధ్వీతత్వమని శాస్త్రం చెబుతోంది. మట్టి గణపతి నీటిలో కరిగిపోతాడు. సృష్టిలో లయం కావడం సరైన పద్ధతి. ఆధునిక సమాజంలో ఉక్కు, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి పదార్థాలతో రూపొందించే రంగురంగుల భారీ గణపతులను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల నదీనదాల్లో కాలుష్యం పెరిగిపోతోంది. విషతుల్యమైన వాయువులు వాతావరణంలో ప్రవేశిస్తున్నాయి. వీటి వల్ల ప్రకృతి విధ్వంసం అవుతోంది. సమాజానికి చేటు జరుగుతోంది. అందుకే, రంగులు, రసాయనాలతో తయారు చేసే భారీ విగ్రహాలను వినియోగించవద్దని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

నెలలు పడుతుంది: ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు నీటిలో కరగడానికి నెలలు పడుతుంది. ఈ విగ్రహాల నుంచి కెల్షియం సల్ఫేట్, హెమీ హైడ్రేట్ వంటి రసాయనాలు కలవడంతో నీరు విషపూరితం అవుతుంది. ఈ విగ్రహాల తయారీలో టాక్సిక్ యాసిడ్ల పాళ్ళు ఎక్కువగా ఉంటాయి. అవన్నీ నీటిలో ప్రవేశిస్తాయి. విగ్రహాలే కాకుండా, పళ్ళు, కొబ్బరి ముక్కలు, ఆకులు, మట్టలు నదీనదాల్లో వేయడం వల్ల అవి కుళ్ళి జలకాలుష్యం పెరుగుతుంది.


మట్టి గణపతిపై ప్రచారం: కాలుష్య నివారణ కోసం మట్టిగణపతిలను మాత్రమే ఆరాధించాలన్న ప్రచారం మహారాష్ట్రలోనూ, ఇతర ప్రాంతాల్లో ప్రారంభమైంది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఊపందుకుంది. హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్‌లోనూ, గోదావరి, కృష్ణానది ఘాట్‌లలోనూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనం వల్ల కాలుష్యం పెరిగిపోతోంది.

కాటేస్తున్న కాలుష్యం: పట్టణాలు, నగరాలు, మహానగరాల్లో గణపతి ఉత్సవాల పేరిట సాగుతున్న హంగామా అంతా కాలుష్యాన్ని వెదజల్లేందుకు కారణమవుతోంది. వాహనాల రద్దీతో అసలే వీధులు ఇరుకైపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో వీధి కూడళ్ళలో, సందుమొగల్లో వేదికలు నిర్మించి విగ్రహాలను ప్రతిష్ఠించడం వల్ల పాదచారులు, వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విగ్రహాల నుంచి వెలువడే వాయువులు ఆరోగ్యానికి హానికరమవుతున్నాయి. నీటికొరతను ఎదుర్కొంటున్న ప్రస్తుత సమాజంలో కలుషిత జలాలను కడవలతో సేవించేవారిని ప్రసార మాధ్యమాల్లో చూస్తూనేఉన్నాం. మట్టి గణపతిని అర్చిస్తే ఇలాంటి సమస్యలేవీ ఉండవు.

సమైక్యతామూర్తి: విఘ్నేశ్వరుని రూపమే విలక్షణమైనది. విఘ్నేశ్వరుడికి గజాననుడు, వక్రతుండుడు అనే పేర్లు సహా సార్థకం. ఆయన ఏనుగు తొండము, నాగాభరణం, మూషిక వాహనంతో దర్శనమిస్తాడు. సృష్టిలో పరస్పర విరుద్ధ లక్షణాలు కలిగిన జీవరాశులన్నీ కలిసిమెలిసి జీవించాలన్న సమైక్యతా సందేశాన్ని విఘ్నేశ్వరుని రూపం మనకు అందిస్తుంది. పత్రి పూజలో ఆరోగ్య రహస్యం: విఘ్నేశ్వరుణ్ణి గరిక తో పూజిస్తే చాలు. విఘ్నేశ్వరుణ్ణి పూజించడం కోసం సేకరించే పత్రిలో వనమూలికలు ఉంటాయి. పత్రిలో ఉండే సహజమైన ఆరోగ్య లక్షణాలకు కొన్ని ఉదాహరణలు. విఘ్నేశ్వరుని అర్చనలో మాచీ పత్రం ప్రధానమైనది.ఇది బొల్లి వంటి చర్మవ్యాధులను, ముఖ్యంగా కుష్టువ్యాధినిదూరం చేస్తుంది. నాడీ సంబంధ రోగాలను నయం చేస్తుంది. బృహతీ పత్రం ఆస్తమా, దగ్గు వంటి రోగాలనునయం చేస్తుంది. శివుడికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు బిళ్వపత్రంతోనే చేస్తారు. బిళ్వ పత్రం రసాన్ని సేవిస్తే విరేచనాలు ఆగిపోతాయి. నీటిని శుభ్రం గుణం బిళ్వపత్రంలో ఉంది. దీనినే రేగు ఆకు అంటారు. జీర్ణకోశ వ్యాధులకు ఈ ఆకు బాగా పని చేస్తుంది. తులసి దళం ప్రాముఖ్యత, ఆరోగ్య విశిష్టత వేరే చెప్పనవసరం లేదు. తులసి తీర్థాన్ని అమృత ప్రాయంగా భావిస్తారు. శుభకార్యానికి సంకేతంగా మామిడాకులను వినియోగించడం, అశ్వత్థ పత్రం,అర్జున పత్రం,జిల్లేడు ఆకు,జాజీపత్రం,గండకీ పత్రం, మరువకపత్రం,దేవదారు పత్రం విష్ణుక్రాంత పత్రం మొదలైనవన్నీ మనిషి ఆరోగ్యానికి దోహదం చేసేవే. విఘ్నేశ్వరునికి పత్రిపూజతో ఆరోగ్యాన్ని పొందుతున్న మనిషి రంగు విఘ్నేశ్వర ప్రతిమలను రూపొందించి అనారోగ్యవాతావరణాన్ని సృష్టిస్తున్నాడు. ఆరోగ్య ప్రదాత అయిన విఘ్నేశ్వరుని ఆరాధన అనారోగ్య వాతావరణాన్ని సృష్టించడం ఆధునిక సమాజంలో పొడసూపుతున్న వికృత ధోరణి.

-పద్మనాభస్వామి

వినాయకునికి పూజలందిన విధంబెట్టిదనిన...



వినాయకుడు యధావిధిగా భారతదేశ యాత్రకు బయల్దేరాడు కైలాసం నుండి. మొదట హస్తినలో పూజలందుకొని ఆ తర్వాత తెలుగునేలకి వస్తే మంచిదని మూషికుడు చెప్పాడు. కారణం అడగకుండానే సరే అన్నాడు గణపతి .. పూజలందుకునే తొందరలో.

మోడీ ఇంట అడుగుపెట్టిన గణపతికి మంచి ఆహ్వానమే దొరికింది. అయితే ప్రసాదం మాత్రం ఎంతకీ దొరకడం లేదు. ఉగ్గబట్టలేక ఉండ్రాళ్లడిగాడు ఆయన. వెంటనే మోడీ చెప్పారు "గణేష్ జీ. ఉండ్రాళ్ళు చోడో. భారత్ జోడో. 'కొత్త ఇండియా' యజ్ఞం 2022లో పూర్తి అవుతుంది. ఆ తరువాతనే ఆప్ కో ఉండ్రాళ్ళు మిల్ జాయెగా."

"మరి ఇప్పుడేం లేదా ?"

" స్వామీ జీ. మీరు గమనించలేదా! ఏ రాష్ట్రం దాటినా మీ మూషిక వాహనంకి చెక్ పోస్టులు లేవు. దేశమంతా ఫ్రీ గా రవాణా. మీరెక్కడేం కొన్నా ఒకటే ధర. ఇంతకన్నా ఏంకావాలి."

ఇక లాభం లేదని అమిత్ షా ఇంటికి వెళ్ళాడు గణనాథుడు.

"ఆయియే గణేష్‌జీ. టైముకొచ్చారు. ఏ రాష్ట్రానికి ఇన్ ఛార్జ్ గా వెయ్యమంటారు? మనం 350 మార్క్ దాటాలీసారి."

గణేశునికి అర్థమైపోయింది.. షా వచ్చే ఎన్నికల మూడ్ లో ఉన్నాడని. ఇంకేమీ ఆలోచించడని.

మూషిక వాహనం గభాల్న ఎక్కి వెంకయ్య ఇంటికి చేరుకున్నారు.

వెంకయ్య చాలా భక్తితో ప్రసాదం పెట్టి పూజలు చేసి వీడ్కోలు చెప్పాడు. అయితే అంతసేపూ ఒక్క మంత్రం గానీ,మాట గానీ లేదు.అన్నీ సైగలే.

దారిలో గణపతి అన్నాడు "మూషికా, ఉప రాష్ట్రపతి ఇంటిలో నా ఉపవాసం తీరింది గానీ గలగలా మాట్లాడే వెంకయ్య గమ్ముగా ఉండడమే నచ్చలేదోయ్."

"మీకేనేమిటి స్వామీ. భాషాభిమానులూ, ప్రాసాభిమానులూ అందరూ బాధ పడుతున్నారు. ఆయన ముందుముందు బాధ్యతలకనుగుణంగా మౌనం ప్రాక్టీసు చేస్తున్నప్పటినుంచీ."

ఇక ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టారు.

చంద్రబాబు కనబడి పలకరించక ముందే స్పీచ్ మొదలెట్టాడు."ఏమిటి స్వామీ ఇది. అందరూ కారుకూతలు కూస్తుంటే ఖండించవేం? నీకు బాధ్యత లేదా మన రాష్ట్రం బాగుచేసుకోవడంలో. ఎంత కష్టపడుతున్నా నీ ఆశీస్సులు దొరకకపోతే ఏవిధంగా ముందుకు పోతాం."

ఇంక ఈ ప్రవాహం ఆగేది కాదని గమనించి గణేశుడు జగన్ వైపు వెళ్ళాడు.

" అయ్యా, గణేశా, అధికార పక్షం ఇన్ని తప్పులు చేస్తుంటే ఇలానేనా ఉండేది? నిన్ను నడిరోడ్డు మీద నిలదీసినా తప్పులేదయ్యా. తప్పించుకు తిరుగుతావా?"

ఇదీ అదే వరస లా ఉందని పవన్ వైపు వెళ్ళాడు.

"స్వామీ. మీరంటే ఎంతో గౌరవం. మీకోసం ఎంతకాలం ఎదురుచూశానో తెలుసా. మీరొస్తారని కళ్ళు కాయలుకాసేలా చూశాను స్వామీ. అయితే ప్రస్తుతం మీకు పూజ చెయ్యలేను. ఇప్పుడు చేస్తే ఆనక కుమారస్వామి వస్తే చెయ్యాలి. ప్రస్తుతానికి న్యూట్రల్ స్టాండ్ నాది. ఇప్పుడు తగ్గి, తరువాత నెగ్గుతాను నేను. వీలయితే క్షమించండి. లేదంటే అర్థం చేసుకోండి. కానీ దయచేసి దీవించండి.. దీవించండి."

వెళ్తూ వెళ్తూ మూషికతో అన్నాడు గణపతి "నువ్వు మొదట ఆంధ్రప్రదేశ్ ఎందుకు వద్దన్నావో అర్థమైంది. వీళ్ళింకా ఉపఎన్నికల మూడ్ దాటి రాలేదు."

"ప్రభుత్వం చేతిలో, మార్కెట్ చేతిలో ఎన్ని దెబ్బలు తిన్నా ప్రజలు చూడు స్వామీ ఎంత భక్తి శ్రద్ధలతో నిన్ను కొలుస్తున్నారో. చేదు విషయాలు తలుస్తూ పోక, వీళ్ళని చూసి సంతసించండి."

మూషికుని మాటలకి గణేశునికి కాస్తా హుషారొచ్చింది.

వినాయక...

నవ్యాంధ్రకి వెళ్లేముందు హైదరాబాద్‌లో దిగి, కేసీయార్ తలుపు తట్టాడు గణేశుడు.

స్వామీ, అచ్చినవే. ఇగో. భూముల్లెక్క తేల్చనీకి పోతుండా. పాసు బుక్కులు పంపినం క, అదే కొరియర్‌లో నీకు ఉండ్రాళ్ళు పంపుతా భై. అందాకా ఈడ కూసుని దేవుని మాన్యం భూముల లెక్కయినా చూడరాదే? ఇంకా ఇక్కడ ఉంటే పండగ రోజు పని తప్పేలా లేదే అని కాంగ్రెస్ ఆఫీసుకి పద మన్నాడు మూషికునితో. మూషి కుడు కుడితిలో పడ్డ ఎలుకలా కంగారు పడి చెప్పాడు స్వామీ, కాంగ్రెస్ పార్టీ మిషన్ 31, కమిషన్ నూటొకటి లాంటి రక రకాల ప్లానుల్లో ఉందిప్పుడు. నీ తలకాయ మార్చినట్లు, ఆ పార్టీ తలకాయల్ని కూడా మార్చే వ్యూహాలు జరుగుతున్నాయట. ఈ టైములో అక్కడికి పోతే ప్రసాదం దొరకదు గానీ పితూరీలు, పిటిషన్‌లు మాత్రం ఖాయం. ఆకలితో ఉన్నాం మూషికా, ఆంధ్రాకే పోదాం పద.

..... శుభం .....

-డా.డి.వి.జి.శంకరరావు,
9440836931

మెడికల్ కౌన్సెలింగ్‌లో
3వ విడతకు ముడి!

(మొదటిపేజీ తరువాయి)

కళాశాలల్లో ప్రవేశం పొందకపోతే వారు మూడో విడత కౌన్సెలింగ్‌కు అనర్హులని ప్రకటించింది. దీనికి తోడు తొలి రెండు విడతల్లో సీటు సాధించి ఆయా కళాశాలల్లో చేరకపోతే రూ.3 లక్షల అపరాధ రుసుమును విధించడంతో పాటు వచ్చే మూడేళ్ళు వైద్య, దంత కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే కౌన్సెలింగ్‌కు సంబంధిత విద్యార్థులను అనర్హులుగా ప్రకటించింది.


తొలి, రెండవ విడత కౌన్సెలింగ్‌కు రాష్ట్రానికి చెందిన ఎంతోమంది విద్యార్థులు హాజరై ఆప్షన్లను ఎంపిక చేసుకున్నారు. జంబ్లింగ్ పద్ధతిన విద్యార్థులకు సీట్లను కేటాయించారు. మూడో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొని మంచి కళాశాలల్లో సీటు వస్తుందన్న ధీమాతో చాలా మంది విద్యార్థులు వారికి కేటాయించిన కళాశాలల్లో ప్రవేశం పొందలేదు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు సాధారణంగా ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు ప్రాధాన్యత ఇస్తారు. ప్రభుత్వ వైద్య, దంత కళాశాలల్లో సీట్ల భర్తీ ప్రక్రియ ముగిశాక ప్రైవేట్ కళాశాలల్లోని మంచి కళాశాలలను గుర్తించి అందులో సీటు సాధించేందుకు ప్రయత్నాలు జరుపుతారు. ఇంజనీరింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో గత ఇరవై సంవత్సరాలుగా ఇదే విధానం అమల్లో ఉంది. చివరికి డిగ్రీ కళాశాలల్లోనూ ఇదే విధానాన్ని అవలంబిస్తున్నారు. అయితే మెడికల్, దంత కోర్సుల ప్రవేశాలలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. తొలి రెండు విడతల కౌన్సెలింగ్‌లో కళాశాలలను ఎంపిక చేసుకున్న విద్యార్థులు వారికి కేటాయించిన కళాశాలల్లో చేరకుండా కాలయాపన చేయడంతో పాటు మిగతా విద్యార్థులకు అవరోధంగా మారడంతో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ మూడో విడత కౌన్సెలింగ్‌లో సరికొత్త నిబంధనలను తెరపైకి తెచ్చింది. గతంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో సైతం గత ఏడాది ఇదే విధానాన్ని అమలు చేసిందని కొంతమంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయిందని సమాచారం. గతంలో రూపొందించిన నిబంధనల ప్రకారం తొలి విడత కౌన్సెలింగ్‌లో ఏ విద్యార్థి అయినా పాల్గొని ఆప్షన్లను ఎంపిక చేసుకుంటారు. సీట్ల కేటాయింపులో విద్యార్థి తాను సీటు సాధించిన కళాశాలకు వెళ్ళి ఆ కళాశాలలో ప్రవేశం పొందవలసి ఉంటుంది. రెండో విడత కౌన్సెలింగ్‌లో ఒకవేళ విద్యార్థి తాను ఎంపిక చేసుకుని ప్రవేశం పొందిన కళాశాల నచ్చకపోతే ఆప్షన్లను ఇచ్చే సంప్రదాయం ఉంది. ఇలా ప్రభుత్వం ఎన్ని విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించినా అన్ని దఫాలు విద్యార్థి ఆప్షన్లను ఎంపిక చేసుకుని ప్రవేశం పొందే వీలును ప్రభుత్వం కల్పించింది. అయితే కొత్తగా విద్యార్థులు తొలి విడత కౌన్సెలింగ్‌కు హాజరై ఆప్షన్లను ఎంపిక చేసుకుని వైద్య, దంత కోర్సుల్లో సీటు సాధించినా కళాశాలల్లో చేరడం లేదని దీంతో నెలల తరబడి ప్రవేశాల ప్రక్రియను జరపవలసి వస్తోందని అధికారులు చెబుతున్నారు. భారత వైద్యమండలి (ఎంసిఐ) నిబంధనల ప్రకారం ఒక విద్యార్థి ఒకసారి కౌన్సెలింగ్‌కు హాజరై తాను కళాశాలను ఎంపిక చేసుకుంటే అందులో తప్పక చేరాలని అలా కాకుండా రెండో విడత కౌన్సెలింగ్‌కు హాజరైతే ఆయన ఇచ్చే ఆప్షన్లను పరిగణలో తీసుకోరాదని సూచించింది. తాజాగా కాళోజీ వర్సిటీ ఈ నిబంధనలకు లోబడే నిర్ణయం తీసుకుందని తొలి, రెండో విడత కౌన్సెలింగ్‌కు హాజరై ప్రవేశం పొందిన విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న కళాశాలలో చేరకపోతే మూడో విడత కౌన్సెలింగ్‌కు అనర్హులని ఇటువంటి విద్యార్థులు వచ్చే మూడేళ్ళు నీట్‌కు హాజరైనా వారి దరఖాస్తులను పరిగణలోకి తీసుకోమని ప్రకటించింది. తాజా కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకుంటే సదరు విద్యార్థి రూ.3 లక్షల అపరాధ రుసుమును చెల్లించాల్సి ఉంటుందని కూడా హెచ్చరించింది. ఈ తాజా నిర్ణయంతో ఒకవైపు ఎంతోమంది విద్యార్థులు సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడగా, మరోవైపు వైద్య విద్యను అభ్యసించాలన్న చిరకాల వాంఛ మరికొంత మంది విద్యార్థులకు తీరనుంది. తాజాగా తీసుకున్న ఈ నిర్ణయానికి సంబంధించి ఒకటి, రెండు రోజుల్లు ఉత్తర్వులను వెలువరించాలని వైద్య విద్యాశాఖ నిర్ణయించింది. ఈ ఉత్తర్వులపై తిరిగి న్యాయస్థానాలను ఆశ్రయించి కౌన్సెలింగ్ ప్రక్రియకు విఘాతం కలిగించకుండా ముందస్తుగా హైకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేయాలని ఉన్నతాధికారులు అడ్వకేట్ జనరల్‌ను కోరినట్టు చెబుతున్నారు. వచ్చే సోమవారం హైకోర్టును ప్రభుత్వం ఆశ్రయించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

డిగ్రీలో ప్రవేశాలకు మరో కౌన్సెలింగ్

● 26 నుంచి ప్రవేశాల ప్రక్రియ.. 31న సీట్ల కేటాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మూడు విడతల కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన డిగ్రీ సీట్ల భర్తీకి మరో దఫా ప్రవేశాల ప్రక్రియను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్.ఆచార్య అధ్యక్షతన గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇందులో ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య తుమ్మల పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు ఆచార్య ఆర్.లింబాద్రి, ఆచార్య వేదుళ్ళ వెంకట రమణ పాల్గొన్నారు. ఈనెల 26 నుంచి నాలుగు రోజులపాటు విద్యార్థులు వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోవచ్చని ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. 31వ తేదీన ఎంపిక చేసుకున్న విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందని సెప్టెంబర్ 1వ తేదీనుంచి 4వ తేదీవరకు ప్రవేశం పొందిన విద్యార్థులు ఆయా కళాశాలలకు వెళ్ళి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మూడు విడత కౌన్సెలింగ్‌లలో ప్రవేశం పొంది కళాశాలల్లో చేరిన విద్యార్థులు నాలుగో విడత కౌన్సెలింగ్‌కు అనర్హులని ప్రకటించింది. ఎంసెట్, ఇంజనీరింగ్, ఫార్మసీతో పాటు ఇంటర్ విద్యార్హతతో వృత్తివిద్యా కోర్సుల్లో చేరి ఆ కోర్సులను చదవలేకపోతున్న విద్యార్థులకు మాత్రం డిగ్రీ కోర్సులో పేర్ల నమోదుకు అవకాశం ఇస్తామని చెప్పారు. మూడు విడతలుగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లలో 1,87,368 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని చెప్పారు. 42 కళాశాలలు కౌన్సెలింగ్‌తో సంబంధం లేకుండా 19,031 విద్యార్థులను తమ కళాశాలల్లో చేర్చుకున్నారని చెప్పారు. ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ఆశ్రమ డిగ్రీ కళాశాలల్లో మూడువేల మంది చేరారని, మొత్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు డిగ్రీ కోర్సుల్లో 2,09,399 మంది ప్రవేశం పొందారన్నారు.

డెంగ్యూతో ఏడాది పాప మృతి



హైదరాబాద్ (నాచారం), కెఎన్ఎన్ : మల్లాపూర్ సూర్యనగర్ కాలనీలోని ఏడాది పాప డెంగ్యూ సోకి మృతి చెందింది. సూర్యనగర్ కాలనీలో నివసించే వి. రాజేందర్‌రెడ్డి ఏడాది కూతురు లక్షిత అస్వస్థతకు గురైంది. ఎఎస్‌రావునగర్‌లోని అంకుర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వారు బేగంపేటలోని అదే ఆసుపత్రికి తరలించారు. అక్కడ పాపకు డెంగ్యూ సోకిందని వైద్యులు ప్రకటించారని పాప తండ్రి తెలిపాడు. చికిత్స పొందుతూ పాప గురువారం సాయంత్రం మృతి చెందింది. రాజేందర్‌రెడ్డికి ఇద్దరు పాపలుండగా లక్షిత రెండో కూతురు.

ఏపీ పోలీస్ అధికారిపై కట్నం కేసు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏపీ ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌పై తెలంగాణ పోలీసులు కట్నం వేధింపుల కేసు నమోదు చేశారు. కొంతకాలంగా తనను వేధింపులకు గురిచేస్తున్నాడని, అదనపు కట్నం కోసం ఒత్తిడి చేస్తున్నాడని సునీల్‌కుమార్ భార్య అరుణ తెలంగాణ సీఐడీ పోలీసులకు ఫిర్యాదుచేసింది. అరుణ ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీసులు సునీల్‌కుమార్‌పై ఐపీసీ 498(ఎ), 506, డీపీ యాక్ట్ 3,4 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐడీ ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

● విజయవాడలో టీఎస్‌ఆర్టీసీ రిజర్వేషన్, ఎంక్వైరీ ప్రారంభ సభలో ఎండీ రమణారావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బస్సుల సమయవేళలు, వారికి కల్పించే సౌకర్యాలు, సేవల వివరాలను పూర్తిగా తెలిసేలా చేయగలిగినప్పుడే ప్రయాణీకులు మరింత ఆదరిస్తారని భావిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావు పేర్కొ న్నారు. విజయవాడలోని పండిట్‌నెహ్రూ బస్‌స్టేషన్‌లోటీ.ఎస్.ఆర్.టి.సి నూతనంగా రిజర్వేషన్, ఎంక్వైరీ కౌంటర్లను ఎండీ లాంఛనంగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకులకు టీఎస్‌ఆర్‌టిసి పట్ల ఉన్న నమ్మకాన్ని నిలుపుకోవడానికి పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. రవాణా రంగంలో నెలకొన్న పోటీ వాతావరణంలో సమయపాలన ప్రకారం బస్సులను నడపడం చాలా అవసరమన్నారు. ప్రయాణీకులకు రవాణా సేవలు అందిస్తూనే సంస్థ ఆర్థికంగా మరింత పుంజు కోవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు వాహనాల పోటీని తట్టుకునేందుకు సంస్థ అన్ని మార్గాలను అన్వేషిస్తుందని, సంస్థ నష్టాల నుంచి గట్టెక్కడానికి, సమిష్టిగా శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణీకులకు మెరుగైన రవాణా సేవలు అందించడం కర్తవ్యంగా భావించాలని, పూర్తి స్థాయిలో కార్యనిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకుని వారి వారి విధులను అంకితభావంతో నిర్వర్తించాల్సి ఉందని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారులు ఆర్.గంగాధర్, ఎన్.వి.రావు, పి.వి.రామారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీకి హైకోర్టు ఓకే

● నీట్ ర్యాంకుల ఆధారంగానే భర్తీ చేయాలి ● 371 డిపై తుది విచారణలో తేలుస్తాం ● గతంలో ఇచ్చిన స్టే ఎత్తివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎన్టీఆర్, కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయాల పరిధిలో డీఎం, ఎంసీహెచ్, సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ఓపెన్ కేటగిరీ సీట్ల భర్తీకి హైకోర్టు పచ్చజెండా ఊపింది. సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్లను నీట్ ర్యాంకుల ఆధారంగా చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. నీట్ ఆధారంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రవేశాలు చేపట్టరాదని ఇటీవల వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. దీంతో సూపర్ స్పెషాలిటీ సీట్ల భర్తీకి మార్గం సుగమమైంది. ఇక 371డి,రాష్ట్రపతి ఉత్తర్వులు అంశంపై తుది విచారణలో తేలుస్తామని హైకోర్టు స్పష్టం చేసింది.ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్,జస్టిస్ జస్టిస్ జె.రజనిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈ మేరకు మధ్యంతరఉత్తర్వులు జారీ చేసింది.371డి అమల్లో ఉండగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోని ఎన్టీఆర్, కాళోజీ వర్సిటీల్లో సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీని జాతీయ కౌన్సెలింగ్ ద్వారా చేపట్టాలంటూ కేంద్ర ఆరోగ్య శాఖ మే4న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ బి.సతీష్ కుమార్‌తో పాటు మరో 12 మంది హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇతర రాష్ట్రాల్లో తెలుగు విద్యార్థులకు నీట్ కింద కేటాయించిన సీట్లను తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి ప్రకారం తెలంగాణలో 85 శాతం సీట్లను స్థానిక అభ్యర్థులతో, మిగిలిన 15 శాతం సీట్లను ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులతో భర్తీ చేయాలి. ఇక ఆంధ్రప్రదేశ్ లో 85 శాతం సీట్లను స్థానిక అభ్యర్థులతో, 15శాతం సీట్లను తెలంగాణ అభ్యర్థులతో భర్తీ చేయాలని, రెండు తెలుగు రాష్ట్రాల్లోని సీట్లను జాతీయ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయరాదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. ఈ వ్యాజ్యంపై బుధవారం వాదనలు పూర్తయ్యాయి.

కాగా ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో 15 శాతం సీట్లను జాతీయ స్థాయి పరీక్ష నీట్‌లో పొందిన ర్యాంకుల ఆధారంగా భర్తీ చేయాలని ఆదేశించింది. ఈ వ్యాజ్యాల్లో సెప్టెంబర్ 11న పూర్తి స్థాయిలో వాదనలు వింటామని ధర్మాసనం ప్రకటించింది.ఈ వ్యాజ్యాల్లో పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు సరసాని సత్యం రెడ్డి, ఎస్.రామచంద్రరావు, సి.వి.మోహన్ రెడ్డి, డి.వి.సీతారామమూర్తి, ఎల్.రవి చందర్ తదితరులు వాదనలు వినిపించారు.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ కార్మిక సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేం దుకు ఈ నెల 28వ తేదీన ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. మున్సిపల్ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ అధ్యక్షత జరిగే ఈ సమావేశంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొంటారు.


'శాంతి స్థాపనకు రవిశంకర్ కృషి ప్రశంసనీయం'



హైదరాబాద్,ఆంధ్రప్రభ : మణిపూర్ రాష్ట్రంలో శాంతిస్థాపనకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ అన్నారు. మణిపూర్‌లో 68 మంది తీవ్రవాదులు ఆయుధాలను పక్కనపెట్టి ప్రభుత్వం ముందు లొంగిపోవడం శ్రీ శ్రీ రవిశంకర్ చేసిన ప్రవచనాలే కారణమని సీఎం అన్నారు. గురువారం బెంగూళూర్ వచ్చిన సీఎం బీరేన్‌సింగ్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీ శ్రీ రవిశంకర్‌ను కలుసుకున్నారు. మణిపూర్‌లో ఇంత మంది తీవ్రవాదులు ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం ఇదే మొదటిసారని, రాష్ట్రంలో అనేక సంవత్సరాలు గురువులు కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. శ్రీశ్రీ శాంతి సందేశం అనేక ప్రాంతాలకు చేరిందని, అనేక మంది యువత సత్యాన్ని గ్రహించి జన జీవన స్రవంతిలోకి వస్తున్నారని తెలిపారు. వాళ్లందరికి తమ ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందన్నారు.

పీఎం ఫసల్ బీమాపై నిర్లక్ష్యం

● రూ. 72 కోట్ల ప్రీమియం చెల్లిస్తే రైతులకు లాభం: కేంద్ర మంత్రి దత్తాత్రేయ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో తెలంగాణ రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతోందని కేంద్ర మంత్రి బండారు దత్తా త్రేయ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం ప్రవేశ పెట్టిన 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ? 72 కోట్లు చెల్లించకపోవడంతో 54 లక్షల మంది రైతులకు నష్టంపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన హితవు పలికారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ అధికారులు, బీమా కంపెనీలతో సమీ క్షా సమావేశం నిర్వహించారు.

అనంతరం బీజేపీఎల్పీ నేత కిషన్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లా డారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి దేశంలో అన్ని రాష్ట్రాలు ముందుకు వచ్చి ప్రీమియం చెల్లించి రైతులకు బాసటగా నిలుస్తున్నాయని, తెలంగాణ ప్రభుత్వం, బ్యాంకులు, బీమా కంపెనీలు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ముందుకు వస్తే ప్రీమియం చెల్లించే కటాఫ్ తేదినీ పెంచేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని దత్తా త్రేయ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2016-17 సంవత్సరానికి గాను తన వంతువాటగా ఉన్న రూ. 72 కోట్ల ప్రీమియం చెల్లిస్తే రైతులకు కేంద్రం నుంచి రూ. 200 కోట్లు సబ్సిడి వస్తుందని వివరించారు. 2020 నాటికి రైతుకు రెట్టింపు ఆదాయం పెంచాలనే ప్రధాన మంత్రి నరేంద్రమోడి వివిధ పథకాలను అమలు చేస్తున్నారని, పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇదే విష యంపై త్వరలోనే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రితో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయను న్నట్లు దత్తాత్రేయ చెప్పారు. ఓబీసీల వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యం సంతోషకమరమని దత్తాత్రేయ అన్నారు. ఆదాయ పరిమితి రూ. 8 లక్షల వరకు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. బీజేపీ ఎల్పీ నేత కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం పక్కరాష్ట్రాలు పకడ్బందిగా అమలు చేస్తేంటే.. తెలంగాణ ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరించడం సరికాద న్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిర్ణయమెప్పుడు?



● ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ


హైదరాబాద్,ఆంధ్రప్రభ : బీసీ వర్గాల రిజర్వేషన్లలో వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయడాన్ని ఎమ్మార్పీఎస్ స్వాగతిస్తోందని, అదే సమయంలో ఎస్సీ వర్గీకరణ విషయంలో జాప్యమెందుకు జరుగుతుందో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. రెండు తెలుగు ప్రభుత్వాలు, అన్ని రాజకీయ పార్టీలు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా ఉన్నాయని ప్రకటించినా కేంద్రం ఎందుకు ఆలస్యం చేస్తున్నదని ఆయన ప్రశ్నించారు. ఆలస్యం చేయడం వల్ల మాదిగలు, ఉప కులాల్లో తీవ్ర అసంతృప్తి, ఆవేదన కట్టలు తెంచుకుంటోందన్నారు. ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ బీజేపీ నేతలు ఎల్‌కే ఆద్వాని, సుష్మాస్వరాజ్, నితీన్‌గడ్కరి అప్పటి యూపీఏ ప్రభుత్వానికి లేఖలు రాశారని, మీరు చేయకపోతే బీజేపీ అధికారంలోకి వచ్చాక వర్గీకరణ చేస్తామని ప్రకటించిన విషయాన్ని కృష్ణమాదిగ గుర్తు చేశారు. గురువారం సంఘం నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, బీఎన్ రమేష్ మాదిగ, రాజెల్లయ్య మాదిగ, రుద్రవరం లింగస్వామి, సామ్యేల్, మాహిళా నాయకురాలు లత మాదిగతో కలిసి కృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడారు. 1965లో లోకూర్ కమిషన్, గత యూపీఏ ప్రభుత్వం వేసిన ఉషామెహ్రా కమిషన్ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయని, ఆర్టికల్ 341 ప్రకారం వర్గీకరణ చేయాలని ఉషామెహర కమిషన్ కేంద్రానికి సూచించాయన్నారు.

డీజీపీని కలిసిన మంద కృష్ణమాదిగ

నెల రోజుల క్రితం తనను వెంబడించిన కారు నెంబర్‌తో సహా పోలీసులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పట్టించు కోవడం లేదని కృష్ణమాదిగ డీజీపీ అనురాగ్‌శర్మ దృష్టికి తీసుకుపోయారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని డీజీపీ హామీ ఇచ్చారని తెలిపారు.

రైల్వే సిబ్బంది ఏం చేస్తున్నారు?

● బోగీల్లో అపరిశుభ్రతపై హైకోర్టు ఆగ్రహం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైల్వే బోగీల్లో అపరిశుభ్రతపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. రైల్వే సిబ్బంది పనితీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫస్ట్ క్లాస్ బోగీల్లో సైతం ఎలుకలు పరిగెత్తిన సందర్భాలను తాము స్వయంగా చూశామని వ్యాఖ్యానించింది. బోగీలను ప్రైవేట్ వ్యక్తులైన అనాథలు, బిక్షగాళ్లు శుభ్రం చేసి ప్రయాణీకులను సాయం చేయాలని అర్థిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇక మరుగుదొడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని తెలిపింది. బోగీలు ఇంత అపరిశుభ్రంగా ఉంటే రైల్వే సిబ్బంది ఏం చేస్తున్నారని? హైకోర్టు నిలదీసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈ మేరకు తీర్పును వెలువరించింది. ఓ రైల్వే కాంట్రాక్టర్ లైసెన్సు రద్దు చేస్తూ రైల్వే అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ సింగిల్ జడ్జీ ఇచ్చిన ఆదేశాలను ధర్మాసనం రద్దు చేసింది. కాంట్రాక్టర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. అగ్రిమెంట్‌లో పేర్కొన్న ప్రకారం రైల్వే అధికారుల నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ఆర్బిట్రేషన్ విధానాన్ని అనుసరించేందుకు ఆ కాంట్రాక్టర్ కు వెసులుబాటు కల్పించింది.

భద్రత, సమయపాలన ముఖ్యం

● దమ రైల్వే జీఎం వినోద్‌కుమార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ గురువారం ఉదయం నాంపల్లి రైల్వే స్టేషన్లో భద్రతా తనిఖీలు నిర్వహించారు. స్వచ్ఛ రైల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రమాణాల మేరకు భద్రతా చర్యలను పటిష్టంగా అమలు జరపడంతో పాటుగా రైళ్లు, రైల్వే స్టేషన్‌లను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రైల్వే స్టేషన్‌లు అహ్లాదకరమైన వాతావరణంలో ప్రయాణికులకు స్వాగతం పలకవలసి ఉందన్నారు. రైల్వే స్టేషన్ పరిశుభ్రత కార్యక్రమంలో కూడా జనరల్ మేనేజర్ పాల్గొన్నారు. సంబంధిత ఇంజనీర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రయాణికుల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను గుర్తు చేశారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తకు తావు లేని విధంగా విధులు నిర్వర్తించవలసి ఉందని, నిరంతరం నిఘా, తనిఖీలు కొనసాగించడం ద్వారా భద్రతతో కూడిన ప్రయాణం ప్రజలకు అందించవలసి ఉందని కోరారు. కెటరింగ్ విభాగాన్ని తనిఖీ చేసి పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ప్రయాణికుల నుండి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. దక్షిణ మధ్య రైల్వేలో భద్రత అత్యం ప్రాధాన్యతాంశం అన్నారు. రైళ్లను నడపడంలో సమయపాలన పాటించడం రెండవ ప్రధానాంశం అన్నారు. ప్రయాణికుల సౌకర్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. కోచింగ్ డిపోలను సందర్శించి అక్కడ రైలు భద్రతపై మాట్లాడారు.



టాటాసన్స్ ప్రధాన ఆర్థికవేత్తగా రూపా పురుషోత్తమన్

ముంబై: రూపా పురుషోత్తమన్‌ను టాటాసన్స్ ప్రధాన ఆర్థికవేత్తగాను, విధాన నిర్ణాయక చీఫ్‌గా నియమించింది. ఎవర్‌స్టోన్ క్యాపిటల్ నుంచి పురుషోత్తమన్ టాటాసన్స్‌లో చేరారు. ఎవర్‌స్టోన్‌లో ఆమె రీసెర్చి టీం చీఫ్‌గా పనిచేశారు. అంతకు ముందు ఆమె గోల్డ్‌మన్‌సాచెస్ అంతర్జాతీయ వైస్‌ప్రెసిడెంట్, గ్లోబల్ ఎకనమిస్టుగా పనిచేశారు. టాటాసన్స్‌గ్రూపులో ఆమె సెప్టెంబర్ 1, 2017 నుంచి బాధ్యతలు చేపడతారు. టాటాసన్స్‌లో బృందంలో రూపా చేరడం తనకు సంతోషం కలిగిస్తోందని ఆమెకు ఆర్థిక అంశాలపై అపారమైన అనుభవం ఉందని, సామాజిక అంశాలపై ఆమెకు ఉన్న పట్టు ద్వారా సమాజానికి సేవల చేయగలమని టాటాసన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు.

అమె విద్యార్హతల విషయానికి వస్తే యేల్ యూనివర్శిటీలో ఆమె గ్రాడ్యుయేషన్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ నుంచి పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అలాగే అవసరా లీడర్‌షిప్ ఇన్స్‌స్టిట్యూట్ వ్యవస్థాపకురాలు. నాన్ ప్రాఫిట్ ఎడ్యకేషన్ ఇన్స్‌స్టిట్యూట్‌ను దేశంలోని బాలికల కోసం ఏర్పాటు చేశారు. టాటాసన్స్‌లో చేరడం తనకు అపూర్వమైన అవకాశమని, దీంతో దేశాభివృద్ధికి కృషి చేస్తానని ఆమె అన్నారు.

Andhraprabha business 2017

బిజినెస్

BUSINESS

ఇన్ఫీ పీఠంపై నీలేకని

వారం రోజుల నుంచి ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలకు గురువారంతో తెరపడింది. గత శుక్రవారం నాడు ఇన్ఫోసిస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఈవో) అకస్మికంగా రాజీనామా నాటి రోజు నుంచి రోజుకో పరిణామం సంభవిస్తూ వస్తోంది. కంపెనీ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్ ఆర్ నారాయణమూర్తి తరచూ బోర్డుపై అసంతృప్తి వెళ్లగక్కుతూ మీడియాకు ఎక్కడం మింగుడుపడని సిక్కా, మూర్తిపై అసంతృప్తి కారణంగానే రాజీనామా చేసి వెళ్లిపోతున్నానని కుండబద్దలు కొట్టినట్లు చెప్పి వెళ్లిపోయారు. గత శుక్రవారం నుంచి ఇన్ఫోసిస్‌లో రోజుకో కొత్త పరిణామం చోటు చేసుకుంటోంది. కంపెనీకి చెందిన అతి పెద్ద ఇన్వెస్టర్లు కూడా తాజా పరిణామాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి బుధవారం నాడు నారాయణమూర్తి గ్లోబల్ ఇన్వెస్టర్ల సమావేశం కావాల్సి ఉంది. అయితే అనారోగ్యం కారణంగా ఈ సమావేశం ఈ నెలాఖరుకు వాయిదా పడింది. ఇన్ఫోసిస్‌లో చోటుచేసుకున్న తాజా పరిణామాలకు ముగింపు పలకకపోతే ఇబ్బందే అని గ్రహించిన వ్యవస్థాపకులు నీలేకనీ బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనకు వచ్చాయి. ఇదే అంశం గత 48 గంటల నుంచి పెద్దెత్తున మీడియాలో ప్రచారం కూడా జరిగింది. ఎట్టకేలకు గురువారం బోర్డు ఛైర్మన్‌గా నందన్ నేలీకనీని నియమించడంతో ఈ సస్పెన్స్‌కు తెరపడింది. కంపెనీ ఛైర్మన్‌లు ఆర్ శేషసాయి, విశాల్ సిక్కా, రవి వెంకటేశన్‌లు తమ పదవులకు రాజీనామా చేశారు.

- శేషసాయి, సిక్కా వెంకటేశన్‌ల రాజీనామా
- ఛైర్మన్‌గా నందన్ నీలేకనీ నియామకం
- పంతం నెగ్గించుకొన్న మూర్తి
- వారం రోజుల సస్పెన్స్‌కు తెర

బెంగళూరు : ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్‌ను ఏడుగురు వ్యవస్థాపకులు కలిసి 36 ఏళ్ల క్రితం స్థాపించారు. దశాబ్దం క్రితం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నందన్ నీలేకనీ తప్పుకున్నారు. అటు తర్వాత గురువారం నాడు అందరూ ఊహించినట్లే ఆయనను తిరిగి ఇన్ఫోసిస్ బోర్డుకు కొత్త ఛైర్మన్‌గా నియమించారు. నందన్ నీలేకనిని ఇన్ఫోసిస్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నియమించడం ఒక విధంగా చెప్పాలంటే సహ వ్యవస్థాపకుడు ఎన్ ఆర్ నారాయణమూర్తి ఇన్ఫీ బోర్డుపై విజయం సాధించినట్లే లెక్క ఒక్క దెబ్బకు రెండు పిట్టల్లా మూర్తి తాను అనుకున్నది సాధించారు.





రెండోది కంపెనీలో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టిన బడా ఇన్వెస్టర్ల ఆగ్రహాన్ని చల్లబర్చారని చెప్పవచ్చు. ఆగస్టు 18వ తేదీన సీఈవో విశాల్‌సిక్కా రాజీనామా చేసినప్పటి నుంచి బడా ఇన్వెస్టర్లు కంపెనీలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్ శేషసాయి నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పదవి నుంచి రాజీనామా చేశారు. రవి వెంకటేశన్ సహ ఛైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. అయితే వెంకటేశన్ మాత్రం బోర్డులో ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా తన పదవిని కాపాడుకున్నారు. గత వారం సీఈవోగా రాజీనామా చేసిన సిక్కాను బోర్డు ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా నియమించింది. ఆయన కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఆయన కంపెనీకి సేవ చేసి వెళ్లిపోతున్నందుకు 90 రోజుల్లోగా ఆయనకు 246,575 డాలర్లు ఇతర లబ్దిలు 205,572 డాలర్లు ఇవ్వడం జరుగుతుంది. కొత్త ఛైర్మన్‌గా నందన్ నీలకనీ నియామకంపై ఇన్ఫోసిస్ వ్యాఖ్యానించడానికి నిరాకరించింది. అయితే యూ బీ ప్రవీణ్‌రావు బోర్డులో తన పదవిలో కొనసాగుతూనే తాత్కాలిక సీఈవోగా బాధ్యతలు కొనసాగిస్తారు. కంపెనీలో నీలేకనీ ఎంట్రీతో బోర్డులో పలు కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలున్నాయి. బోర్డులోని ఇతర సభ్యులు జెఫ్రీ లేమాన్; జాన్ ఎచామెండీలు రాజీనామాలు చెప్పుకోవచ్చు. నీలేకనీ విషయానికి వస్తే ఆయన ఇన్ఫోసిస్ సీఈవోగా 2002 నుంచి 2007 వరకు పనిచేశారు.

ఇదిలా ఉండగా ప్రస్తుతం నీలేకనీ ఇన్ఫోసిస్‌కు రావడం చూస్తే జూన్ 2013లో మూర్తి తిరిగి ఇన్ఫోసిస్ పగ్గాలు చేపట్టిన రోజులు గుర్తుకు వస్తున్నాయి. ఆయన వచ్చీ రాగానే కంపెనీని గాడిలో పెట్టడానికి కృషి చేసి కంపెనీకి పూర్వవైభవం తీసుకువచ్చారు. ఇన్ఫోసిస్‌లో తిరిగి ఎంట్రీ ఇచ్చినందకు సంతోషంగా ఉందని.. కొత్త పాత్ర నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బోర్డులోని తన పాత్ర మిత్రులతో పాటు ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంట్‌తో కలిసి పనిచేయబోతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. గతంలో తామందరం కలిసి పనిచేసే క్లయింట్లతో పాటు వాటాదారులకు, ఉద్యోగులకు సమాజానికి లబ్ది చేకూర్చామని నీలేకనీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ఇన్ఫోసిస్‌కు గత మూడు సంవత్సరాల నుంచి సీఈవోగా సేవలందించినందకు విశాల్ సిక్కాకు పనిలో పనిగా ధన్యవాదాలు చెప్పారు.

నీలేకనీ త్వరలో కొత్త సీఈవో వేట కొనసాగిస్తారని, దీంతో పాటు ప్రస్తుతం ఉన్న ఇన్ఫోసిస్ బోర్డును ప్రక్షాళన చేస్తారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. గత 18 నెలల నుంచి కంపెనీ కార్పొరేట్ సుపరిపాలన అటకెక్కిందని వ్యవస్థాపకుడు నారాయణమూర్తి మీడియాకెక్కి బోర్డుపై ధ్వజమెత్తారు. ఇదిలా ఉండగా బుధవారం అంతా దేశంలోని అన్ని మీడియాల్లో నందన్ నీలేకనీ ఇన్ఫోసిస్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడతారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. ఆయన వచ్చి రాగానే బోర్డును ప్రక్షాళన చేస్తారన్న వార్తలు గురువారం నాడు వెలువడ్డాయి. నీలేకనీ బాధ్యతలు చేపట్టగానే బోర్డులో తన సభ్యులను చేర్చుకుంటారని వారిలో వెంకటేశన్; డీఎన్ ప్రహ్లాద్‌లనే వార్తలు వచ్చాయి.

ప్రస్తుతం పరిస్థితుల్లో ఇన్ఫోసిస్ నాయకత్వం వహించడానికి నీలేకనే సరైన వ్యక్తి అని, ఆయన నియామకంతో కంపెనీ రాబోయే సంవత్సరాల్లో మరింత వృద్ధిలోకి తీసుకువెళతారని.. ఆయన నాయకత్వంపై భాగస్వాములకు విపరీతమైన భరోసా ఉందని.. కంపెనీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని శేషసాయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎయిర్ ఇండియా సీఎండీగా రాజీవ్ బన్సల్ బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ : సీనియర్ ఐఎఎస్ అధికారి రాజీవ్ బన్సల్ గురువారం నాడు ఎయిర్ ఇండియా తాత్కాలిక ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న అశ్విన్ లోహాని రైల్వేబోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎయిర్‌ఇండియాలో రెండేళ్ల పాటు పని చేశారు. ప్రస్తుతం ఈ బాధ్యతలను బన్సల్‌కు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే బన్సల్ ఎయిర్ ఇండియాకు చెందిన సీనియర్ అధికారులతో సమావేశం అయ్యారు. ఇక్కడ గుర్తించుకోవాల్సిన అంశం ఏమిటంటే ప్రభుత్వం ఎయిర్‌ఇండియాను ప్రైవేట్‌పరం చేయాలనుకున్న సమయంలో కొత్త సీఎండీని తీసుకొచ్చింది. బన్సల్ విషయానికి వస్తే ఆయన పెట్రోలియం మంత్రిత్వశాఖలో అదనపు కార్యదర్శితో పాటు ఆర్థిక సలహాదారుగా పనిచేశారు. బుధవారం నాడు ప్రభుత్వం ఆయనను తాత్కాలిక ఎయిర్‌ఇండియా సీఎండీగా నియమించింది. నాగాలాండ్ క్యాడర్ ఐఎఎస్ ఆఫీసర్ అయిన ఆయన గతంలో రెండు సంవత్సరాల పాటు పౌరవిమానయాన మంత్రిత్వశాఖలో పనిచేసిన అనుభవం ఉంది. ఇక ఎయిర్ ఇండియా విషయానికి వస్తే ఇప్పటికే రూ.50వేల కోట్ల అప్పులతో కునారిల్లుతోంది. దశాబ్దం తర్వాత మొట్టమొదటి సారి 2015-146లో లాభాలబాట పట్టింది.

నేడు కొత్త రూ. 200 నోటు విడుదల


- చిన్న నోట్ల సమస్య తీరేనా?



న్యూఢిల్లీ : రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మొట్టమొదటి సారి రూ.200 డినామినేషన్ బ్యాంకు నోట్‌ను శుక్రవారంవిడుదల చేయ బోతోంది. కొత్త కరెన్సీ నోట్‌తో దేశంలో చిన్న నోట్ల నగదు కొరతను తీర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రూ.100 నోటుపై భారతం తగ్గుతుంది. రూ.200 డినామినేషన్ బ్యాంకు నోట్ కూడా మహాత్మాగాంధీ (న్యూ) సీరీస్‌ను పోలీ ఉంటుంది. ఆర్‌బీఐ గవర్నర్ డాక్టర్ ఉర్జిత్ పటేల్ సంతకం ఉంటుందని ఆర్‌బీఐ విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. కొత్త నోటు ఫీచర్ల విషయానికి వస్తే నోటు వెనుకభాగాన సాంచీ స్తూపం ఉంటుంది. నోటు కలర్ విషయానికి వస్తే గాఢమైన పసుపు రంగును పోలీ ఉంటుంది. నోటు మధ్యలో మహాత్మాగాంధీ బొమ్మతో పాటు మైక్రో లెటర్స్ ఆర్‌బీఐ ఇండియా 200 అని ఉంటుంది. నోటులోనే సెక్యూరిటీ థ్రెడ్ ఉంటుంది. ఈ థ్రెడ్ ఆకుపచ్చ, నీలంరంగులో మారుతుంటుంది. గ్యారంటీ క్లాజు, ఆర్‌బీఐ ఎంబ్లెమ్‌తో పాటు గవర్నర్ సంతకం ఉటుంది. కొత్త నోటును రూపాయి సింబల్‌తో పాటు కుడివైపు చివర అశోక స్థూపం ఉంటుంది. ముద్రించిన సంవత్సరం ఎడమవైపు ఉంటుంది. స్వచ్ఛభారత్ లోగోతో పాటు స్లోగన్ లేదా నినాదం ఉంటుమది. బ్యాంకు నోటు 66 ఎంఎం ' 146 ఎంఎం పరిణామంలో ఉంటుంది.

డిపాజిట్లపై వడ్డీరేట్లు తగ్గించిన బీఓఐ

- రూ. 50 లక్షల వరకు 3.5 శాతం
- దాటితే 4 శాతం



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకు ఆఫ్ ఇండియా పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లను 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. రూ.50 లక్షల వరకు డిపాజిట్లపై 3.5 శాతానికి సవరించింది. అయితే రూ.50 లక్షలు దాటిన డిపాజిట్లపై వడ్డీరేట్లు నాలుగు శాతం యధావిధిగా కొనసాగుతుంది. శుక్రవారం నుంచి బ్యాంకు పొదుపు ఖాతాలపై రెండు రకాల వడ్డీరేట్లు ప్రారంభించనున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. జులై 31న ఎస్‌బీఐ రూ.కోటి పొదుపు ఖాతాపై 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.5 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. అటు తర్వాత నుంచి మిగిలిన బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకుల ఉదాహరణకు హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకులు కూడా వడ్డీరేట్లు తగ్గించాయి. ఈ నెల ప్రారంభంలో యాక్సిస్ బ్యాంకు కూడా పొదుపు ఖాతాలపై రూ. 50 లక్షల కంటే తక్కువ మొత్తంపై 50 బేసిస్ పాయింట్లు వడ్డీరేట్లు తగ్గించి 3.5 శాతానికి సవరించాయి. ఇతర పీఎస్‌యు బ్యాంకులు బ్యాంకు ఆఫ్ బరోడా కూడా రూ.50 లక్షల కంటే తక్కువ మొత్తం ఖాతాలో ఉంటే వడ్డీరేటును 3.5 శాతానికి తగ్గించాయి. కర్నాటక బ్యాంకు కూడా పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లు తగ్గించాయి.

పెట్రోల్ మంట!



- లీటర్‌కు రూ. 5.42 పైనే బాదుడు
- చిన్న చిన్న డోస్‌తో జేబుకు చిల్లు
- అయినా పెద్దగా నిరసనల్లేవు

హైదరాబాద్ : రోజు వారి నిత్యావసర వస్తువుగా మారిన పెట్రోల్ ధరలు చడీ చప్పుడు లేకుండా వినియోగదారుడి జేబు గుల్ల చేస్తున్నాయి. అయినా ఎక్కడా ఎలాంటి నిరసన ధ్వనులు వినిపించిన దాఖలాల్లేవు. గతంలో లీటరుకు రూపాయో, రెండో పెరిగితే రాజకీయ నాయకుల నుంచి వినియోగదారుడికి వరకు పెద్దెత్తున నిరసన తెలిపే వారు. ఈ సారి మాత్రం ఎక్కడా అలాంటి సీన్‌లు కనిపించడం లేదు. చాలా మంది వినియోగదారుడికి తెలిసి ఉండకపోవచ్చు. రెండు నెల క్రితం నుంచి చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్ ధరలు రోజువారి సవరిస్తున్నాయి. అటు నుంచి లెక్కేస్తే ఇప్పటి వరకు లీటరుకు భారీగా రూ.5.27 పైసలు పెరిగాయి. అయినా దేశవ్యాప్తంగా ఎక్కడా నిరసన ధ్వనులు లేవు.

కారణం: డైనమిక్ ఫ్యూయెల్ ప్రైజింగ్... ఈ కొత్త పద్ధతిని జూన్ 16 నుంచి రిటైల్ పెట్రోల్ పంపుల్లో దేశవ్యాప్తంగా మొదలుపెట్టారు. గ్లోబల్ మార్కెట్లో రోజు వారి మారుతున్న ముడి చమురు ధరలతో అనుసంధానం చేయడమే డైనమిక్ ఫ్యూయెల్ ప్రైజింగ్. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం ఈ వినూత్నమైన స్కీంను తీసుకొచ్చింది. అయితే ఈ కొత్తస్కీం భారత్‌కు కొత్తే కానీ.. ప్రపంచంలోని ఇతర దేశాలకు కొత్తేమీ కాదు. పలు దేశాల్లో ఈ పద్ధతి ఇప్పటికే కొనసాగుతోంది.

చమురు మార్కెటింగ్ కంపెనీలు గతంలో 15 రోజులకు ఒకసారి అంతర్జాతీయ మార్కెట్ల ధరలను పరిగణనలోకి తీసుకొని ధరలు పెంచడమో లేదా తగ్గించడమో చేసేవి. అటు తర్వాత నుంచి రోజు వారి పెట్రోల్ ధరల సవరణను తీసుకొచ్చాయి. ఒకటేసారి పెద్దమొత్తంలో ధరలు పెరిగితే వినియోగదారుల నుంచి నిరసన వస్తుందన్న కారణంతో రోజు కొంచెం కొంచెం డోస్ పెంచితే కిమ్మనకుండా ఉంటారనేది చమురు మార్కెటింగ్ కంపెనీల ఉద్దేశం. ప్రస్తుతం వారు అనుకున్నట్లుగా లీటరుకు రూ.5.27 పైసలు పెరిగినా.. వినియోగదారుడి నుంచి ఎలాంటి నిరసనల్లేవు.

జూన్ 16 నుంచి రోజు వారి పెట్రోల్ ధరలు సవరించడం మొదలుపెట్టిన తర్వాత పెట్రోల్ ధరలు కేవలం 13 రోజుల్లో లీటరుకు రూ.3.45 తగ్గడంతో వినియోగదారుడి ఆనందానికి హద్దుల్లేవు. అటు నుంచి పెట్రోల్ ధరలు పెరగడమే కానీ, తగ్గిన దాఖలాల్లేవు.. జూన్ 28-29న లీటరుకు ఒకపైసా పెంచారు. ఈ రోజుల్లో పైసా కాదు కదా రూపాయి పెరిగినా పెద్ద పట్టించుకునే వారు లేరు. అటు నుంచి చమురు మార్కెటింగ్ కంపెనీలు చిన్న చిన్న డోసుల్లో పెట్రోల్ ధరలు ఏవో కొన్ని రోజుల తప్పించి రోజు పెంచుతూపోయాయి. జూన్ 28 నుంచి పెట్రోల్ ధరలు చూస్తే ఢిల్లీలో లీటరుకు రూ.5.42 పెరిగాయి. ఆగస్టు 24 గురువారం 2017 నాటికి ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.68.88 పైసలు పలుకుతోంది

ఇంతకీ డబ్బు ఎక్కడికి పోతోంది: ముడి చమురు ధరలు పెరుగుతున్నాయనేదే కాదనలేని వాస్తవం. ముడి చమురు ధరలు జూన్ 27 నుంచి చూస్తే ఇప్పటి వరకు 11 శాతంపైనే పెరిగాయి. జూన్ 27న పీపా 45.42 డాలర్లు పలికితే ఆగస్టు 23 నాటికి 50.51 డాలర్లకు చేరింది. గతేడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే పెట్రోల్ ధరలు 8.5 శాతం పెరిగాయి. పెట్రోల్, డిజిల్ ధరలు పెరగడానికి ముడి చమురు ధరలు పెరగడమే ఒక్కటే కారణం కాదు.. దీనికి పలు రకాల కారణాలున్నాయి. చాలా మంది వాదించేంది ఏమిటంటే అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరిగాయి కాబట్టి ఇక్కడా ధరలు పెరుగుతున్నాయనేది వారి వాదన.

ఈ వాదన సరైందే కానీ.. ఇక్కడ గుర్తించుకోవాల్సింది పీపా 140 డాలర్లు పలికినప్పుడు కూడా పెట్రోల్ ధరలు ఈ స్థాయిలో లేవే! ఇంతకు అదనంగా వసూలు చేస్తున్న డబ్బు ఎక్కడికి పోతోంది అంటే ప్రస్తుతం పెట్రోల్, డిజిల్‌పై వినియోగదారుడి చెల్లించేమొత్తం వివిధ రకాల కేంద్ర, రాష్ట్రాల పన్నుల రూపంలో పోతోంది. ప్రస్తుతం వస్తు సేవల పన్ను (జీఎస్టి) అమల్లోకి వచ్చినా.. ఈ రెండు కమాడిటీలు పెట్రోల్, డిజిల్‌ను జీఎస్టి పరిధిలోకి తేలేదు. ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అతి పెద్ద ఆర్థిక సంస్కరణ అని గొప్పగా చెబుతున్నా.. పెట్రోల్, డిజిల్‌ను జీఎస్టి పరిధిలోకి తేలేదు. కాబట్టి పెద్దమొత్తంలో వినియోగదారుడు పన్ను చెల్లించి జేబు గుల్ల చేసుకోవాల్సి వస్తోంది. అయినా దీనిపై ఎక్కడా ఎలాంటి నిరసనలు వ్యక్తం కావడం లేదు.

ఎయిర్‌బీఎన్‌బీతో జెట్ ఎయిర్‌వేస్ భాగస్వామ్య ఒప్పందం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రముఖ కమ్యూనిటీ ఆధారిత హాస్పిటాలిటీ కంపెనీ ఎయిర్‌బీఎన్‌బీతో జెట్ ఎయిర్‌వేస్ సంస్థ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో అంతర్జాతీయ హాస్పిటాలిటీ అవకాశాలను అందించడానికి వీలవుతుందని సంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ షణ్ముగం అన్నారు. కేవలం వైవిధ్యమైన విలువను జెట్ ఎయిర్‌వేస్ అతిథులకు అందించడమే కాకుండా భారతీయ మార్కెట్‌లో ఎయిర్‌బీఎన్‌బీ వేగంగా అభివృద్ధి చెందేందుకు, వినియోగదారులతో మరింత అనుబంధం ఏర్పరచుకోవడానికి తోడ్పతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జెట్ ఎయిర్‌వేర్ తమ వెబ్‌సైట్‌లో ఒక పోటీని నిర్వహిస్తుందని, ఇందులో విజేతలుగా నిలిచిన ఐదుగురికి ఉచిత కపుల్ ఫ్లైట్ టిక్కెట్లను జెట్ ఎయిర్‌వేస్ నుంచి, అలాగే ఎయిర్‌బిఎన్‌బి నుంచి రూ.35వేల విలువజేసే వసతి కూపన్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీ ఆగస్టు 23న ప్రారంభం కాగా, సెప్టెంబర్ 1వ తేదీలోగా జెట్ ఎయిర్‌వేర్ నెట్‌వర్క్‌లోని 64 ప్రాంతాల్లో ఏదో ఒకచోటకు టిక్కెట్ బుక్ చేసుకోవలసి ఉంటుందన్నారు. మరో ప్రారంభ ఆఫర్‌గా మొదటి 100 జెట్ ఎయిర్‌వేర్ అతిథులు తమ వెబ్‌సైట్ ద్వారా ఎయిర్‌బిఎన్‌బిలో వసతి బుక్ చేసుకుంటే 10శాతం రాయితీ పొందవచ్చునని షణ్ముగం చెప్పారు.


నాగార్జున సిమెంట్‌కు మైనింగు లీజు పొడిగింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సూర్యాపేట జిల్లా మట్టంపల్లి మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో నాగార్జున సిమెంట్ కంపెనీకి లైమ్‌స్టోన్ మైనింగు లీజును 50ఏళ్ల వరకూ రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు గురువారం పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. గుండ్లపల్లి గ్రామంలో 322 ఎకరాల విస్తీర్ణంలో నాగార్జున సిమెంట్ లైమ్‌స్టోన్ మైనింగు చేపడుతున్నది. కానీ ఈ లీజు గడువు 20ఏళ్ల నుంచి 50ఏళ్లకు పొడిగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మార్కెట్ హ్యాట్రిక్

వరుసగా మూడో రోజు లాభాల్లోనే

- ఇన్ఫీ షేర్లలో ర్యాలీ
- నేడు మార్కెట్లకు సెలవు



ముంబై: స్టాక్ మార్కెట్లు గురువారం నాడు హ్యాట్రిక్ కొట్టాయి. మార్కెట్ ముగిసే నాటికి కేవలం 28.05 పాయింట్ల లాభంతో 31,596.06 వద్ద ముగిసింది. మొత్తానికి బీఎస్ఈ 31,678.19 పాయింట్ల నుంచి 31,546.06 మధ్య ఊగిసలాడింది. మొత్తానికి చూస్తే స్టాక్ మార్కెట్లు గురువారం నాడు ఫ్లాట్‌గా ముగిశాయి అని చెప్పవచ్చు. దేశీయ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో షేర్లు కొనుగోలు చేయడంతో నష్టాలతో ముగియకుండా లాభాలతో ముగిసి హ్యాట్రిక్ కొట్టాయని చెప్పవచ్చు.

వాల్‌స్ట్రీట్‌తో పాటు ఆసియా మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించినా.. ఇక్కడ దేశీయ మార్కెట్లు మాత్రం లాభాలతో ముగియడం ఆశ్చర్యకరమే. ఎందుకుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాలో ఒక ర్యాలీలో మాట్లాడుతూ మెక్సికో సరిహద్దులో గోడ కట్టడానికి ఎలాంటి రిస్కు తీసుకోవడానికి సిద్ధమేనని ప్రకటించారు. దీంతో పాటు అమెరికాలోని జాక్సన్‌హోల్‌లో సెంట్రల్ బ్యాంకర్ల సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కొన్ని విధాన నిర్ణయాలు ప్రకటించే అవకాశాలున్నాయి.


బీఎస్ఈ 28.05 పాయింట్లు లాభపడి 31,596.06 వద్ద ముగిసింది. వరుసగా గత రెండు రోజుల నుంచి సూచి 309.16 పాయింట్లు పుంజుకుంది. నిఫ్టీ విషయానికి వస్తే 4.55 పాయింట్లు లాభపడి 9,857.05 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 9,881.50 నుంచి 9848.85 మధ్య తచ్చాడింది.

దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐ)లు వరుసగా 12వ రోజు రూ.929.84 కోట్ల షేర్లు కొనుగోలు చేయగా.. విదేశీ సంస్థాగత మదుపరులు మాత్రం పెద్దెత్తున షేర్లను విక్రయించడానికి సిద్ధపడ్డారు. బుధవారం నాడు ఏకంగా 1,157.52 కోట్ల షేర్లను విక్రయించినట్లు తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే ఇన్వెస్టర్లు ఈ వారం ఆచితూచి వ్యవహరించారని చెప్పాలి. ఎందుకంటే ఈ వారం ట్రేడింగ్‌లో ఒక రోజు తగ్గింది. శుక్రవారం వినాయక చవతి సందర్భంగా మార్కెట్లకు సెలవు.

ఇన్ఫోసిస్‌లో నందన్ నీలేకనీ సీఈవోగా బాధ్యతలు చేపడుతున్నట్లు పెద్దెత్తున వార్తలు రావడంతో ఇన్ఫోసిస్ షేరు ఏకంగా రెండు శాతం పెరిగి రూ.912.50 వద్ద ముగిసింది.

ప్రస్తుతం సంక్షోభంలో ఉన్న ఇన్ఫీ నీలేకని రాకతో సమసిపోతుందని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. హెల్త్‌కేర్ స్టాక్ విషయానికి వస్తే డాక్టర్ రెడ్డీస్, లూపిన్, సన్‌ఫార్మాలు పెద్దగా ముగియగా అత్యధికంగా లూపిన్ 3.87 శాతం నమోదు చేసింది. టాటామోటార్స్, టాటాస్టీల్, ఎస్‌బీఐ, ఎల్‌అండ్‌టి, పవర్‌గ్రిడ్‌లు కూడా లాభాలను మూటగట్టుకున్నాయి. అమెరికా ఔషధ నియంత్రణా సంస్థల నుంచి అనుమతులు లభించడంతో క్యాడిలా హెల్త్‌కేర్ 7.02 శాతం పెరిగింది. లిక్కర్ కంపెనీల షేర్లు భారీగా పెరిగాయి. సుప్రీంకోర్టు జాతీయ రహదారులపై లిక్కర్ షాప్‌ల రద్దు గురించి వివరణ ఇచ్చింది. ఈ లైసెన్సులు మునిసిపల్ పరిధిలోకి వచ్చే వాటికి వర్తించవని స్పష్టం చేసింది. దీంతో యునైటెడ్ బ్రూవరీస్, గ్లోబల్ స్పిరిట్స్, తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ 11.26 శాతం వరకు లాభపడ్డాయి. మొత్తానికి ఈ వారానికి చివరి ట్రేడింగ్ రోజైన గురువారం నాడు హెల్త్‌కేర్ సూచి అత్యధికంగా 2.53 శాతం లాభపడగా.. ఐటి, టెక్నాలజీ, క్యాపిటల్‌గూడ్స్ రంగానికి చెందిన సూచిలు కూడా లాభాలతో ముగిశాయి.


వచ్చే ఏడాది బంధన్ బ్యాంకు ఐపీవో



కోల్‌కతా : దేశంలోని మొట్టమొ దటి మైక్రోఫైనాన్స్ ఇన్సిస్టిట్యూ (ఎంఎఫ్ఐ) బంధన్ బ్యాంకు ఇనిషి యల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో) ప్రక్రి యను మొదలుపెట్టింది. రిజర్వు బ్యాం కు నుంచి సూత్రప్రాయంగా లైసెన్సు దక్కించుకున్నామని, వచ్చే ఏడాది ఐపీవోకు రావాలని తమను కోరారని బంధన్ బ్యాంకు వ్యవస్థాపకుడు, సీఈవో చంద్రశేఖర్ ఘోష్ గురువారం నాడు బ్యాంకు రెండో వార్షికోత్సవం సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు. బ్యాంకు ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్నామని.. ఐపీవోకు రావడానికి ఇంకా ఒక సంవత్సరం ఆగాల్సి ఉందని,, అయితే ఇప్పటి నుంచే ఈ ప్రక్రియ మొదలుపెట్టామని ఆయన అన్నారు. ఇప్పటి నుంచి ఐపీవో ప్రక్రియ మొదలుపెడితే 2018కి పూర్తి కాదని ఆయన వివరించారు. ఈ సమయంలోనే భాగస్వాములతో కూడా చర్చలు జరపాల్సి ఉందని, అటు తర్వాత ఇష్యూ సైజుతో పాటు ఎప్పుడు మార్కెట్‌కు రావాలనే అంశాలను నిర్ణయిస్తామని ఘోష్ చెప్పారు. ఇదిలా ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో బ్యాంకు రూ.327 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. కాగా ఈ రెండేళ్లలో బ్యాంకు రూ.23,500 కోట్ల డిపాజిట్లు సేకరించింది. బ్యాంకు రుణ పుస్తకం రూ.21,000 కోట్లుగా ఉంది. కాగా బ్యాంకు నెట్‌వర్కు దేశవ్యాప్తంగా 840 బ్రాంచీలతో పాటు 383 ఎటీఎంలను నిర్వహిస్తోంది. బంధన్ బ్యాంకు త్వరలోనే డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ ఇన్సూరెన్స్, మ్యుచువల్ ఫండ్ ప్రాడక్టులలో కూడా ఎంట్రీ ఇవ్వబోతోందన్నారు.

బియ్యం అక్రమ రవాణాదారులపై పీడీ

● పౌర సరఫరాల కమిషనర్ ఆనంద్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రేషన్ బియ్యం అక్రమ రవాణాపైన ఉక్కుపాదం మోపుతున్నారు. గత కొంత కాలంగా ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు కొనసాగిస్తున్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణాదారుల కదలికలపై నిఘాను కట్టుదిట్టం చేశాయి. ఇప్పటికే ఇద్దరు వ్యాపారుల పపై పీడీ కేసులు పెట్టారు. పలువులు అక్రమ వ్యాపారులపై 6ఏ కేసులు, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. గత ఆరు మాసాల కాలంలో 444 ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ఆల్పడుతున్న వారి పైన కేసులు నమోదు చేశారు. దాదాపు రూ. 4.26 కోట్ల విలువైన నిత్యావసరాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు బియ్యం వ్యాపారులపై పీడీ కేసులు నమోదు చేశారు. ఈ బృందం నిఘా ఫలితంగా ప్రభుత్వానికి రూ. 25 కోట్లు ఆదా అయిందని పౌరసరఫరాల కమిషనర్ సి.వి. ఆనంద్ తెలిపారు. నిఘా కొనసాగుతుందని, అక్రమాలను అరిట్టేందుకు కఠినమైన చట్టాలను అమలు పర్చడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. సూర్యాపేటకు చెందిన మిర్యాల నరసింహరావు, ఖమ్మం జిల్లాకు చెందిన ఎ. సత్యానారాయణ, నల్లగొండ జిల్లాకు చెందిన చంద్రశేఖర్ కొంత కాలంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారని నిర్ధారించి పీడీ కేసులు పెట్టామని తెలిపారు. తాజాగా నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన చంద్రశేఖర్ అనే వ్యాపారి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడని గుర్తించి పీడీ కేసు నమోదు చేశారు. ఈ వ్యాపారిపైన 2014లో తొలి కేసు నమోదయింది. అప్పటి నుండి ఇప్పటి వరకు చంద్రశేఖర్ పై 6ఏ కేసులు 16, క్రిమినల్ కేసులు 5, మూడు బైండోవర్ కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ చంద్రశేఖర్ రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడని గుర్తించి జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ గురువారం నాడు పీడీ కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం అక్రమాల పైన పౌరసరఫరాల శాఖ నిఘాను కట్టుదిట్టం చేసినప్పటికీ వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతునే ఉన్నారు. బియ్యాన్ని సేకరించడం, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడం వ్యాపారంగా కొనసాగిస్తున్న వారి పైన అధికారుల కేసులు నమోదు చేస్తున్నప్పటికీ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతుందని భావించి నిబంధనల పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటున్నారు. రేషన్ బియ్యం తినలేని వారు చౌక ధరల దుకాణాల్లో కొనుగోలు చేయరాదని కూడా కోరింది. రూపాయికి కిలో బియ్యం కొనుగోలు చేసి అత్యధికులు కిలో బియ్యం రూ. 10ల చొప్పున విక్రయించడంతో గ్రామాల్లో బియ్యం వ్యాపారం చాపకిందనీరుగా సాగుతుంది. గత ఆరు మాసాల కాలంలోనే అధికారులు సుమారు 450కి పైగా దాడులు నిర్వహించారు.

రాజా బహదూర్ సేవలు ప్రశంసనీయం

● శాంతా బయోటిక్ వరప్రసాదరెడ్డికి బహదూర్ పురస్కార సభలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి



హైదరాబాద్ (నల్లకుంట), కెఎన్ఎన్: రాజాబహదూర్ పురస్కారం వరప్రసాద్‌రెడ్డికి ఇవ్వడం ఎంతో గర్వ కారణమని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. నిజాం ప్రభుత్వంలో పోలీస్ శాఖలో ఉన్నతాధికారిగా పని చేస్తూ సామాజిక బాధ్యతతో విద్యా వ్యాప్తి కోసం, ముఖ్యంగా మహిళల విద్యకోసం రాజా బహదూర్ ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ప్రాణాంతక వ్యాక్సిన్ కనిపెట్టి తక్కువ ధరకే అందరికీ అందిస్తూ దేశానికే గర్వకారణంగా ఎదిగిన శాంతా బయోటిక్స్ అధినేత వరప్రసాద్‌రెడ్డికి రాజాబహదూర్ పురస్కారం ఇవ్వడం ఆయన గౌరవాన్ని కాపాడడమేనన్నారు. రాజాబహదూర్ వెంకటరామా రెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం రాత్రి రెడ్డి హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో రాజా బహదూర్ వెంకటరామారెడ్డి అవార్డు-2017ను పద్మభూషణ్ డాక్టర్ ఈశ్వర్ వరప్రసాద్‌రెడ్డికి ప్రదానం చేశారు. రాజాబహదూర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎడ్ల రఘుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి నాయిని మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఎంతో అనుభవం ఉండి సామాజిక సేవలందిస్తూ శాంతా బయోటిక్స్‌ను దేశానికే గర్వకారణంగా తీర్చిదిద్దారని చెప్పారు. పురస్కార గ్రహీత డాక్టర్ వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ చదువు బడిలో, సంస్కారం తల్లి ఒడిలో నేర్చుకోవాలని సూచించారు. 1993లో బయోటెక్నాలజీలో దేశం ఎంతో వెనుకబడి ఉందని, శాంతా బయోటిక్స్ వచ్చిన తరువాత ఇప్పుడు మూడవ స్థానంలో ఉందన్నారు. రాజాబహదూర్ లాంటి మహోన్నత వ్యక్తి పేరుతో పురస్కారం తీసుకోవడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి వరప్రసాద్‌రెడ్డి దంపతులకు శాలువాతో ఘనంగా సన్మానించి, పురస్కారం అందజేశారు. పురస్కారం కింద లక్ష రూపాయల నగదు ఇవ్వగా, దానికి రెండు లక్షలు కలిపి మూడు లక్షలు తిరిగి ఆయన సొసైటీకి అందజేశారు.

పారదర్శకంగా భూ సర్వే

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని భూ రికార్డుల సర్వేపై పాదర్శకత అవసరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భూ రికార్డుల సర్వే విషయంలో విపక్ష పార్టీల సలహాలు కూడా ప్రభుత్వం స్వీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమగ్ర సర్వేను తమ పార్టీ స్వాగతిస్తోందని ఆయన తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో తమ్మినేనీ మీడియాతో మాట్లాడారు. భూ రికార్డుల సర్వే విధి విధానాలపై ఇంకా స్పష్టత రావాలని, ప్రభుత్వం బహిరంగ పర్చాలని ఆయన సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిసర ప్రాంతాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనాయన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలోని వెలిమినేడ్ గ్రామంలో రాంకీ సంస్థ దాదాపు మూడు వేల ఎకరాల భూమిని రైతులను నుంచి తక్కువ రేట్‌కే సేకరిస్తోందని తమ్మినేని తెలిపారు. రైతులకు రూ. 2.50 లక్షలు ఇచ్చి రిజిస్ట్రేషన్‌లో మాత్రం రూ. 9.50 లక్షలు చూపెడుతున్నారని వీటిపై ఎకరాకు బ్యాంకుల నుంచి రూ. 35 లక్షల వరకు తీసుకుంటున్నారని తమ్మినేని వివరించారు.

భూ సర్వే పేరిట హంగామా: టీడీపీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ గ్రామాల్లో నయా పెత్తందార్ల పాలన తీసుకొచ్చేందుకు సిఎం కేసీఆర్ భూసర్వేకు శ్రీకారం చుట్టారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర శాఖ తీవ్ర స్థాయిలోధ్వజమెత్తింది. రాష్ట్రంలో రికార్డులను సరిచేసే ఉద్దేశ్యమే ఉంటే శాసనసభ అభిప్రాయం ఎందుకు తీసుకోలేదని పార్టీ రాష్ట్ర నేతలు వేం నరేందర్‌రెడ్డి, సతీష్‌మాదిగ,కూన వెంకటేశ్‌గౌడ్‌లు ప్రశ్నించారు. భూసర్వే పేరిట రాష్ట్ర ప్రభుత్వం కేవలం హంగామా చేస్తోందని వారు మండిపడ్డారు. రాజకీయ దురుద్దేశ్యంతోనే గ్రామాల్లో ఒక విధమైన హైప్ క్రియేట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గతంలో సకల జనుల సర్వే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా హడావిడి చేసిందన్నారు.సమగ్ర కుటుంబ శర్వే ఎందుకు చేశారో ఇప్పటికీ ఎవరికీ తెలియకుండాపోయిందని విమర్శించారు.

ఓబీసీ వర్గీకరణ న్యాయమే

● ప్రధానికి ఆర్. కృష్ణయ్య కృతజ్ఞతలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఓబీసీ రిజర్వేషన్లను వర్గీకరించేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడి తీసుకున్న నిర్ణయంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు నాలుగు గ్రూపులుగా విభజించాలని ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు. ఓబీసీ రిజర్వేషన్లు 1993 నుంచి అమలు చేస్తున్నప్పటికి 2600 కులాల్లో ఇప్పటి వరకు 1470 కులాలే విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు పొందాయన్నారు. వర్గీకరణ చేయడం వల్ల అన్ని కులాలకు న్యాయం జరుగుతోందన్నారు.

డిజిటల్‌లో తెలంగాణ నెం. 1

● ప్రభుత్వ సలహాదారు వివేక్


హైదరాబాద్,ఆంధ్రప్రభ: డిజిటల్ ట్రాన్సక్షన్స్‌లో తెలంగాణ ముందున్నదని ప్రభుత్వ సలహాదారు వివేకానంద అన్నారు. నగరంలోని కాచిగూడలో నేషనల్ ఇన్సిట్యూట్ ఆఫ్ ఎల్రక్టానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్న మధ్య తరహా వ్యాపారస్తులకు డిజిటల్ పేమెంట్ ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన్ డే వర్క్ షాపును ప్రారంభించి మాట్లాడారు. ట్రేడర్స్‌కి డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియాలో క్యాష్ ట్రాన్సక్షన్స్ ఒక ఆచారంలో ఉండేదని, ఇప్పుడు డిజిటల్ ట్రాన్సక్షన్స్ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. జీఎస్టీ తర్వాత ఇన్‌పుట్ టాక్స్, క్రెడిట్ వే బిల్లులపై ట్రేడర్స్ వ్యాపారస్తులకు మరింత అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణలోని ప్రతి జిల్లాలో కూడా ఇలాంటి అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించాలని ఆయన సూచించారు. కొత్తగా వచ్చే టెక్నాలజీతో ట్రేడర్స్, వ్యాపారస్తులు అప్ డేట్ కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ ఛైర్మన్ సోమారం సత్యనారాయణ పలువురు హాజరయ్యారు.

విత్తన ధృవీకరణకు ప్రశంస

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధృవీకరణ అథారిటీ 6వ సాధారణ పాలకమండలి సమావేశం గురువారం నాడిక్కడ వ్యవసాయశాఖ కార్యదర్శి సి. పార్థసారథి ఆధ్వర్యంలో జరిగింది. పాలకమండలి సభ్యులైన వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్ మోహన్, ఉద్యాన శాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ కె. ధర్మయ్య విత్తన పరిశోధన, సాంకేతిక కేంద్రం డైరెక్టర్ ప్రదీప్, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కుమార స్వామి, జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ ప్రాతీయ మేనేజర్ సుధాకర్, ప్రైవేటు విత్తన ఉత్పత్తుదారుల ప్రతినిధి రమణరావు, విత్తన రైతు ప్రతినిధికొట్టాల చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాలకమండలి సభ్యులు మొదటగా సంస్థ పనితీరు విశ్లేసిస్తూ డైరెక్టర్ కేశవులు నాణ్యమైన విత్తన ధృవీకరణలో చూపుతున్న చొరవ, చేస్తున్న కృషిని ప్రశంసించారు. అలాగే విత్తన నాణ్యత సమస్యలన్నింటిని అధిగమించడానికి ధృవీకరణ సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తూ రైతులకు నకిలీ, కల్తీ విత్తన బెడదలేని విత్తన ఉత్పత్తితో పాటు సరఫరా జరగాలని ఈ సందర్భంగా సమావేశం ఆదేశించింది.

ఇంటింటి సర్వేను సక్రమంగా చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి భన్వర్‌లాల్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న భన్వర్‌లాల్



హాజరైన అధికారులు

మహబూబ్‌నగర్, కెఎన్ఎన్: తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటి సర్వేను సక్రమంగా చేయాలని ఓటరు నమోదులో తీస్తున్న ఫోటోలు క్వాలిటీ లేవని నాణ్యమైన ఫోటోలతో ఓటరు లీస్టులో నమోదు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి భన్వర్‌లాల్ వివిధ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. గురువారం హైదరాబాద్ ఎన్నికల కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ మీ జిల్లాలో కేంద్ర ఎన్నికల కమీషన్ షెడ్యూల్ ప్రకారం ఇంటింటికి సర్వే పూర్తి చేయాలని, డ్రాఫ్టు రోల్‌ను 28 వరకు పబ్లిష్ చేయాలని, దీనికి అనుగుణంగా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకొని అనుకున్న సమయానికి పూర్తి చేయాలని ఆయన అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డి. రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో డాటా చెక్ చేసి తప్పులను సరిదిద్దే విధంగా ఇంటింటి సర్వే చేసే తగిన సూచనలు చేస్తున్నామని, అలాగే అవసరమైన మేర పర్యవేక్షణ అధికారులను నియమించడం జరిగిందని, మహబూబ్‌నగర్ నియోజకవర్గ ఓటర్లు 1 లక్షల 82వేల 87 మంది ఓటర్లు ఉన్నారని, ఎన్యూమారెటెడ్ చేసిన వారి సంఖ్య 46వేల 402 మంది నమోదు చేయడం జరిగిందని, 24 వరకు నమోదు చేసిన 4.72శాతం , కొత్తగా నమోదు చేసుకున్న వారు 1698 మంది నమోదు చేసుకున్నారని ఆయన అన్నారు. మీరు ఇచ్చే సూచనలు , సలహాలు తప్పక పాటించి అనుకున్న సమయానికి లక్ష్యాలను చేరుతామని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ప్రభాకర్, ఏఓ ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు నలుగురు మృతి

విజయనగరం-కెఎన్ఎన్ బ్యూరో: విజయనగరం జిల్లాలో పిడుగుపాటుకు గురై వేర్వేరు చోట్ల నలుగురు మృతి చెందారు. గురువారం పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవడంతో పాటు ఆయా ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. దీంతో ఆ సమయానికి పొలాల్లో పని చేస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు.

లక్కవరపుకోట మండలం ఖాసాపేట గ్రామ పరిధిలో పొలాల్లో పని చేస్తున్న కె.అప్పలనాయుడు(50), పి.రాము నాయుడు(65) అక్కడికక్కడే మృతి చెందారు. అయితే, వీరితో పాటు వున్న కె.కృష్ణ మాత్రం తీవ్రగాయాల పాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణ పరిస్థితి విషమంగా వున్నట్లు తెలుస్తోంది. ఎస్.కోట మండలం చుక్కవానిపాలెం కు చెందిన డి.విశ్వనాధ్(55) కూడా పొలం పనులు చేస్తుండగా పిడుగుపాటుకు బలయ్యారు. మరోవైపు దత్తిరాజేరు మండల పరిధి పెదమానాపురానికి చెందిన పాచిపెంట అన్నపూర్ణ కూడా పొలం పనుల్లో వుండగా పిడుగుపాటుకు గురై మృత్యువుపాలైంది. కాగా, గజపతినగరం మండలం పరిధిలో భీకరమైన శబ్ధాలతో పిడుగులు పడినప్పటికీ అదృష్టవశాత్తు ఎవరూ బలికాకపోవడంతో మృతుల సంఖ్య నాలుగుకు పరిమితమైంది.

గణేష్ ఉత్సవాలకు భారీ భద్రత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రజలు ప్రతిష్టాత్మకంగా జరుపుకునే గణేష్ నవరాత్రి ఉత్సవాలకు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ ఉత్సవాలకు 24 వేల మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మారు బందోబస్తులో టెక్నాలజీకి అధిక ప్రాధాన్య తనిస్తున్నామన్నారు. జియో ట్యాగింగ్ ద్వారా అనుసంధానిస్తున్నామని తెలిపారు. ఉత్స వాల్లో డీజేకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మొద్దని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు పూర్తి చేశారు. ఈ ఉత్సవాల్లో పోలీసు శాఖతో పాటు రెవెన్యూ, జీహెచ్ఎంసీ, విద్యుత్ తదితర శాఖలు పాలుపంచుకుంటున్నాయన్నారు. ఆయా ప్రాంతాలలో మండప నిర్వాహకులు స్థానిక పోలీసులకు సహకరించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్క పోలీసు వల్ల అంతా కాదని ప్రజలు కూడా తగు విధంగా సహకారాన్నందించాల్సిన అవసరం ఉంద న్నారు. ఈ మారు వినాయకచవితి, బక్రీద్‌లు ఒకేమారు వస్తున్నాయన్నారు. సెప్టెంబర్ 5న నిమజ్జనోత్సవ సందర్భంగా ఖైరతాబాద్ గణనాథునితో సహా మొత్తం విగ్రహాలన్నింటినీ అదే రోజు నిమజ్జనం జరిగేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు.

నేటి నుంచి కాణిపాకం బ్రహ్మోత్సవాలు

చిత్తూరు, కెఎన్ఎన్ : స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు వినాయక చవితి రోజైన శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆలయ కార్యనిర్వహ ణాధికారి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీప కాంతులతో అందంగా ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణంలో స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అలాగే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కాణిపాకం నుంచి పలు ప్రదేశాల్లో బ్రహ్మోత్సవ శోభను తలిపించే పలురకాల ఆర్చిలను ఏర్పాటు చేశారు. కాగా నేడు రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ మంత్రి మాణిక్యాల రావు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. ఇందుకోసం ఆలయాధికారులను అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు.

మున్సిపాల్టీలకు వరం.. అమృత్ పథకం

● **వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.3,765 కోట్లు**

● **మంచినీటి సరఫరా, పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం**



నీటి శద్ధి ప్రాజెక్టు

అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ పథకం రాష్ట్రంలోని మున్సిపాల్టీలకు వరంగా మారింది. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు 3765 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేశాయి. 2015-16 సంవత్సరంలో అమృత్ పథకం కింద కేవలం మున్సిపాల్టీల్లో మంచినీటి సరఫరాకే ప్రాధాన్యమిచ్చారు. ఆ ఏడాదిలో రాష్ట్రంలోని 26 ప్రాజెక్ట్‌లకు 813.50 కోట్లు మంజూరయ్యాయి. వాటిలో 24 ప్రాజెక్ట్‌లకు టెండర్లు పిలువగా, 22 ప్రాజెక్ట్‌లకు టెండర్ల దశ పూర్తయింది. అందులో 20 మున్సిపాల్టీల్లో మంచినీటి పథకాలు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటి వరకు తొలిదశలో 412.65 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఈ పథకంలో భాగంగా మున్సిపాల్టీల్లో పార్కుల అభివృద్ధి, గ్రీనరీని విస్తరించేందుకు 34 ప్రాజెక్ట్‌లకు 16.07 కోట్లు మంజూరు కాగా, 10.19 కోట్లు ఖర్చు చేశారు. తొలివిడతలో కాకినాడ, తిరుపతిలలో టెండర్ స్టేజిలో ఉండగా గుంతకల్లు ప్రాజెక్ట్‌కు అనుమతి లభించింది.

ఇదిలా ఉంటే అమృత్ పథకంలో 2016-20 సంబంధించి నాలుగేళ్లలో వివిధ మున్సిపాల్టీల్లో 94 ప్రాజెక్ట్‌లకు 2951.44 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తుండగా, 30 శాతం మున్సిపాల్టీలు, 20 శాతం రాష్ట్రప్రభుత్వం ఖర్చు చేస్తుంది. రెండో పథకంలో ప్రధానంగా మంచినీటి సరఫరాతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నీటిని శుద్ధి చేయడం, అదేవిధంగా మురికి కాల్వల్లో నీటిని శుద్ధిచేసి కాలువలకు వినియోగించడం జరుగుతుంది. మంచినీటి సరఫరా కింద 29 ప్రాజెక్ట్‌లకు 1334.74 కోట్లు, భూగర్భ డ్రైనేజీ నీటిని శుద్ధి చేసేందుకు 26 ప్రాజెక్ట్‌లకు 495.44 కోట్లు, మురికి కాల్వల్లో నీటిని శుద్ధి చేసేందుకు 7 ప్రాజెక్ట్‌లకు 289.71 కోట్లు, వివిధ పట్టణాల్లో పార్కుల అభివృద్ధి, గ్రీనరీని విస్తరించేందుకు 32 ప్రాజెక్ట్‌లకు 18.29 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్రంలోని 94 ప్రాజెక్ట్‌లకు 2140.18 కోట్లు మంజూరు కాగా, 94 ప్రాజెక్ట్‌లకు అనుమతి లభించింది. కర్నూలు, కావలి పట్టణాలకు ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి పరిపాలనా పరమైన అనుమతులు లభించాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, మచిలీపట్నం, గుడివాడ, గుంటూరు, నరసరావుపేట, చిలకలూరిపేట, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, ధర్మవరం, గుంతకల్, కడప, ఆదోని, నంద్యాల, అనంతపురం, హిందూపురం, తాడిపత్రి, ప్రొద్దుటూరు, శ్రీకాళహస్తి ఈ పట్టణాలకు అనుమతి లభించింది. కాగా శ్రీకాకుళం, విజయనగరం, తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, మచిలీపట్నం, గుడివాడ, గుంటూరు, నరసరావుపేట, చిలకలూరిపేట, ఒంగోలు, తిరుపతి, మదనపల్లి, ధర్మవరం, ఆదోని, నంద్యాల, హిందూపురం, తాడిపత్రి, ప్రొద్దుటూరు, శ్రీకాళహస్తి పట్టణాలకు సాంకేతిక అనుమతి లభించింది, కాగా శ్రీకాకుళం, విజయనగరం, తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, మచిలీపట్నం, గుడివాడ, గుంటూరు, నరసరావుపేట, ఒంగోలు, తిరుపతి, మదనపల్లి, ధర్మవరం గుంతకల్, ఆదోని, హిందూపురం, తాడిపత్రి, ప్రొద్దుటూరు, శ్రీకాళహస్తిలలో ఈ ప్రాజెక్టులు టెండర్ దశలో ఉన్నాయి. కాగా చిలకలూరిపేట, నంద్యాలలో పనులు ప్రారంభమయ్యాయి.


భూగర్భ డ్రైనేజీ నీటిని శుద్ధి చేసేందుకు 26 ప్రాజెక్ట్‌లకు 825.73 కోట్లు మంజూరయ్యాయి. వాటిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ, తెనాలి, చిలకలూరిపేట, ఒంగోలు, తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, ధర్మవరం, గుంతకల్, కడప, కర్నూలు, ఆదోని, నంద్యాల, అనంతపురం, కాళహస్తి, కావలి పట్టణాలకు పరిపాలనా పరమైన అనుమతులు లభించాయి. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, రాజమండ్రి, కాకినాడ, తాడేపల్లి గూడెం, భీమవరం, ఏలూరు, మచిలీపట్నం, గుడివాడ, తెనాలి, చిలకలూరిపేట, ఒంగోలు, మదనపల్లి, గుంతకల్, కడప, ఆదోని, నంద్యాల, అనంతపురం, కావలి, శ్రీకాళహస్తి పట్టణాలకు సాంకేతిక పరమైన అనుమతులు లభించాయి.

అలాగే మురికి కాలువల్లో నీటిని శుద్ధి చేసేందుకు రాష్ట్రంలో 7 పట్టణాలకు 350.75 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో శ్రీకాకుళం, రాజమండ్రి, కాకినాడ, మచిలీపట్నం, నెల్లూరు, తిరుపతి, అనంతపురం పట్టణాలకు పరిపాలనా పరమైన అనుమతులు లభించాయి. అలాగే శ్రీకాకుళం, కాకినాడ, మచిలీపట్నం, నెల్లూరు, అనంతపురం పట్టణాలకు సాంకేతిక పరమైన అనుమతులు మంజూరయ్యాయి. శ్రీకాకుళం, నెల్లూరు పట్టణాలకు ఈ ప్రాజెక్ట్ టెండర్ల దశలో ఉంది. రాష్ట్రంలోని 32 పట్టణాలకు పార్కుల అభివృద్ధి, గ్రీనరీ విస్తరణకు 36.61 కోట్లు మంజూరురయ్యాయి. వీటిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ, తెనాలి, గుంటూరు, నరసరావుపేట, చిలకలూరిపేట, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, ధర్మవరం, గుంతకల్, కడప, కర్నూలు, ఆదోని, నంద్యాల, అనంతపురం, హిందూపూర్, తాడిపత్రి, ప్రొద్దుటూరు, కావలి, శ్రీకాళహస్తి పట్టణాలకు పరిపాలనా పరమైన అనుమతులు లభించాయి. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ, తెనాలి, గుంటూరు, నరసరావుపేట, చిలకలూరిపేట, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, ధర్మవరం, గుంతకల్, కడప, కర్నూలు, ఆదోని, నంద్యాల, అనంతపురం, హిందూపూర్, ప్రొద్దుటూరు, కావలి, శ్రీకాళహస్తి పట్టణాలకు సాంకేతిక పరమైన అనుమతులు మంజూరయ్యాయి. కాగా విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మదనపల్లి, ధర్మవరం, అనంతపురం పట్టణాల్లో ఈ ప్రాజెక్ట్‌లు టెండర్ దశలో ఉన్నాయి. అమృత్ రెండో విడత కార్యక్రమంలో అభివృద్ధి పథకాలను నాలుగేళ్లలో పూర్తి చేయాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయితే ఆయా పట్టణాల్లో మంచినీటి సమస్య పరిష్కారం కావడంతోపాటు భూగర్భ డ్రైనేజీ, మురికినీటి శుద్ధి ప్లాంట్ల వలన వ్యవసాయానికి కొంత అనువుగా మారనుంది.

తండ్రి తీర్పును మార్చేసిన తనయుడు

● ఎమర్జెన్సీలో హక్కుల అణచివేతను సమర్థించిన జస్టిస్ వైవీ చంద్రచూడ్

● నేడు వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనంటూ డీవై చంద్రచూడ్ తీర్పు



న్యూఢిల్లీ: జస్టిస్ డీవై చంద్రచూడ్.. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైవీ చంద్రచూడ్ తనయుడు. 1975 ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కులను ఇందిర నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేసింది. ఆ సమయంలో ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం ఇందిర నిర్ణయాన్ని సమర్థించింది. ఈ బెంచ్‌లో వైవీ చంద్రచూడ్ సభ్యుడిగా ఉన్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత తండ్రి నిర్ణయానికి వ్యతిరేకంగా జస్టిస్ డీవై చంద్రచూడ్ తీర్పునిచ్చారు. గోప్యత ప్రాథమిక హక్కేనంటూ తీర్పు వెలువరించిన తొమ్మిది మంది రాజ్యాంగ ధర్మాసనంలో డీవై ఒకరు. ''జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛ మానవహక్కులకు సాటిలేనిది. వ్యక్తిగత స్వేచ్ఛను, పౌరుల జీవితాన్ని ఏ నాగరిక సమాజము అంగీకరించదు'' అని డీవై చంద్రచూడ్ తీర్పు పాఠం రాశారు.

1976 ఏడీఎం జబల్‌పూర్ కేసులో సుప్రీం కోర్టు ప్రాథమిక హక్కులపై విలక్షణ తీర్పునిచ్చింది. అత్యయిక ఆదేశాల నేపథ్యంలో పౌరుల ప్రాథమిక హక్కులు తొలగించబడతాయని ప్రకటించింది. ఎమర్జెన్సీ నేపథ్యంలో వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు రాజ్యాంగం ముందు ఉనికిలో ఉందో లేదో గుర్తించడం అసాధ్యమని జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. కాగా, ''జీవితం, స్వేచ్ఛ అనేవి ప్రభుత్వాలు కల్పించేవి కావు. ఈ హక్కులు రాజ్యాంగ బద్ధంగా సంక్రమించేవి'' అని తాజా తీర్పులో డీవై చంద్రచూడ్ స్పష్టంచేశారు. తండ్రి తీవ్ర పొరపాటును తనయుడు సరిదిద్దాడు అంటూ గోప్యత గురించి కోర్టులో పోరాటం చేసిన న్యాయవాదుల్లో ఒకరు వ్యాఖ్యానించారు.



ఉత్తరప్రదేశ్‌లో కురిసిన భారీ వర్షాలకు వరదల్లో చిక్కుకున్న ఓ గ్రామం

నేడు హైదరాబాద్‌కు నేపాల్ ప్రధాని

రాజ్‌భవన్‌లో రాత్రి విందు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నేపాల్ ప్రధాన మంత్రి షేర్ బహదూర్ దేవ్‌బా శుక్రవారం నగరానికి రానున్నారు. ఆయన ఫలక్‌నుమా ప్యాలెస్‌లో బస చేయనున్నారు. బహదూర్ గౌర వార్థం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ విందు ఇవ్వనున్నారు. శనివారం ఆయన తిరుపతి వెళ్ళను న్నారు. నేపాల్ ప్రధాని ప్రత్యేక విమా నంలో మధ్యా హ్నం 2.30 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో ఐటి నిపుణులతో ఇష్టాగోష్టి నిర్వహిస్తారు. అనంతరం సెంట్రల్ యూని వర్సిటీలోని టి.హబ్‌ను సందర్శించి స్టార్టప్ కంపెనీలకు అది అందిస్తున్న ప్రోత్సాహాన్ని అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత ఫలక్‌నుమా ప్యాలెస్‌లో చేరుకుంటారు. ఆయనకు అక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా స్వాగతం పలుకనుంది. శనివారం ఉదయం ప్రత్యేక విమానంలో తిరుపతి బయలుదేరి వెళతారు.

పదవుల కోసం పాకులాడను



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) పదవి పెద్దది కాదా ? టీపీసీసీ అధ్యక్ష పదవి కోసం ఎందుకు ప్రయత్నిస్తా ..అని సీఎల్పీ నేత కె జానారెడ్డి స్పష్టం చేశారు. గురువారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియా ప్రతి నిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పార్టీలో తాను సీనియర్ ననీ.., పెద్ద వాడిగా ఐక్యత కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో వ్యక్తుల మధ్య విబేధాలు ఉండొచ్చని,వాటి ప్రభావం పార్టీపై పడదన్నారు. అంతర్గత విబేధాలను పరిష్కరించుకుంటామన్నారు. ప్రాంతీయ పార్టీలో ఏకనాయకత్వం ఉంటుందని, జాతీయ పార్టీలో ఆ పరిస్థితి ఉండదు కదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో పార్టీ గెలిస్తే గెలిచిన ఎమ్మెల్యేలంతా కూర్చుని ఒకరిని నాయకుడిగా ఎన్నుకుంటారని, ఆ విషయం అధిష్టానం దృష్టికి తీసుకువెళతామని,ఇది కాంగ్రెస్ సంప్రదాయమని, అంతే తప్ప.., 2019 ఎన్నికల్లో గెలిస్తే ఎవరు సీఎం ? అంటే సమాధానం ఉండదన్నారు. తాను ఒక విధానంతో వెళతానని,ఇతరుల మాదిరిగా దూసుకుపోలేనని చెప్పారు. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలపై తాను మాట్లాడడం లేదని అనటం సరికాదని, తాను మాట్లాడినట్లు ఎవరు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. శాసనసభలో తాను చేసిన ప్రసంగాలే అందుకు నిదర్శనమని అన్నారు. తానెప్పుడు పదవులను కోరుకోలేదని, పదవులు వాటంతటవే వచ్చాయ న్నారు. ఎవరిని ఎప్పుడు ఎక్కడ పెట్టాలో పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని పేర్కొన్నారు.

మంత్రి ఆదినారాయణ అరెస్టుకు డిమాండ్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దళిత, గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఆదినారాయణ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని ఆలిండియా దళిత్ రైట్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపక జాతీయాధ్యక్షుడు కే. ఆనంద రావు ఢిల్లీలోని ఏపీ భవన్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డారు. దళిత, గిరిజనులను కించపరుస్తూ అవమానించిన మంత్రి ఆదినారాయణ రెడ్డిని తక్షణమే ఆ పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని ఆనందరావు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ''ఎస్సీ, ఎస్టీలకు తెలివి ఉండదు. శుభ్రంగా ఉండరు. వారికి చదువు రాదు'' అని ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యానించారని, అవి అత్యంత దుర్మార్గమైన హేయమైన వ్యాఖ్యలని ఆనంద రావు మండి పడ్డారు. దళిత, గిరిజనులపై ఇంత దారుణమైన వ్యాఖ్యలు చేసిన మంత్రిపై ఇంకా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఏపీ సీఎం చంద్రబాబును ఉద్దేశించి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఇంతవరకు ఎందుకు కేసు నమోదు చేయలేదని అన్నారు. ఆదినారాయణ రెడ్డిపై తాము ఢిల్లీలోని ఎస్సీ, ఎస్టీ కమిషన్లను కలిసి ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. అలాగే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కూడా కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మంత్రి ఆదినారాయణ రెడ్డిని తక్షణమే అరెస్టు చేయకపోతే తాము దేశవ్యాప్తంగా అన్ని ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమం చేపడతామని ఆనందరావు హెచ్చరించారు.


హైదరాబాద్‌లో అరబ్ షేక్‌ల ఆగడాలు

పేద ముస్లిం యువతులు, మైనర్ బాలికలే టార్గెట్

హైదరాబాద్/రాజేంద్రనగర్, ఆంధ్రప్రభ: అరబ్ షేక్‌ల హల్‌చల్ తగ్గడం లేదనేందుకు తాజాగా మరోఘటన వెలుగుచూసింది. హైదరాబాద్ నగర శివారు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్బర్‌హిల్స్‌లో ఓ యువతిని దుబాయ్ షేక్ సలీం ఒబిత్ సయిాద్ సల్మాన్ అల్లాటి ఈ నెల 16వ తేదీన పెళ్లి చేసుకున్నాడు. తన సోదరుడు కోసం బండ్లగూడకు చెందిన మ్యారేజ్ బ్రోకర్ మహ్మద్ షఫీ సహాయంతో మరో యువతిని సిద్ధం చేశాడు. షేక్ వివాహానికి సంబంధించిన ఫొటోలు, అగ్రిమెంట్ పేపర్లు, ఒప్పంద పత్రాలను బ్రోకర్ సిద్ధం చేశాడు. మొదట షేక్ వివాహం చేసుకున్న మహిళకు రూ.40 వేలు, బ్రోకర్‌కు రూ.30 వేలు అందాయి. వివాహం చేసుకునేందుకు షేక్ సోదరుడు నగరానికి చేరుకున్నాడు. షేక్ సలీం వివాహం చేసుకున్న యువతి బంధువు ఒకరు ఈ తతంగంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రంగంలోకి దిగి ఇద్దరు అరబ్‌షేక్‌లు, వారికి సహకరించిన ఇద్దరు బ్రోకర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నంద్యాలలో తెదేపాదే విజయం

లగడపాటి సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : నంద్యాల నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ అన్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ఎన్నికలు జరిగినా తన బృందంతో సర్వే జరిపించి అంచనాలను అందజేస్తున్న ఆయన, నంద్యాల ఉప ఎన్నికలపైనా తన బృందంతో సర్వే జరిపించినట్టు వివరించారు. ఈ మేరకు ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన లగడపాటి, నామినేషన్లకు ముందు, ప్రచార సమయంలో, పోలింగ్ తేదీ నాడు వేర్వేరుగా సర్వేలు నిర్వహించినట్టు వెల్లడించారు. మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకే ఎక్కువ మంది ప్రజలు మొగ్గు చూపారాని తన సర్వే ఫలితాలు వెల్లడించారు. పోలింగ్ ముగిసిన తర్వాత జరిపిన విశ్లేషణల అనంతరం తమ బృందం తెలుగుదేశం పార్టీయే విజయం సాధిస్తుందని లెక్కగట్టిందని తెలిపారు. ''నా సర్వేల విశ్వసనీయత గురించి నాకంటే మీకే ఎక్కువ తెలుసు'' అని వ్యాఖ్యానించారు.

రాజకీయాల్లోకి మళ్లీ వస్తారా అన్న ప్రశ్నకు ససేమిరా రానంటూ సమాధనమిచ్చారు. ''కొన్ని ప్రత్యేక పరిస్థితుల రీత్యా నేను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించాను. అన్న మాట ప్రకారం గత మూడేళ్ల నుంచి రాజకీయాలకు పూర్తి దూరంగా ఉంటున్నాను. మీరే చూస్తున్నారు కదా. నేను మళ్లీ రాజకీయాల్లో వచ్చే ప్రసక్తే లేదు'' అని లగడపాటి స్పష్టం చేశారు.

ఏపీలో భారీగా మిగిలిన మెడికల్ సీట్లు

నాలుగో విడత కౌన్సెలింగ్‌పై అనిశ్చితి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మూడు విడతల కౌన్సెలింగ్ అనంతరం ఏపీలో భారీగా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు మిగిలాయి. వీటి భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్ జరపాలా? వద్దా అనే అంశంపై అధికారులు ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. సాధారణంగా మెడికల్, డెంటల్ సీట్ల భర్తీకి ఏటా రెండు విడతల కౌన్సెలింగ్ జరిపి తరగతులను ప్రారంభించే సంప్రదాయం ఉంది. ఈ ఏడాది అనూహ్యంగా కన్వీనర్ కోటాతో పాటు యాజమాన్య కోటా సీట్లను ప్రభుత్వమే భర్తీ చేస్తుండడంతో ఈ సీట్లను ఎంపిక చేసుకునేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తి కనబరచలేదు. మూడు విడతల కౌన్సెలింగ్ పూర్తయ్యాక 26 మెడికల్ సీట్లు, మూడు వందలకుపైగా డెంటల్ సీట్లు మిగిలిపోయి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. గురువారం రాత్రితో మూడో విడత కౌన్సెలింగ్ ముగిసింది. యాజమాన్య కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల వార్షిక ఫీజులను భారీగా పెంచడంతో అందులో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరచడం లేదు.

ఆర్టీసీ విభజనకు ఉమ్మడి బోర్డు ఆమోదం

- స్థానికత ఆధారంగా ఉద్యోగుల బదలీలు
- ఆస్తుల పంపకంపై వీడని చిక్కుముడి
- ఉమ్మడి అకౌంట్లకు బోర్డు అంగీకారం
- వచ్చే 15న ఆర్టీసీ ఉమ్మడి బోర్డు భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) విభజనకు ఉమ్మడి ఆర్టీసీ బోర్డు ఆమోదం తెలిపింది. ఉభయ తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ ఉద్యోగుల విభజనకు సంబంధించి విధివిధానాలకు కూడా బోర్డు అమోదం తెలియచేసింది. మూడు సంవత్సరాల తర్వాత గురువారం విజయవాడలో తొలిసారిగా జరిగిన ఉమ్మడి ఆర్టీసీ బోర్డు పలు అంశాలను చర్చించి అనేక కీలక నిర్ణయాలను తీసుకుంది. ఉద్యోగుల విభజన, అకౌంట్లకు ఉమ్మడి ఆర్టీసీ పాలక మండలి ఆమోదం తెలియచేసినందున సొంత బోర్డులను ఏర్పాటు చేసుకొనేందుకు అడ్డంకులు తొలగిపోయినట్లేనని అధికారులు తెలిపారు. గత మే మాసంలో తెలంగాణ రవాణా మంత్రి పి. మహేందర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రవాణా మంత్రి కె. అచ్చం నాయుడు విజయవాడలో సమావేశమై తీసుకున్న నిర్ణయాల మేరకు గురువారం విజయవాడలో సమావేశమైన ఉమ్మడి ఆర్టీసీ పాలక మండలి విభజన, విభజన అనంతర పరిణామాలపైన చర్చించింది. కేంద్ర ప్రభుత్వం తరపున ఈ సమావేశంలో ఏఎస్ఆర్టీయూ కార్యనిర్వాహక సంచాలకులు ఆనందరావు, సీఐఆర్టి సంచాలకులు రాజేంద్ర పాటిల్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునిల్ శర్మ, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రావకృష్ణారావు, ప్రభుత్వ కార్యదర్శి శశాంక్ గోయల్,ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు, జిహెచ్ఎంసీ



కమీషనర్ జనార్ధన్ రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నుండి ఆర్థిక, రవాణా శాఖల ముఖ్య కార్యదర్శులు సుమిత్రా దావ్రా, కె.వి.వి. సత్యనారాయణ పాటుగా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ మాలకొండయ్య తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ ఆస్తుల పంపకాలు, ఉద్యోగుల విభజన, రెండు రాష్ట్రాల మధ్యన బస్సుల రాకపోకలు తదితర అంశాలను అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. ఆర్టీసీ ఉమ్మడి ఆస్తుల విభజనకు సంబంధించి మరి కొంత సమయం కావాలని టిఎస్ఆర్టీసీ అధికారులు కోరారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 15న మరోసారి ఉమ్మడి ఆర్టీసీ బోర్డు సమావేశం కావాలని నిర్ణయించారు. స్థానికత ఆధారంగా ఉద్యోగుల విభజనకు బోర్డు అంగీకరించింది. దంపతుల విషయంలో పరస్పర బదిలీలకు ఆమోదం తెలిపింది. బస్ భవన్, తారనాక ఆసుపత్రి, మియాపూర్ బస్ బాడీ యూనిట్‌ను ఉమ్మడి ఆస్తుల పరిధిలో చేరుస్తూ గతంలో ఆర్టీసీ అడ్వైజరీ కమిటీ నివేదిక ఇచ్చింది. ఏపి సంఘాలు, ఇతర సంఘాలు 14 ఆస్తులను ఉమ్మడి ఆస్తుల్లో చేర్చి రెండు రాష్ట్రాలకు పంచాలని డిమాండ్ చేస్తున్నాయి. దశల వారిగా తెలంగాణ ఆర్టీసీ బస్సులను ఆంధ్ర ప్రాంతంలో తిప్పేందుకు అధికారుల స్థాయిలో నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని టిఎస్ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు ఆంధ్రప్రభకు తెలిపారు. ఉమ్మడి ఆస్తుల విషయంలో ప్రభుత్వాలదే తుది నిర్ణయం అవుతుందని అభిప్రాయపడ్డారు. టిఎస్ఆర్టీసీ, ఏపిఎస్ఆర్టీసీల పరిధిలో ఉద్యోగుల పంపిణీకి సంబంధించి సుమారు 1200 మంది అధికారులు, సూపర్‌వైజర్ల విభజన కూడా ఈ సమావేశం అనంతరం జరిగిపోతుందన్నారు. వచ్చే నెల 15న మరో సారి భేటీ కాబోతున్నామని వెల్లడించారు. దాదాపు 14 మాసాల అకౌంట్లకు బోర్డు అమోదం లభించిందన్నారు. స్థానికత ఆధారంగా ఉద్యోగుల విభజన ఉంటుందని పేర్కొన్నారు. ఆస్తుల పంపకాలకు సంబంధించి ప్రభుత్వంతో చర్చించవలసి ఉందని టిఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ రమణారావు తెలిపారు. విజయవాడలో టిఎస్ఆర్టీసీ రిజర్వేషన్, ఎంక్వైరీ కౌంటర్‌ను ఈ సందర్భంగా టిఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ రమణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో టిఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆర్. గంగాధర్, ఎన్.వి.రావు, పి.వి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త మద్యం పాలసీపై తెరాస సర్కార్ కసరత్తు?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో కొత్తగా మద్యం పాలసీని ప్రవేశపెట్టేం దుకు తెరాస సర్కార్ యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన కసరత్తును శరవేగంగా చేస్తోంది. సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని కొత్త నిబంధనలపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా పట్టణ హైవేలపై మద్యంషాపుల దుకాణాలు ఇప్పటి వరకు ఆరు స్లాబులు ఉండగా వాటిని మూడుకు కుదించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. లైసెన్సులను కూడా రెండేళ్ళకు ఒకేసారి ఇవ్వనుంది. ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించి లాటరీ పద్ధతి ద్వారా షాపులను కేటా యించ నున్నారు. అయితే మద్యం షాపులతో పాటు పర్మిట్ గదులను కూడా అను మతులను ఇవ్వ నున్నారు. మొత్తం 1,184 మద్యం షాపుల్లో నేషనల్ హైవేలపై 623,స్టేట్ హైవేలపై 561 మద్యం షాపులను మంజూ రు చేయనున్నారు. అలాగే నేషనల్ హైవేలపై 256 బార్లు, స్టేట్ హైవేలపై 155 బార్లకు అనుమతులు ఇచ్చే విధంగా కసరత్తు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

సబ్బండ వర్ణాల పార్టీ కాంగ్రెస్

- వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యం
- కోవర్టులూ ఖబడ్దార్
- ఆంధ్రప్రభతో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ గల్లంతవడం ఖాయమని టీపీసీసీ ఉపాధ్య క్షురాలు డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో ఉండి పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారిని, కోవర్టులను సహించే ప్రసక్తిలేదని హెచ్చ రించారు. పార్టీ అంతర్గత విషయాలను వేరే పార్టీలకు చేరవేసే వారు పార్టీకి రాజీ నామా చేసి వెళ్లడమే మంచిదని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఏ కులానికో ..,మతానికో..., వర్గానికో సంబంధించిన పార్టీ కాదని, సబ్బండ వర్గాలు తమది అని చెప్పుకునే గొప్ప పార్టీ ఇదొక్కటే అని చెప్పారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజాదరణ రోజురోజుకు పెరిగిపోతోందని, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సెక్యులర్ వాదులు, వామపక్షాలు దేశవ్యాప్తంగా ఏకమవుతున్నారని అన్నారు. గురువారం ఆమె ఆంధ్రప్రభతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి, టీఆర్ఎస్ ప్రభుత్వం పాలనపై మాట్లా డారు. టీఆర్ఎస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక నీళ్లు...,నిధులు.., నియా మకాల విషయం పట్టించుకోనందున ప్రజలు తిరగబడే రోజులు వస్తున్నాయని జోస్యం చెప్పారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎలా గెలుస్తుందని అడగ్గా..., 2014లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రా న్ని ఇచ్చినప్పటికీ, పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున కొత్త రాష్ట్రపాలన టీఆర్ఎస్ పార్టీకి అప్పగిద్దామని ప్రజలు మెజారిటీ ఇచ్చారని చెప్పారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన సందర్భంలో .., అధికారం టీఆర్ఎస్‌కే అప్పగిద్దామని అన్ని వర్గాలు భావించిన తరుణంలో కూడా 119 నియోజకవర్గాలకు గానూ కేవలం 63 సీట్లను మాత్రమే టీఆర్ఎస్ గెలిచిందన్నారు. ఆనాడు ఎన్నికల్లో అన్నివర్గాలు ఏకమైనప్పటికీ అఖండ విజయాన్ని ఆ పార్టీ సొంత చేసుకోలేకపోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ పరిస్థితి అత్యంత దారుణంగా ఉండబోతోందన్నారు. ఎలాగంటే.., ఎన్నికలకు ముందు టీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారు... సమయం వచ్చినప్పుడు తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు సిద్ధపడుతున్నారు.., అధికారంలోకి వస్తే దళితుడే సీఎం అని ఇచ్చిన తొలి హామీని సీఎం కేసీఆర్ తుంగలో తొక్కారు.., ఆ తర్వాత దళితులకు మూడెకరాల



భూమి, టూ బెడ్ రూం ఇళ్లు, ఫీజు రీయింబర్స్ మెంట్, ఇంటికో ఉద్యోగం, కేజీ టూ పీజీ ఉచిత విద్య, ఏకకాలంలో రుణమాఫీ చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తమ వర్గానికి చెందిన వ్యక్తి సీఎం అవుతారని, మూడెకరాల భూమి వస్తుందని భావించి 90 శాతం మంది దళితులు గత ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఓట్లు వేశారని, అదే విధంగా టూబెడ్ రూం ఇళ్లు ఇస్తామని ఇచ్చిన హామీని అన్నివర్గాలకు చెందిన పేదలు నమ్మి మద్దతు పలికారని తెలిపారు. అదే విధంగా 12 శాతం రిజర్వేషన్లు వస్తాయని ముస్లింలు, 10 శాతం రిజర్వేషన్లు వస్తాయని గిరిజనులు,ఇంటికో ఉద్యోగం వస్తుందని నిరుద్యోగులు నమ్మితే ప్రభుత్వం వారిని వంచించిందని మండిపడ్డారు. ఫీజులు రీయింబర్స్‌మెంట్ చేయకపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని డీకే అరుణ ఆందోళనవ్యక్తం చేశారు. ఉస్మానియా, కాకతీయ విశ్వ విద్యాలయాలు తెలంగాణ ఉద్యమాలకు పురిటిగడ్డలని, ఎందరో విద్యార్థులు రాష్ట్రం కోసం బలిదానాలు చేశారని, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ, ఇతర వర్గాలు సైతం ఒకే ఒక లక్ష్యం...., అది తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనే గమ్యాన్ని చేరుకోవడం..,కోసం త్యాగాలు చేశారని చెప్పారు. సోనియా, రాహుల్ నేతృత్వంలో రాష్ట్రంలో పార్టీ రోజురోజుకు బలపడుతోందని, పార్టీతోపాటు అనుబంధ సంఘాలను కూడా పటిష్టం చేస్తున్నామని, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా జనంలోకి వెళుతున్నామని,ఒక్క క్లిక్ ద్వారా పార్టీ సమాచారం మూడున్నర లక్షలమందికి చేరవేసే టెక్నాలజీని పార్టీ అనుబంధ సోషల్ మీడియా సెల్ అభివృద్ధి చేసిందన్నారు. సంగారెడ్డి సభలో రాహుల్ గాంధీ ప్రసంగం తర్వాత జనానికి కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పెరిగిందన్నారు. ఆ సభకు లక్షల సంఖ్యలో ప్రజలు తరలివచ్చారని పేర్కొన్నారు. నేరెళ్లలో దళితులు, బీసీలకు చిత్రహింసలు పెట్టడం, ఖమ్మంలో మద్దతు ధర కోరిన గిరిజన రైతులకు బేడీలు వేసి కోర్టుకు హాజరుపర్చడం , ధర్నా చౌక్‌ను ఇందిరాపార్క్ నుంచి ఎత్తివేయడం, భావప్రకటన స్వేచ్ఛగా విఘాతం కలిగించడమేనన్నారు.

మూసీని సుందరీకరిస్తాం

- జంటనగరాలకు మణిహారంగా తయారు చేస్తాం: మంత్రి నాయిని నర్సింహారెడ్డి
- ఏడాదిలోపే పనులు ప్రారంభం: కార్పొరేషన్ చైర్మన్ ప్రేమ్‌సింగ్ రాథోడ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలకు మూసీనదిని ఒక మణిహారంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయినీ నర్సింహ్మారెడ్డి అన్నారు. గత ప్రభుత్వాలు మూసీ అభివృద్ధిపై పూర్తి నిర్లక్ష్యం చేశాయని వ్యాఖ్యానించారు. హైటెక్ సిటీ, సైబర్ సిటీ తప్ప నగరానికి చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఇక కాంగ్రెస్ హయంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేశారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

మూసీనది అభివృద్ధి కోసం ప్రత్యేకంగా సైఫాబాద్‌లోని పాత హెచ్ఎంఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను బుధవారం హోంశాఖ మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి ప్రారంభించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ప్రేమ్‌సింగ్ రాథోడ్ ఈ సందర్భంగా తన పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నాయినీ నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ, మూసీ నదికి 1908లో జోరుగా వరదలు వచ్చినప్పుడు పెద్దఎత్తున ఆస్థి, ప్రాణనష్టం వాటిల్లిం దన్నారు. మూసీనది



ఉగ్రరూపాన్ని చల్లార్చిందేందు కు నిజాం ప్రభువు పట్టువస్త్రాలను ధరించి గంగమ్మ తల్లికి పూజలు చేయడంతో వరదలు తగ్గిన విషయాన్ని ఈ సందర్భంగా నాయిని గుర్తు చేశారు. నిజాం ప్రభువు ముస్లిం అయినప్పటికీ ప్రజల సంక్షేమం కోసం పట్టు వస్త్రాలు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారని కితాబిచ్చారు. పాలకులు ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేయాలే తప్ప స్వంత ప్రయోజనాలు, రాజకీయ లబ్దికోసం కాదన్నారు. తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శ మన్నారు. ఇందులో భాగంగానే మూసీనది అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

అనంతరం కార్పొరేషన్ చైర్మన్ ప్రేంసింగ్ రాథోడ్ మాట్లాడుతూ, మూసీనది అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.1600.40 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఇంత పెద్దమొత్తంలో నిధులను విడుదల చేసిన చరిత్ర గత ప్రభుత్వాలకు లేదన్నారు. సుమారు 40 కిలోమీటర్ల మేరకు ఉన్న మూసీనది ప్రక్షాళన, అభివృద్ధి పనులను 32 కిలోమీటర్ల మేరకు తొలివిడతగా చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఈ సంవత్సరంలోనే పనులను ప్రారంభించనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై తనపై పెట్టుకున్న ఆశలను నిజం చేసేందుకు రాత్రింబ వళ్ళు నిరంతరం శ్రమిస్తానని అన్నారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు పర్యాద కృష్ణ మూర్తి, పలువురు తెరాస నాయకులు పాల్గొన్నారు.

రోహిత్ వేముల ఆత్మహత్యపై

నివేదిక తప్పుల తడక

నిరసన గళమెత్తిన విద్యార్థులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యపై విచారణ జరిపిన అశోక్ కుమార్ రూపన్‌వాలా కమిషన్ తప్పుడు తడకలతో రాజకీయ ప్రయోజనాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి ఇచ్చారని వర్సిటీ విద్యార్థులు ఆరోపించారు. వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్, కేంద్ర మంత్రులు దత్తాత్రేయ, స్మృతి ఇరానీ, బిజెపి ఎమ్మెల్సీ రామచంద్రరావు, ఎబి విపికి చెందిన నందనం సుశీల్ కుమార్, కృష్ణచైతన్యలపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైతే దాన్ని పరిగణలోకి కూడా తీసుకోలేదని పలు విద్యార్థి సంఘాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి. సెంట్రల్ వర్సిటీ రిసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యపై దర్యాప్తు జరిపేందుకు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అశోక్ కుమార్ రూపన్‌వాలా ఏకసభ్య కమిషన్‌ను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ నియమించింది. ఈ కమిషన్ ఏడాది పాటు విచారణ చేసి ప్రభుత్వానికి ఇటీవల తన నివేదికను సమర్పించింది. మానసిక ఆందోళన, ఒత్తిడితోనే రోహిత్ వేముల ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆ నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నివేదికను నిరసిస్తూ రోహిత్ వేములకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో గురువారం సెంట్రల్ యూని వర్సిటీలో ఆందోళన చేపట్టారు. రోహిత్ వేములను వేధించారని, అవహేళన చేశారని, ఆయనపట్ల వివక్ష చూపారని, దళిత రిసెర్చ్ స్కాలర్‌ను వ్యవస్థ హత్య చేసిందని యూనివర్సిటీ విద్యార్థులు గళమెత్తి నినదించారు. రూపన్‌వాలా కమిషన్ నివేదికను తిరస్కరించాలని యూనివర్సిటీకి చెందిన అనేక మంది విద్యార్థులు, టీచర్లు డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో విద్యార్థుల ధర్నాను ఉద్దేశించి అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకుడు డి.ప్రశాంత్ మాట్లాడుతూ, బిజెపి, ఎబివిపిలకు వ్యతిరేకంగా రోహిత్ ఆత్మహత్యలో అనేక సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ వాటిని కాపాడే విధంగా ఈ నివేదిక ఉందని ఆరోపించారు.

గెలుపు గుర్రంపై సర్వేల స్వారీ!

- అందరి చూపు నంద్యాలవైపే
- భారీ మెజారిటీపై భూమా ధీమా
- రికార్డు మెజారిటీపై శిల్పా ఆశలు
- జోరుగా బెట్టింగులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రజలనే కాకుండా రాజకీయ వర్గాలను సైతం అత్యంత ఆసక్తికి లోను చేస్తూ ఉత్కంఠ భరింతంగా సాగిన నంద్యాల ఉప ఎన్నికల్లో గెలుపు గుర్రంపై సర్వేలు జోరుగా స్వారీ చేస్తున్నాయి. రికార్డ్ స్థాయిలో జరిగిన పోలింగ్ ఏపార్టీకి అనుకూలం,,ఎవరికి పట్టాభిషేకం అన్న చర్చలు ఇపుడు అత్యంత ఆసక్తికరంగా మారాయి. తెలుగుదేశం , వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీల మధ్యన నువ్వా నేనా అన్నట్టు సాగిన ఎన్నికల ప్రచారం చివరకు నంద్యాల ప్రజల్లో చైతన్యం ఓటేత్తేలా చేసింది. గత రెండు దశాబ్దాల నంద్యాల ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 79.20శాతం ఓట్లు పోల్ కావటం పట్ల భారత ఎన్నికల సంఘం కూడా నంద్యాల ఎన్నికల యంత్రాంగాన్ని అభినందించింది. తెలుగుదేశం , వైఎస్ఆర్‌కాంగ్రెస్ , కాంగ్రెస్ , రాయలసీమ పరిరక్షణ సమితి, అన్నవైఎస్ఆర్ , రాజ్యాధికార పార్టీ, నవతరం పార్టీ, సమాజ్ వాది పార్టీ, బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీల అభ్యర్దులతో పాటు మరో ఆరు మంది ఇండిపెండెంట్ అభ్యర్దులు పోటీ చేసిన ఈ ఎన్నికల్లో ప్రధానంగా పోటీ టీడీపీ అభ్యర్ధి భూమా బ్రహ్మానందరెడ్డి, వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధి శిల్పా మోహన్‌రెడ్డి మధ్యనే సాగింది. 218,858 మంది ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో మొత్తం 1,73,335 మంది తమ ఓటు హక్కును ఉప యోగించుకున్నారు. ఇందులో అత్యధికంగా 88503 మంది మహిళలు పోలింగ్‌లో పాల్గొని తమ సత్తా చాటారు. నంద్యాల పట్టణం , నంద్యాల రూరల్, గోస్పాడు మండలాల పరిధిగా జరిగిన ఉప ఎన్నికల పోలింగ్‌లో ఓటరు చెప్పిన తీర్పేమిటీ..మహిళా ఓటర్లు ఏపార్టీ అభ్యర్థిని కరుణించారు.. ఏసామాజిక వర్గం ఓటర్లు ఎటువైపు మొగ్గారు, గ్రామీణ ఓటర్లు ఏపార్టీకి అనుకూలంగా ఓటేశారు..పట్టణ ఓటర్లను ఆకట్టుకున్న అంశాలేమిటీ..రికార్డు స్థాయిలో జరిగిన పోలింగ్ ప్రభుత్వపనితీరుకూ అనుకూలమా లేక వ్యతిరేకమా , ప్రతిపక్షం అధికారతెలుగుదేశంపార్టీ వైఫల్యాలపై సంధించిన అస్త్రాలు ఏమేరకు ఫలించాయి అన్న అంశాలే ఇపుడు ప్రధాన రాజకీయపార్టీలతోపాటు అభ్యర్దులను ములుకుల్లా తొలుస్తున్నాయి. క్యాలిక్యులేటర్లపై కూడికలు.. తీసివేతలు .. హెచ్చవేతలతో భూమా, శిల్పా శిబిరాలు కుస్తీలు పడుతున్నాయి. మరో వైపు ఓటర్ల నాడిని పసిగట్టి పోలింగ్ తీరును కాచి వడబోశామంటున్న సర్వే సంస్థలు సైతం ఒక్కోటి ఒక్కో పార్టీకి అనుకూలంగా సర్వే గణాంకాలతో ఊదరగొడుతున్నాయి. ఎన్నికల నియమావళిలో భాగంగా సర్వేలు వెల్లడించరాదన్న ఆంక్షలతో ఉగ్గబట్టుకున్న సర్వే సంస్థలు పోలింగ్ ముగిసి ముగియగానే తమ సర్వేలను ప్రకటంచుకోవటంలో పోటీలు పడుతున్నాయి. సోషల్ మీడియాలో సైతం సర్వే ఫలితాలు తెలుగుదేశం , వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీలను ఊరిస్తూ ఆశల పల్లకిలో విహరింప చేస్తున్నాయి. నంద్యాల ఉప ఎన్నికల పోలింగ్ గణాంకాల నివేదకలు తెప్పించుకున్న టీడీపీ ,వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీల అగ్ర నేతలు సైతం నంద్యాల ఉప ఎన్నికల విజయంపై ఎంతో ధీమా కనబరుస్తున్నారు. నంద్యాలలో తెలుగుదేశం పార్టీ నూటికి నూరు శాతం గెలిచి తీరుతుందని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎంతో విశ్వాసంతో చెబుతున్నారు. నంద్యాల పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి కూడా తాను భారీ మెజారీటీతో గెలువబోతు న్నట్టు ప్రకటించారు. అటు మంత్రి అఖిలప్రియ కూడా తన అన్న బ్రహ్మన్న విజయంపై ఎంతో ధీమాగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ ముఖ్యనేత ఏవి సుబ్బారెడ్డి సైతం గెలుపై ఎంతో ధైర్యాన్ని కనబరుస్తున్నారు. పార్టీకి చెందిన ఇతరనేతల నోట కూడా గెలుపుపాటలే వినిపిస్తున్నాయి. అయితే మెజారిటీ ఎంత అన్న అంశంలోనే బిన్నమైన లెక్కలు చెబుతున్నారు. ఎన్నికల సర్వేల్లో దిట్టగా చెప్పుకునే ఆంధ్రా ఆక్టోపస్ అధినేత మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ కూడా నంద్యాలలో తెలుగుదేశపార్టీ గెలుపు ఖాయం అని ప్రకటించారు .ప్రముఖ టీవీ ఛానల్ ఫ్లాస్‌టీం సర్వేలో టీడీపీకి 54శాతం , వైకాపాకు 36శాతం , కాంగ్రెస్‌కు 2శాతం , ఇతరులకు 5శాతం ఓట్లు పోల్ అయినట్టు ప్రకటించింది.

విజయ దరహాసంలో జగన్ శిబిరం:

నంద్యాల పోలింగ్ అనంతరం వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం తమ అభ్యర్ధి విజయానికి ఢోకాలేదన్న ధైర్యంతో ఉంది.జగన్ శిబిరంలో విజయ దరహాసం కనిపిస్తోంది. రికార్డ్



స్థాయి పోలింగ్ శిల్పా విజయానికి బాటలు వేసిందంటున్నారు. మహిళా ఓటర్లలో వచ్చిన చైతన్యం జగన్‌పార్టీకీ అనుకూలించిందన్న ధైర్యంతో ఉన్నారు. గ్రామీణ ప్రాంత ఓటర్లు వైఎస్ర్‌కాంగ్రెస్‌కు అండగా నిలిచారన్న నమ్మకాన్ని కనబరుస్తున్నారు. గోస్పాడు మండలంలో 5వేల మెజారీటిని అంచనావేస్తున్నారు. నంద్యాల రూరల్ మండలంలో కూడా 3వేల మెజారిటీని అశిస్తున్నారు. పట్టణ పరిధిలో 3వేలకుపైగా ఓట్ల అధిక్యతను అంచనా వేస్తున్నారు. ఉప ఎన్నికల్లో జరిగిన భారీ పోలింగ్ విజయానికి సంకేతం అని పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి ప్రకటించారు.

జోరుగా బెట్టింగులు !


ఉత్కంఠభరితంగా సాగిన నంద్యాల ఉప ఎన్నికల పోలింగ్‌పై పందెపు రాయుళ్లు రెచ్చిపోతున్నారు. నంద్యాల నియోజకవర్గంలోని వారికంటే అధికంగా బయటి ప్రాంతాల వారే నంద్యాల ఎన్నికల ఫలితంపై జోరుగా బెట్టింగులు కడుతున్నారు. గోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, గుంటూరు, కర్నాటకలోని రాయచూర్ , బెంగుళూర్ ప్రాంతాల్లో జోరుగా పందేలు కాస్తున్నట్టు సమాచారం . గెలుపుపై కొందరు, మెజారీటీ పై మరికొందరు బెట్టింగులు కడుతున్నారు.

పంచ్‌కుల జనసంద్రం



రామ్‌రహీమ్ ఆశ్రమంలో జనం రాక

- దేరా అధినేతకు మద్దతుగా వేలాది జనం
- చండీగఢ్‌లోనూ అంతే
- 144 సెక్షన్ విధించినా మారని పరిస్థితి
- పారామిలిటరీ దళాల ఫ్లాగ్ మార్చ్‌లు



చండీగఢ్‌లో పహారా

చండీగఢ్/న్యూఢిల్లీ: ఒక నిందితుడికి శిక్ష పడుతుందేమోనన్న భయంతో ఒక పట్టణమే జనసంద్రమైంది. తమ ఆధ్యాత్మిక గురువుకు ఎక్కడ శిక్ష విధిస్తారోనన్న భయంతో ఆయన అనుయాయులు చండీగఢ్, పంచ్‌కులకు చేరుకున్నారు. ఏ రోడ్డు, ఏ పార్కు, ఏ బహిరంగ ప్రదేశం చూసినా వారే కనబడుతున్నారు. డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్ రహీం సింగ్‌పై 15 ఏళ్ల క్రితం నమోదైన అత్యాచారం కేసులో శుక్ర వారం తీర్పు రానున్న నేపథ్యంలో హర్యానా లోని పంచ్‌కులలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ చిన్న పట్టణానికి వేలాదిగా డేరా అనుయాయులు చేరుకున్నారు. డేరా అధినేతకు వ్యతిరేకంగా తీర్పు వస్తుందన్న అనుమానంతోనే వీరు పంచ్‌కులకు చేరుకున్నారని ప్రభు త్వం అనుమానిస్తోంది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అక్కడికి 15,000 మంది పారామిలిటరీ దళాలను పంజాబ్, హర్యానా లోని సున్నిత ప్రాంతాలకు తరలించింది. మొబైల్ ఇంటర్నెట్ సర్వీసులను ఈ రెండు రాష్ట్రా ల్లో 72 గంటల పాటు ఆపి వేసారు. పంచ్‌కులకు వెళ్లే బస్సులు, రైళ్లను అధికారులు ఆపివేసారు. పంచ్ కులలో 144వ సెక్షన విధించి అక్కడి వారు ఖాళీ చేయాలని పోలీసులు ఆదేశించినా, జనం అక్కడి నుంచి కదలడం లేదు. అయితే.. పోలీసుల ఆందోళనలు కొంత నెమ్మదించే విధంగా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ తాను ప్రత్యేక సీబీఐ కోర్టుకు హాజరవుతా నని చెప్పారు. తాను ఎప్పుడూ చట్టాన్ని గౌర వించే వ్యక్తినని చెప్పారు. అందరూ ప్రశాం తంగా ఉండాలని తన అనుచరులకు పిలుపుని చ్చారు. రామ్ రహీం సింగ్‌పై అత్యాచారం కేసును పంజాబ్, హర్యానా హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ నమోదు చేసింది. డేరా అధినేత తన అనుయా యులైన ఇద్దరు మహిళలను లైంగికంగా వాడుకున్నారన్న లేఖలు విపరీతంగా ప్రచారంలోకి రావడంతో ఈ కేసు నమోదైంది. అయితే.. తాను అలాంటి పనేమీ చేయలేదని డేరా అధినేత ఖండించారు. అయితే.. కోర్టు తీర్పు నేపథ్యంలో వేలాదిగా డేరా మద్దతుదా రులు పార్కుల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ నిండిపోయారు. దీంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా భద్రతా దళాలు పంచ్‌కులలో, సిర్సా, హిసార్ లలో ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించాయి. ఇతర ప్రాంతాల నుంచి పంజాబ్, హర్యా నాలకు వెళ్లే 29 రైళ్లను రద్దు చేసారు. వీటిలో 22 పంజాబ్‌కు వెళ్లేవి కాగా, ఏడు హర్యానాకు వెళ్లేవని ఉత్తర రైల్వే ప్రతినిధి ప్రకటించారు.

హైకోర్టు ఆగ్రహం

పంచ్‌కుల రహదారులన్నీ డేరా ఆధ్యాత్మిక గురువు రామ్ రహీం సింగ్ అనుయాకులతో నిండి పోవడంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం మధ్యాహ్నం 2.30కు సీబీఐ ప్రత్యేక కోర్టు రామ్ రహీం సింగ్‌పై తీర్పు ఇవ్వనుంది. ఈ నేపథ్యంలో చండీగఢ్, పంచ్‌కులలు డేరా అనుయాయులతో నిండిపోవడంతో పంజాబ్, హర్యానా హైకోర్టు, ఇప్పటి వరకూ ఏం చేస్తున్నారని ప్రభుత్వాలను నిలదీసింది. చండీగఢ్, పంచ్‌కులల్లో పరిస్థితిపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజాన్ని విచారించిన హైకోర్టు జాట్‌ల ఆందోళన మాదిరిగా పరిస్తితి మారేలా చేయొద్దని హెచ్చరించింది. అప్పట్లో 20 మంది మరణించడం, 170 మంది గాయపడడాన్ని ప్రస్తావించింది. పరిస్థితి ఇక్కడి దాకా వచ్చిందంటే ప్రభుత్వం విఫలమైనట్లేనని కోర్టు వ్యాఖ్యానించింది. రామ్ రహీం నేతృత్వంలోని సంస్థ తమ అనుయాకులు ప్రశాంతంగా ఇళ్లకు తిరిగి వెళ్లేలా చేయాలని ఆదేశించింది.

లాలూకు చుక్కెదురు



పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు రాజకీయంగా మరో పరాభవం ఎదురైంది. ఆగస్టు 27న 'బీజేపీ బాగవో... దేశ్ బచావో' పేరు లాలూ ర్యాలీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ర్యాలీకి కాంగ్రెస్ అధ్యక్షురాలు, బీఎస్పీ, సీపీఐ(ఎం), తృణమూల్ కాంగ్రెస్ తదితర ఎన్డీయేతర పక్షాలన్నీ మద్ధతు పలికాయి. అయితే, తాజాగా ఆ ర్యాలీకి కాంగ్రెస్ అధ్యక్షు రాలు సోనియా గాంధీ, బహుజన్ సమాజ్ వాదీ చీఫ్ మాయవతి గైర్హాజరవుతు న్నట్లు ప్రకటించారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్య దర్శి సీతారాం ఏచూరి కూడా ర్యాలీకి హాజరు కాలేమని వెల్లడించారు. 2019 ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నింటినీ ఒక్కతాటిపైకి తీసుకు వచ్చేందుకు లాలూ చేసిన తొలి ప్రయత్నమే ఈ విధంగా విఫలమవడంతో ఆయన నిరాశకు గురైనట్లు తెలిసింది. అయితే, ఎవరొచ్చినా... రాకపోయినా ర్యాలీ నిర్వహిస్తానని లాలూ వెల్లడించారు. తాను ఇప్పటికే మాయ వతితో మాట్లాడానని బీఎస్పీ నుంచి తమ పార్టీ కార్యదర్శిని పంపిస్తామని హామీని చ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా గులాం నబీ ఆజాద్ ర్యాలీకి హాజర వుతారని ఆయన తెలిపారు. ఇక ర్యాలీలో మమతా బెనర్జీ స్వయంగా పాల్గొంటా రని లాలూ స్పష్టం చేశారు.

ఒంటరి ముస్లిం మహిళ ఆర్థికంగా బలపడాలి

ట్రిపుల్ తలాక్ కేసులో సుప్రీం తీర్పుపై షాబానో కుమార్తె

ఇండోర్: ఒంటరి ముస్లిం మహిళల(డైవర్స్‌డ్ ఉమెన్) ఆర్థిక ప్రగతికి కఠిన చట్టాలు అవశ్యమని ట్రిపుల్ తలాక్ పోరాటయోధురాలు షాబానో కుమార్తె సిద్దిఖీ బేగమ్ గురువారం అభిప్రాయపడ్డారు. త్రిపుల్ తలాక్‌పై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ముస్లిం మహిళలకు అండగా నిలుస్తుందని చెప్పారు. ముస్లిం మహిళలు నిరాక్ష్యరాస్యులు అవడంతో ఇన్నాళ్ళు వివాహం తర్వాత భర్తతో ఎన్నో వేధింపులు ఎదుర్కొన్నారన్నారు. వేధింపులు తాళలేక ఎంతోమంది మహిళలు కనీస భరణం లేకుండా విడాకులు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అటువంటి నిరాక్ష్యరాస్య మహిళలకు సుప్రీం తీర్పు బాసటగా నిలిచిందని పేర్కొన్నారు. డైవర్స్ తర్వాత ముస్లిం మహిళలు ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇద్దత్ పేరుతో ఎంతో కొంత అంటూ ఇచ్చి మహిళలను నిర్లక్ష్యం చేసేవారని చెప్పారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తమకు చట్ట ప్రకారం పూర్తి భరణం రావాలని కోరారు. త్రిపుల్ తలాఖ్‌కు తన తల్లి వ్యతిరేకం కాదని గుర్తు చేశారు. దాని పేరుతో మహిళలను ఆర్థికంగా ఒంటరి చేయకూడదని చెప్పారు. ముస్లిం ఒంటరి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ పోరాటమన్నారు. 1985లో సుప్రీం కోర్టు భారతీయ ముస్లిం మహిళలకు బాసటగా నిలిచినప్పటికీ, అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ ఆ తీర్పుకు వ్యతిరేకంగా చట్టాన్ని తీసుకువచ్చారని చెప్పారు. దాంతో, మరోసారి ముస్లిం మహిళల ఆర్థిక భద్రత మరింత ప్రశ్నార్థకమైందన్నారు. 1400 సంవత్సరాల ఆచారాన్ని ప్రస్తుతం కూడా ఆచరించమనడం ఏంటని ఆమె ప్రశ్నించారు.


బాలల రక్షణకు కైలాష్ సత్యార్థి పిలుపు



న్యూ ఢిల్లీ: భారత్‌లో బాలలను రక్షించాలని నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి పిలుపునిచ్చారు. దేశ బాలలతోనే భారత అధివృద్ధి ఆధార పడి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బాలల హక్కుల రక్షణ కోసం అన్నివర్గాలూ సంఘటితంగా పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బాలల అపహరణ, వేధింపులపై అవగాహన కల్పిస్తూ నిర్వహించే యాత్రను సత్యార్థి ముంబైలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ట్రాఫికింగ్ తగ్గాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం భారత స్థూల జాతీయోత్పత్తి 9 శాతం ఉందని, చిన్న పిల్లలను పూర్తిగా రక్షించినట్లయితే ఆ శాతం మరింత అధికమవుతుందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు కూడా భారత్‌ను కేవలం నైపుణ్య దేశంగా మాత్రమే కాకుండా చిన్నారుల రక్షణకు భారత్‌ను సరైన అడ్డాగా తయారు చేయాలని కోరారు. ఈ యాత్ర తమిళనాడులోని కన్యా కుమారి నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించబడుతుందని చెప్పారు. బాలల రక్షణ గురించి ఇప్పటికి ఎన్నో చట్టాలున్నాయని, అయినా చిన్నారుల అపహరణను ఆయా చట్టాలు ఆపలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యాత్ర అనంతరం ప్రభుత్వం చిన్నారుల భద్రత గురించి మరిన్ని చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారుల రక్షణ గురించి చర్యలు తీసుకుంటున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కొనియాడారు. తమ ఆశయం కోసం సాయపడుతున్న పలు కార్పొరేట్ కంపెనీల సీఈఓలు, ఎండీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

భారత్-నేపాల్ భాయి, భాయి

- హిమాలయ దేశంతో ఎనిమిది ఒప్పందాలు
- చైనాకు కంటగింపు
- మోడీ విధానాలకు నేపాల్ ప్రధాని దేవ్‌బా ప్రశంసలు
- నేపాల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మోడీ భరోసా



న్యూఢిల్లీ: పొరుగు దేశాలకు ప్రాముఖ్యతనివ్వాలన్న భారత ప్రధాని నరేంద్ర మోడీ వైఖరిని నేపాల్ ప్రధాన మంత్రి షేర్ బహదర్ దేవ్‌బా ప్రశంసించారు. గురువారం మోడీతో సమావేశమైన దేవ్‌బా, అనంతరం సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోడీ విధానమైన అందితో కలిసి అభివృద్ధి (సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్) తనను ఆకట్టుకుందని చెప్పారు. భారత్‌లో ఐదు రోజుల పర్యటనలో ఉన్న దేవ్‌బా, రెండో రోజు మోడీతో సమావేశమయ్యారు. అంతకు ముందు ఆయనకు రాష్ట్రపతి భవన్‌లో సంప్రదాయబద్ధంగా స్వాగత సత్కారం లభించింది. మోడీతో సమావేశంలో ఇంధనం, నీటి వనరులు, ఇతర ప్రాజెక్టులపై నేపాల్‌తో ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి. నేపాల్‌లో భారత్ సాయంతో 50,000 ఇళ్లు నిర్మించే ఒప్పందం, విద్యా రంగం పునర్మిర్మాణం, సాంస్కృతిక వారసత్వంపై ఒప్పందం, నేపాల్‌లో ఆరోగ్య రంగం బాగుకు అవగాహన, ప్రమాణాల మెరుగుదలకు సంతకాలు, మేచి బ్రిడ్జి నిర్మాణం, అక్రమ డ్రగ్స్ రవాణా నియంత్రణ, భారత, నేపాల్ చార్టర్డ్ అకౌంటెంట్ల సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి. నేపాల్ అభివృద్ధిలో భారత్ పాలుపంచుకుంటుదని ఈ సందర్భంగా మోడీ స్పష్టం చేసారు. డొక్లాం విషయంలో భారత్, చైనాల మధ్య ప్రతిష్టంభన నేపథ్యంలో నేపాల్ ప్రధాని భారత్‌లో పర్యటిస్తుం డడం గమనార్హం. ఈ వివాదంలో ఇప్పటి వరకూ నేపాల్ తటస్థంగా ఉంది. వివాదాన్ని చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించు కోవాలని కోరుతోంది. గతంలోని ప్రభుత్వాల కంటే దేవ్‌బా నేతృత్వంలోని నేపాలీ కాంగ్రెస్ ప్రభుత్వం భారత్‌తో సఖ్యంగా ఉండడానికి ప్రాముఖ్యతను ఇస్తోంది. ఈ నేపథ్యంలో భారత్, నేపాల్ మధ్య సంబంధాలు మెరుగుపడ్డందుకు సంతోషిస్తున్నామని చైనా పేర్కొంది. అయితే.. నిజానికి దేవ్‌బా భారత పర్యటన చైనాకు ఆందోళన కలిగిస్తోంది.


చైనాకు చెందిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ), భారత్‌తో నేపాల్ సంబంధాల వల్ల చెడుతుందని ఆ దేశం ఆందోళనగా ఉంది. పైకి మాత్రం గాంభీర్యం ప్రదర్శించినా, నేపాల్‌తో భారత్ సంబంధాలు చైనాకు ఇష్టం లేదు. నేపాల్‌తో తమ వాణిజ్యానికి భారత్‌తో ఒప్పందాలు అడ్డు వస్తాయన్న ఆందోళనతో చైనా ఉంది. టిబెల్‌లోని లాసా నుంచి నేపాల్ రాజధాని ఖాట్మండును అనుసంధానిస్తూ ఒక రైల్వే లైను వేయాలన్నది చైనా ప్రణాళిక. ఇప్పుడా ప్రతిపాదనకు అవరోధం ఏర్పడే అవకావమూ ఉంది. ఈ నేపథ్యంలో నేపాల్ ప్రధానికి భారత్ ఎర్ర తివాచీ పరిచింది. ఇటీవల బిమ్‌స్టెక్ దేశాల సమావేశం కోసం నేపాల్ వెళ్లిన భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఇరు దేశాల సత్సంబంధాలకూ అవసరమైన పునాది వేసారు. తమ భూభాగం నుంచి భారత వ్యతిరేక కార్యకలాపాలకు తావిచ్చేది లేదని దేవ్ బా ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. భారత దేశంలోని పారిశ్రామిక వేత్తలతోనూ దేవ్ బా సమావేశమయ్యారు. దీంతో మన అక్కడ పెట్టుబడులు పెట్టడానికి అవకాశం మెరుగైంది. ఈ నేపథ్యంలో మోడీతో సమావేశమైన దేవ్‌బా ఆయనను నేపాల్‌లో పర్యటించడానికి ఆహ్వానించారు. ఒక భారీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మోడీ కూడా హాజరు కావాలని ఆయన కోరారు. అయితే.. భారత్, చైనాలతో డొక్లాం మాదిరి లింకు నేపాల్‌కూ ఉంది. లాపులేక్ పాస్ అనే ప్రాంతంలో రవాణా జరిగేలా భారత్ చైనాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందుకు నేపాల్ అభ్యంతరం చెబుతోంది. మొత్తానికి ఇరు దేశాల సంబంధాలు ఏమీ లేని స్థాయి నుంచి ఎంతో కొంతకు మళ్లడం ముదావహమని భారత్ వర్గాలు చెబుతున్నాయి.




నేపాల్‌కు భారత్ సాయం

న్యూ ఢిల్లీ, ఆంధ్రప్రభ : నేపాల్‌లో మౌలిక వసతుల కల్పన మరియు సామాజిక సంస్థల ఏర్పాటులో భారత్ సహకారం ఉంటుందని ఉప రాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. భారత్ పర్యటనలో ఉన్న నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా గురువారం ఉప రాష్ట్రపతిని మర్యాద పూర్వకంగా కలుసు కన్నారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ భారత్ నేపాల్‌తో ఆర్థిక మరియు అభివృద్ధి సహకారాన్ని మరింత పెంచుకోవడానికి ఆసక్తిగా ఉందని, ఇరుదేశాలు దీనికోసం ప్రత్యేక శ్రద్ధ వహించవలసి ఉందని అన్నారు.

శ్వాసకోశ వ్యాధి మరణాలు భారత్‌లో ఎక్కువ





న్యూఢిల్లీ: అస్తమా, ఇతర శ్వాసకోస సంబంధిత వ్యాధుల బాధితుల్లో భారత్ పపువా న్యూగినియా వంటి పేద దేశాల చెంతన చేరింది. ఒక అధ్యయనం ప్రకారం.. 2015లో ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా మరణించారని ప్రఖ్యాత లాన్సెట్ జర్నల్ ప్రచురించింది. ఇందులో సీఓపీడీ వ్యాధుల మరణాల్లో ప్రతి లక్షకు 2,774.64 మంది, అస్థమాకు సంబంధించి ప్రతి లక్షకు 4,021.72 మంది భారత్‌లోనే ఉన్నారు. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ పేరిట జరిపిన ఒక అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. మొత్తం 32 లక్షల మంది శ్వాసకోస వ్యాధుల కారణంగా మరణించగా, నాలుగు లక్షల మంది అస్థమా వల్ల మరణించారు. శ్వాసకోస సంబంధిత వ్యాధుల బాధ భారత్‌తో పాటు పపువా న్యూగినియా, లెసోతో, నేపాల్,లో ఉండగా, అఫ్గానిస్థాన్, పిజి, కిరిబాటి, లెసోతో, పపువా న్యూగినియాల్లో ఎక్కువగా ఉంది. ఈ అధ్యయనంలో 1990 నుంచి 2015 వరకూ సదరు వ్యాధుల మరణాలను గుర్తించారు. క్రోనిక్ బ్రాంకైటిస్‌తో సహా ఇతర సమస్యలను సీఓపీడీగా గుర్తిస్తారు. వీరికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటాయి. 1990 నుంచి ఆయా వ్యాధుల మరణాలు రేటు తగ్గినా జనాభా పెరుగుదల కారణంగా సంఖ్య పెరిగింది. సీఓపీడీ కారణంగా మరణాలు 11.6 శాతం పెరగ్గా, అస్తమా కేసులు 44.2 శాతం పెరిగాయి. అస్థమా మరణాలు 26.2 శాతం తగ్గగా, వ్యాధిగ్రస్తులు మాత్రం 12.6 శాతం పెరిగారు. ఈ వ్యాధుల కారణంగా చాలా మంది వైకల్యంతో జీవిస్తున్నారని తేలింది. భారత్, అఫ్గానిస్తాన్లతో సహా ఆఫ్రికాలోని పేద దేశాల్లో ఈ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నారు. అయితే.. అస్థమా అనేది దీర్ఘకాల శ్వాసకోస వ్యాధిగా ప్రపంచవ్యాప్తంగా అందరికీ సోకుతోంది. అస్థమా లేదా సీఓపీడీ వ్యాధులకు చికిత్స ఉంది. అయినా, అది అందక చాలా మంది మరణిస్తున్నారని అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా కాలుష్యం వల్ల ఈ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. ఆస్బెస్టాస్, పొగ తాగడం, పొగతాగేవారితో కూడి ఉండడం, డీజెల్ మండడం వల్ల వచ్చే వాయువులు శ్వాసకోస వ్యాధులను కలుగజేస్తాయి.

ఆ 19మందిపై వేటు వేయండి

- స్పీకర్‌కు తమిళనాడు ప్రభుత్వ చీఫ్‌విప్ విజ్ఞప్తి
- అనర్హతపై నిర్ణయం కీలకం

పాండిచ్చేరి: తమిళనాడు మళ్లీ రాజకీయంగా వేడెక్కుతోంది. తన వర్గానికి చెందిన 18 ఎమ్మెల్యేలను పాండిచ్చేరి లోని ఒక రిసార్ట్‌లో శశికళ మేనల్లుడు, అన్నాడీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి దినకరన్ మంగళవారం నుంచి ఉంచడం తెలిసిందే. ఆ రిసార్టుకు గురువారం భద్రత పెంచారు. చిన్న వీరంపట్టినం పరిధిలోకి వచ్చే ఈ రిసార్టు బయట అప్పట్లో తమిళనాడులో శశికళ ఎమ్మెల్యేలను దాచి ఉంచినప్పటిలానే భద్రత పెంచారు. విలేకరులతో మాట్లాడిన ఎమ్మెల్యే తమిళ సెల్వన్, తమ గురించి మీడియాలో దుష్ప్రచారం జరుగుతోందని వాపోయారు. తాము రిసార్టులో బందీలుగా లేమని, తామందరం కట్టుగా ఉన్నామని చెప్పేందుకే ఉన్నామని అన్నారు. పన్నీర్ సెల్వం అనుచరులు బుధవారం శశికళ, దినకరన్‌లకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపిన నేపథ్యంలో దినకరన్ వర్గం స్పందిం చింది. అక్కడి జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఒక విజ్ఞప్తిని పన్నీర్ వర్గం సమర్పిం చింది. పుదుచ్చేరిలో భద్రతా సమస్యలు తలెత్తకుండా రిసార్టులోని ఎమ్మెల్యేలు ఖాళీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరింది. 4 రోజుల క్రితం సీఎం పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్ సెల్వం వర్గాలు ఒక్కటైన నేపథ్యంలో పదవులు పంపకాలు జరిగాయి. శశికళను పార్టీ నుంచి బహిష్కరి స్తారని వార్తలు వస్తున్న నేపథ్యంలో దినకరన్ వర్గం ఎత్తులు మొదలెట్టింది. ఇందుకు బదులుగా పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరి స్తున్న 19 మంది దినకరన్ వర్గం ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని తమిళనాడు ప్రభుత్వ చీఫ్ విప్ ఎస్ రాజేంద్రన్ స్పీకర్ ధనపాల్‌కు విజ్ఞప్తి చేసారు. ఫిబ్రవరి 14న పళనిస్వామిని అన్నాడీఎంకే శాసనసభా పక్షనేతగా, సీఎంగా తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పీకర్‌కు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా, దినకరన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయాలని కోరారు. ప్రభుత్వానికి తాము మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు గవర్నర్‌కు చెప్పడం తెలిసిందే. వారి నిర్ణయాన్ని రాజేంద్రన్ పార్టీ వ్యతిరేక కార్యకలాపంగా పేర్కొన్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఆధారంగా వారిపై అనర్హతా వేటు వేయాలని కోరారు. చీఫ్ విప్ కోరినట్లు తిరుగుబాటు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హతా వేటు వేస్తే.. పళనిస్వామి ప్రభుత్వానికి ప్రమాదం తప్పినట్లే. 19 మందిపై వేటు వేస్తే, తమిళనాడు అసెంబ్లీలో మొత్తం ఎమ్మెల్యేలు 234 నుంచి 215కు తగ్గిపోతారు. అప్పుడు బలనిరూపణకు కావాల్సిన ఎమ్మెల్యేల సంఖ్య 108కి పడిపోతుంది.


భారత్‌లో జరభద్రం!

- తమ పర్యాటకులకు చైనా సలహా

బీజింగ్: సిక్కిం సరిహద్దులోని డొక్లాం వివాదం నేపథ్యంలో భారత్, చైనాల మధ్య గత రెండు నెలలుగా ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. అయితే, ఈ విషయంపై డ్రాగన్ తన ఓవర్ యాక్షన్‌ను ప్రదర్శించింది. భారత్లో నివసిస్తున్న చైనీయులు జాగ్రత్తగా ఉండాలని మరోసారి హెచ్చరించింది. ఈ మేరకు ఆ దేశ ప్రభుత్వం తాజాగా న్యూ ఢిల్లీలోని తన రాయబార కార్యాలయం నుంచి భద్రతా సలహాను జారీ చేసింది. వ్యక్తిగత భద్రతపై మరింత ఎక్కువగా దృష్టి పెట్టాలని సూచించింది. స్థానిక మతాచారాలు, సంప్రదాయాలకు గౌరవం ఇవ్వాలని పేర్కొంది. భద్రతాపరమైన పరిస్థితులపై ఎప్పటికప్పుడు బేరిజు వేసుకోవాలని పిలుపునిచ్చింది. డిసెంబర్ 31వ తేదీ వరకు ఈ భద్రతా సలహా వర్తిస్తుందని చెప్పింది. డొక్లామ్ ప్రతిష్టంభన మొదలైనప్పటి నుండి చైనా భద్రతా సలహాను జారీ చేయడం ఇది రెండోసారి. సాధారణంగా 'ప్రకృతి విపత్తులు, ట్రాఫిక్ ప్రమాదాలు, వ్యాధుల వ్యాప్తి తరచూ చోటు చేసుకుంటే' ఇటువంటి భద్రతా సలహాలను సంబంధిత దేశాలు ఆయా దేశ పౌరులకు భద్రతా సలహాలను అందజేస్తాయి. కానీ, డొక్లామ్ ప్రతిష్టంభన నేపథ్యంలో భారత్‌లోని చైనీయులు ఎదుర్కొంటున్న బెదిరింపులు, ముప్పుల గురించి భద్రతా సలహా జారీ చేయడం గమనార్హం. ఇంతకుముందు జులై 8వ తేదీన చైనా మొదటి అడ్వయిజరీ జారీ చేయగా, ఆ అడ్వైజయిరీ ఆగస్టు 7 వరకు వరకు పని చేస్తుందని ప్రకటించింది. అయితే, మొదటి దాని కంటే తాజాగా విడుదల చేసిన భద్రతా సలహా తీవ్రంగా ఉండటం చర్చనీయాంశమవుతుంది. వీసా ముగిసినా పలువురు చైనీయులు ఇంకా భారత్‌లోనే ఉంటున్నారని చైనా తన ప్రకటనలో పేర్కొంది. డొక్లామ్ అంశంలో చైనా దుందుడుకుతనాన్ని ప్రదర్శిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలువార్లు భారత్‌పైకి బెదిరింపులతో దాడి చేసేందుకు యత్నించింది. ఇటీవల సరిహద్దులో ఇరు దేశాల సైన్యాలు బాహాబాహీ చేసుకొని తలపడ్డాయి. ఆ ఘటనలో చైనా సైన్యమే ముందుగా కవ్వింపు చర్యలకు పాల్పడింది. భారత సైన్యంపై రాళ్ళ దాడి చేయడంతో ఇబ్బందికర వాతావరణం నెలకొంది. వాస్తవాధీనరేఖ వెంబడి చైనా రక్త శిబిరాలు కూడా ఏర్పాటు చేసింది. ప్రస్తుత పరిస్థితులు నిశితంగా గమనిస్తుంటే చైనా భారత్‌తో యుద్ధానికి ముందస్తు ప్రణాళిక రచిస్తున్నట్లు కనిపిస్తోందని దౌత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

గుజరాత్ మళ్లీ మనదే కావాలి

- కమలం వ్యూహాలు
- జైట్లీకి బాధ్యతలు
- మరో ఐదుగురికి చోటు
- కర్ణాటకలో పాగాకు కసరత్తు
- జవదేకర్, గోయల్‌కు బాధ్యతలు





న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: రానున్న గుజరాత్, హిమా చల్‌ప్రదేశ్, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలపై బీజేపీ దృష్టి సారించింది. మూడు రాష్ట్రాలకు సీనియర్ కేంద్ర మంత్రులను ఎన్నికల ఇన్‌చార్జిలుగా నియమించింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీకి గుజరాత్ , మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు కర్ణాటక, సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్ చంద్ గ్లెహట్‌కు హిమాచల్‌ప్రదేశ్ బాధ్యతలు అప్పగిం చింది. కేంద్ర మంత్రివర్గ విస్తరణ రేపో, మాపో అంటు న్న నేపథ్యంలో అమిత్‌షా ముందుగా పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిలను ప్రకటించారు. గుజరాత్ పై ప్రత్యేకంగా దృష్టిపెట్టిన అమిత్‌షా ఏకంగా ఐదుగురు కేంద్ర మంత్రులకు గుజరాత్ ఎన్నికల బాధ్యతలు అప్పగిం చారు. ఎన్నికల ఇన్‌చార్జి జైట్లీతో పాటు సహాయ ఇన్‌చార్జిలుగా నరేంద్రసింగ్ తోమర్, నిర్మలా సీతారా మన్, జితేంద్రసింగ్, పిపి.చౌదరిని నియమించారు. 2001 నుంచి గుజరాత్‌లో అప్రతిహతంగా గెలుస్తున్న బీజేపీ ఈసారి సైతం విజయబావుటా ఎగురవేసేందుకు అమిత్ షా ఈ ప్రణాళిక రచించారు. నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గుజరాత్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించడం అమిత్‌షాకు ప్రతిష్టా త్మకంగా మారింది. నరేంద్రమోడీ సీఎంగా ఉన్న సమయంలో హ్యాట్రిక్ విజయాలు సాధించారు. 2002, 2007, 2012 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో మోడీ పార్టీని అవలీలగా గెలుపు తీరాలకు చేర్చారు. ఈసారి జరగనున్న ఎన్నికల్లో తిరిగి కాషాయజెండా ను ఎగరేసేందుకు అమిత్‌షా, అరుణ్‌జైట్లీ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల బృందాన్ని రంగంలోకి దించారు. పదిహేను సంవత్సరాలుగా బీజేపీ అధికారంలో కొన సాగుతున్న నేపథ్యంలో తలెత్తే ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించేందుకు వ్యూహాత్మకంగా అడుగులేస్తు న్నారు. వచ్చే ఏడాది జనవరితో ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగుస్తుండడంతో బీజేపీ స్పీడ్ పెంచింది.

ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు!

కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతోంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఉండే ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకుని విజయాన్ని అందుకోవాలని బీజేపీ రెడీ అవుతోంది. కర్ణాటక ఎన్నికల ఇన్‌చార్జిగా ప్రకాశ్ జవదేకర్‌కు, సహాయ ఇన్‌చార్జిగా విద్యుత్ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు బాధ్యతలు అప్పగించింది. కర్ణాటక రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ముర ళీధర్‌రావుకు అదనంగా ఈ కేంద్రమంత్రులు ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తారు. బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎడ్యూరప్ప ఇటీవల పదివేల కిలోమీటర్ల యాత్ర జరిపి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. కర్ణాటక అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది మేతో ముగియ నుండడంతో, కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్ని కలు పూర్తి చేయాల్సి ఉంది. పర్వత రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగు తోంది. ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ పై సిబిఐ ఆదా యానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. అవి నీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనకు వయోభా రం కూడా సమస్యగా మారింది. ఈ పరిస్థితులు బీజేపీకి కలిసివస్తాయని అధిష్టానం భావిస్తోంది. ఇక్కడ పార్టీని విజయపథం లో నడిపే బాధ్యతను బీజేపీ, కేంద్రమంత్రి థావర్ చంద్ గ్లెహట్‌కు అప్పగిం చింది. ఈ ఏడాది నవంబరు లో హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ గడువు ముగుస్తోంది. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌కు ఒకే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే అంశాన్ని ఎన్నికల సంఘం పరిశీలిస్తోంది.

భూమ్మీద జంతువులిలా వచ్చాయి



మెల్‌బోర్న్: భూమ్మీద మనుషులెలా పుట్టారన్న ప్రశ్నకు సమాధానం లభించింది. వారు పుట్టడానికి ముందే జంతువులు పుట్టాయి. ఆ తరువాత మనుషులు పుట్టారు. అయితే.. ఈ జంతువుల జననానికి మూలం ఏమిటో ఇప్పటి వరకూ శాస్త్రజ్ఞులకు అంతుపట్టలేదు. తాజాగా సెంట్రల్ ఆస్ట్రేలియలో కొన్ని రకాల రాళ్ల రూపంలోని అవక్షేపాలను పరిశీలించగా, అవి 65 కోట్ల సంవత్సరాల నాటివని తేలింది. అందులో నాచు ఆనవాళ్లను శాస్త్రజ్ఞులు గమనించారు. అంతకు ముందు ఐదు కోట్ల సంవత్సరాల పాటు భూమి ఘనీభవించి ఉంది. ఆ తరువాత ఉష్ణోగ్రతలు పెరిగి మంచు కరిగి, రకరకాల పోషకాలు నదుల నుంచి సముద్రంలోకి ప్రవహించాయి. దీంతో సముద్రాల్లో పుట్టిన జీవం మరింత సంక్లిష్టంగా మారి భూమ్మీదకి వచ్చిందని పరిశోధకుల అంచనా. కావాల్సిన ఆహారం పుట్టిన తరువాతే జంతువులు పుట్టాయని ఆస్ట్రేలియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకుడు బ్రాక్స్ చెప్పారు. ఈయన బృందం కనుగొన్న అవక్షేప శిలలు భూమ్మీద మంచు కరగడం మొదలుపెట్టిన తొలినాళ్లలోనివి. దీంతో ఘనీభవించిన భూమి కరుగుతున్నప్పుడు పోషకాలు సముద్రాల్లోకి ప్రవహించి ఆహారం, ఆ తరువాత జంతువులు, మరింత తరువాత వానరాలు, మనుషులు పుట్టారని శాస్త్రజ్ఞులు అంచనాగా ఉంది.



సంపూర్ణ స్వేచ్ఛకాదు

• ధర్మాసనం తీర్పును స్వాగతిస్తున్నాం • కోర్టు పేర్కొన్న అంశాలకు కట్టుబడివుంటాం • ఆధార్ వివరాల భద్రతకు నిపుణుల కమిటీ వేశాం • కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ: వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనంటూ సుప్రీం ఇచ్చిన తీర్పుపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పందించారు. కోర్టు తీర్పును ప్రభుత్వం స్వాగతిస్తున్నట్లు చెప్పారు. వ్యక్తిగత గోప్యత అనేది సంపూర్ణమైన స్వేచ్ఛ కాదన్నారు. కోర్టు తీర్పుపై వివరణ ఇస్తూ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సుప్రీం తీర్పును ప్రభుత్వం స్వాగతిస్తుంది. గోప్యత అనేది ఎల్లప్పుడూ ప్రాథమిక హక్కే, కానీ సహేతుక పరిమితులకు లోబడి మాత్రమే. ఆధార్ బిల్లు ఆమోదం సమయంలో పార్లమెంట్‌లో ప్రభుత్వం ఇచ్చిన వివరణను కూడా ధర్మాసనం అంగీకరించింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని ఆధార్ చట్టం ముందుగానే తెలిపింది. అయితే అది సంపూర్ణమైన హక్కు కాదని అటార్నీ జనరల్ పేర్కొన్నారు. దానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. నామమాత్రపు చట్టంతో దేశ ప్రజల వివరాలను ప్రభుత్వం సేకరించాలని అనుకోలేదు. ఆధార్‌ను తప్పనిసరి చేసిన సమయంలో డేటా ప్రొటెక్షన్ కోసం నిపుణులతో కమిటీ ఏర్పాటుచేశాం. గత మూడేళ్లలో రూ. 57వేల కోట్ల నగదును మధ్యవర్తుల చేతికి వెళ్లకుండా చూడగలిగాం. ఆధార్ ప్రతిరోజు మూడు కోట్ల మంది వివరాలను నిర్ధారిస్తున్నది. ఇలాంటి ఓ సాంకేతిక అద్భుతాన్ని ప్రపంచం మొత్తం కొనియాడింది. ఇదిపూర్తిగా దేశీయ ప్రయోజనాలకు సంబంధించినది. ఇందుకు గర్వించాలి. సుప్రీం తీర్పులో పేర్కొన్న ప్రతి అంశానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది' అని రవిశంకర్ వివరించారు. ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన ఖండించారు. వెనుకాముందూ ఆలోచించకుండా ప్రతిపక్షాలు మాట్లాడుతున్నా యని ఎద్దేవాచేశారు. ఎమర్జెన్సీ రోజుల్లో కాంగ్రెస్‌కు వ్యక్తిగత స్వేచ్ఛ గుర్తుకురాలేదా? అంటూ ఎదురుదాడి చేశారు.

నియంతృత్వ పోకడలకు చెంపపెట్టు

• సుప్రీం తీర్పుపై కాంగ్రెస్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: సామాన్యుడి జీవితంపై హద్దుల్లేని ఆక్రమణ. వారి వ్యక్తిగత విషయాలపై నిఘాలతో నియంతృత్వ పోకడలను అవలంబిస్తున్న ప్రభుత్వానికి సర్వోన్నత ధర్మాసనం తీర్పు చెంపపెట్టు లాంటిదని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. నిఘా ద్వారా అణిచివేతకు పాల్పడుతున్న బీజేపీ ఐడియాలజీకి ఇది శరాఘాతమని రాహుల్ అన్నారు. ఈ తీర్పును కాంగ్రెస్ స్వాగతిస్తోందన్నారు. ఇది ప్రతిఒక్క భారతీయుడి విజయమన్నారు. హక్కుల విషయంలో న్యాయస్థానంలోనూ, పార్లమెంటులోనూ బీజేపీ, ఎన్డీయే ప్రభుత్వం ఒకవైపు, మిగిలిన ప్రతిపక్షాలన్నీ ఒకవైపు నిలిచాయని కాంగ్రెస్ అధినేత్రి సోనియా చెప్పారు. గోప్యత ప్రాథమిక హక్కు కాదని వాదిస్తూ వచ్చిన కేంద్ర ప్రభుత్వానికి తాజా పరిణామం శరాఘాతమని సీనియర్ అధికార ప్రతినిధి పి. చిదంబరం అన్నారు.

ఆధార్‌ను నిషేధించలేం



సుప్రీంకోర్టు తీర్పును ప్రగతిశీల తీర్పుగా మాజీ సీనియర్ న్యాయమూర్తులు అభివర్ణించారు. అయితే తీర్పు ప్రభావం ఆధార్ స్కీమ్‌పై ఎలా ఉంటుందన్న అంశాన్ని మాత్రం వాళ్లు ఇప్పుడు చెప్పలేమన్నారు. తీర్పును పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాత ఆధార్ భవిష్యత్తును అంచనా వేసే అవకాశం ఉంటుందని అన్నారు. పూర్వపు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులను కొట్టిపారేయడం సుప్రీంకోర్టు అనుసరిస్తున్న ఓ మంచి పద్ధతి అని మాజీ అటార్నీ జనరల్, సీనియర్ అడ్వకేట్ సోలీ సొరాబ్జీ తెలిపారు. ప్రైవసీపై సుప్రీం ఇచ్చిన తీర్పు ప్రగతిశీలమైందని, ఇది పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడుతుందని, ప్రైవసీ అనేది ప్రతి వ్యక్తిలో ఉన్న అంతర్గత అంశమని ఆయన అన్నారు. అయితే వ్యక్తిగత గోప్యతపై అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన పూర్తి తీర్పును అధ్యయనం చేసేంత వరకు ఆధార్‌ను బ్యాన్ చేయలేమన్న అంశాన్ని నిర్ధారించలేమన్నారు. ఆధార్ రాజ్యాంగ వ్యతిరేకమని, దాన్ని రద్దు చేయాలని గుడ్డిగా చెప్పలేమన్నారు.

వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కే





• సుప్రీంకోర్టు కీలక తీర్పు – 1954, 63 తీర్పులు కొట్టివేత • ఖేహర్ నేతృత్వంలోని తొమ్మిది మంది జడ్జీల ప్రకటన • డిజిటల్ యుగంలో డాటా భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి • 2015లో ఆధార్‌తో తెరపైకి వచ్చిన వివాదం • సర్వోన్నత ధర్మాసనం ముందుకు పలు పిటిషన్లు • జులై 18న రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు • ఆధార్ అనుసంధానంపై సందిగ్ధత!

న్యూఢిల్లీ: వ్యక్తిగత గోప్యత వ్యక్తుల ప్రాథమిక హక్కేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఈ మేరకు విచారణ చేపట్టిన తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం గురువారం ఏకగ్రీవంగా తీర్పు వెల్లడించింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని తేల్చింది. రాజ్యాంగంలోని పార్ట్-3 హామీ ఇచ్చిన స్వేచ్ఛాభాగంలోని ఆర్టికల్ 21కింద జీవితానికి, స్వేచ్ఛ హక్కుకు అంతర్భాగంగా గోప్యత హక్కు ఉందని పేర్కొంది. ఈ అంశంపై గతంలో (1954, 1963) ఇచ్చిన రెండు తీర్పులను న్యాయస్థానం కొట్టివేసింది. సమాచార గోప్యత అనేది గోప్యత హక్కు. ఇది బహిర్గతం కావడం మూలంగా వ్యక్తిగత సమాచారానికి దేశీయంగానే కాక, దేశం వెలుపల నుంచీ ముప్పు ఏర్పడవచ్చు. ప్రస్తుత పరిస్థితులు రాజ్యాంగ అర్థాన్ని స్తంభింపజేయ జాలవు. రాజ్యాంగం అమలైనప్పటి దృక్పథాన్ని మార్చలేవు. సాంకేతిక మార్పుల ఆందోళనలు ఏడు దశాబ్దాల కిందటివి కాదు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుదల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక భావనలు ఉల్లంఘనకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది' అని సుప్రీం వ్యాఖ్యానించింది. ఇప్పటికే ఫేస్‌బుక్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సామాజిక మాధ్యమాలు భారతీయుల డాటాపై పట్టుసాధిస్తున్నందున వ్యక్తిగత గోప్యత ఆందోళన కలిగిస్తోంది.తాజా తీర్పు కోట్లాది మంది ప్రజల జీవితాలపై బహుళ పరిణామాలను కలిగివుంది. ఆధార్ అనుసంధానంతో వ్యక్తిగత హక్కును ఉల్లంఘిస్తున్నారంటూ 2015లో సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఆధార్‌పై విచారించేందుకు ఏర్పాటు చేసిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, ఈ విషయంలో ముందుగా వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కా? కాదా? అన్న అంశంపై చర్చ జరగాలని తేల్చింది. ఈ విషయంపై చర్చించేందుకు జులై 18న తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో ఈ హక్కు ఉందా? లేదా? అనే దానిపై చర్చించాలని, వీటిపై స్పష్టత వచ్చాకే ఆధార్ పథకాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాల విచారణను చేపడుతామని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు అరవింద్ దాతర్, శ్యామ్ దివాన్, గోపాల్ సుబ్రమణ్యం, ఆనంద్ గ్రోవర్‌లు తమ వాదనలను లిఖితపూర్వకంగా కోర్టుకు సమర్పించారు. తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనంలో చీఫ్ జస్టిస్ ఖేహర్‌తో పాటు.. న్యాయమూర్తులు జాస్తి చలమేశ్వర్, ఎస్ఏ బాబ్డే, డీవై చంద్రచూడ్, ఎస్ అబ్దుల్ నజీర్, ఆర్‌కే అగర్వాల్, రోహింటన్ ఫాలీ నారీమన్, అభయ్ మనోహర్ సాప్రే, సంజయ్ కిషన్ కౌల్ ఉన్నారు.

ఆధార్ అనుసంధానం ప్రశ్నార్థకం?



ప్రతి అంశానికీ ఆధార్‌ను అనుసంధానం చేస్తున్న క్రమంలో తాజా తీర్పు చర్చనీయాంశంగా మారింది. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డులు, సిమ్ కార్డులకు ఆధార్ లింకుపై సందిగ్ధత ఏర్పడింది. గోప్యత ప్రాథమిక హక్కేనని పేర్కొన్న సుప్రీంకోర్టు, ఆధార్‌పై అభ్యంతరాలను ప్రస్తావించలేదు. కానీ ఆధార్ విషయంలోనే ఈ వ్యక్తిగత గోప్యత అంశం తెరపైకి వచ్చింది. ఆధార్ విచారణ సమయంలో వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు కాదని కేంద్రం వాదించింది. దీంతో అసలు కేసు మొదలైంది. ఆధార్ విధానం వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘిస్తోందంటూ 2015లో సుప్రీంకోర్టును పిటిషనర్లు ఆశ్రయించారు. తొలి పిటిషన్ మాత్రం 2012లో విశ్రాంత న్యాయమూర్తి కేఎస్ పుట్టస్వామి తదితరులు దాఖలు చేశారు. వీటిపై పలువార్లు విచారించిన అత్యున్నత న్యాయస్థానం ప్రజా బాహుళ్యంలో గోప్యత వివరాలు దుర్వినియోగమయ్యే అవకాశాలున్నాయని ఆగస్టు 2న పేర్కొంది. కానీ నేడు వెలురించిన తీర్పులో మాత్రం ఆధార్ గురించి ప్రస్తావించకపోవడం అయోమయానికి దారితీసింది. ఆధార్ వివరాలు వ్యక్తిగత గోప్యత కిందకే వస్తాయని పలువురు న్యాయవాదులు అభిప్రాయ పడుతున్నారు. ఆధార్ తప్పనిసరి చేయడం అప్రకటిత ఎమర్జెన్సీగా పరిగణించాల్సి ఉందన్నారు. కాగా, సందిగ్ధ పరిస్థితిపై స్పష్టత ఇచ్చేందుకు ఐదుగురు జడ్జిలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం గోప్యత అనే ప్రాథమిక హక్కును ఆధార్ కార్డు ఉల్లంఘిస్తుందా? లేదా? అన్నదానిపై తీర్పు చెప్పనుంది.

వాట్సాప్ కేసుపై ప్రభావం?

నెటిజన్ల గోప్యతకు సంబంధించిన వాట్సాప్ కేసులో ఈ తీర్పు ఏ మేరకు ప్రభావం చూపుతుందో ఇప్పుడే అంచనా వేయలేము. 2016 నాటి ప్రైవసీ పాలసీని వాట్సాప్ మార్చడంపై వివాదం నడుస్తోంది. తమ వినియోగ దారుల డాటాను మాతృసంస్థ ఫేస్‌బుక్‌తో పంచుకుంటామని 2017లో వాట్సాప్ ప్రకటించింది. కాగా, డాటా భద్రతకు సంబంధించిన చర్యలపై విధివిధానాలను రూపొందిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకు తెలిపింది. వాట్సాప్ ఖాతాదారుల వ్యక్తిగత సమాచార భద్రతను ఉల్లంఘించ జాలదని పేర్కొంది.

గతంలోనూ గోప్యతపై విచారణలు..



1954: వ్యక్తిగత గోప్యత వివాదం కావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ దీనిపై సుప్రీంకోర్టులో పలుమార్లు చర్చ జరిగింది. 1954లో ఎంపీ శర్మ కేసులో భాగంగా వ్యక్తిగత గోప్యతపై చర్చ జరిగింది. దాల్మియా జైన్ ఎయిర్‌వేస్ వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయని అప్పట్లో కేసు నమోదైంది. దీంతో దాల్మియా గ్రూపునకు చెందిన కొన్ని ప్రదేశాల్లో సోదాలు జరిపారు. దీంతో సోదాల్లో రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ ఎంపీ శర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే సోదాలు చేయడం అంటే.. తాత్కాలికంగా హక్కుల్లో జోక్యం చేసుకోవడమేనని, అయితే ఇది చట్టబద్ధంగా నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం జరిగితే తప్పులేదని కోర్టు అభిప్రాయపడింది. వ్యక్తిగత వివరాల గోప్యత ప్రాథమిక హక్కు కాదని, ఎనిమిది మందితో కూడిన ధర్మాసనం అప్పట్లో చెప్పింది.

1963: తొమ్మిదేళ్ల తర్వాత మరోసారి ఈ అంశం చర్చకు వచ్చింది. దోపిడీ కేసులో తగిన సాక్ష్యం లేదని యూపీకి చెందిన ఖారక్‌సింగ్‌ను విడుదల చేశారు. దీంతో యూపీ పోలీసులు అతడిపై నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో తన ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నారంటూ ఖారక్‌సింగ్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అయితే ఆ సమయంలో ఆరుగురు సభ్యులతో కూడిన ధర్మాసం ఖారక్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. రాజ్యాంగంలో ఎక్కడా వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా పేర్కొనలేదని స్పష్టం చేసింది.

ఆధార్ నేపథ్యం:

తాజాగా ఆధార్ అనుసంధానం చేయడంతో మరోసారి ఈ ప్రశ్న తలెత్తింది. అయితే గతంలో పరస్పర విరుద్ధ తీర్పులు వచ్చిన నేపథ్యంలో ఈ అంశాన్ని విస్తృతమైన రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయించాల్సిన అవసరం ఉందని గతంలో ముకుల్ రోహత్గీ కోర్టుకు నివేదించారు. దీంతో తొమ్మిది మంది న్యాయమూర్తులతో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. గతంలో ఇచ్చిన రెండు తీర్పులను కొట్టివేసింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనంటా తాజా తీర్పులో ఏకగ్రీవంగా తేల్చిచెప్పింది.

జులై 19 నుంచి ఆగస్టు 2 దాకా...



జులై 19: చీఫ్ జస్టిస్ ఖేహర్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఎదుట వ్యక్తిగత గోప్యత హక్కుపై తొలిసారిగా సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. జీవితం, స్వేచ్ఛ అనేవి ప్రాథమిక హక్కులేనని ముందుగానే రాజ్యాంగంలో పొందుపరిచారని తెలిపారు. ఇప్పుడు గోప్యత లేని స్వేచ్ఛను అనుభవంలో ఉంది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సంబంధించిన వరకు గోప్యత లేకుండా స్వేచ్ఛను వ్యక్తపరచవచ్చా? అని సుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. డెమొక్రాటిక్, రిపబ్లిక్ పదాలను ప్రస్తావిస్తూ, ఈ రెండూ కూడా జీవితహక్కు, స్వేచ్ఛలకు అంతర్లీన భావమని తెలిపారు. ఈ సందర్భంగా ఎమర్జన్సీ పరిస్థితులను ఉటంకించారు. కాగా, కేంద్రప్రభుత్వం మాత్రం, వ్యక్తిగత గోప్యత ఆమోదిత హక్కేనని, అంతమాత్రమాన అది పూర్తిహక్కు కాజాలదని ధర్మాసనానికి నివేదించింది. కేంద్రం అభిప్రాయంతో ఏకీభవించిన కపిల్ సిబల్, ప్రభుత్వం సేకరించిన వ్యక్తుల సమాచారం ఏజెన్సీలతో పంచుకోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సెల్ పిటిషనర్ శ్యామ్ దివాన్ గత తీర్పులను ప్రస్తావించారు. గోప్యత హక్కు గురించి రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొనలేదని, అలాంటప్పుడు, దీనిని ప్రాథమిక హక్కుగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. జస్టిస్ బీఎల్ శ్రీకృష్ణ సారథ్యంలోని కమిటీ డాటా భద్రత ప్రమాణాలు, సంబంధిత అంశాలపై ముసాయిదా బిల్లు రూపొందించనుందని, ఈ మేరకు కమిటీకి కేంద్రం బాధ్యతలు అప్పగించిందని ఆధార్ సంస్థ న్యాయస్థానానికి తెలిపింది.

జులై 20: గోప్యత హక్కు, గోప్యత పరిమితులను నిర్వచించడంలో రాజ్యాంగ ధర్మాసనం వివాదాస్పదమైంది. గోప్యత అనేది కచ్చితమైన హక్కు కాదంటూనే, దీనిని కచ్చితమైన హక్కుగా గుర్తిస్తామని పేర్కొంది. ముందుగా గోప్యతను నిర్వచించాల్సి ఉందని తెలిపింది. కాలమాన పరిస్థితులను బట్టి ప్రాథమిక హక్కులను ధర్మాసనం విస్తృత పరచాల్సి ఉందని వాదోపవాదాల్లో భాగంగా, అరవింద్ దాటర్, ఆనంద్ గ్రోవర్ సూచించారు. ఆర్టికల్ 21 ప్రకారం గోప్యత ప్రాథమిక హక్కుల్లో ప్రధానమైనదని వారు పేర్కొన్నారు. ఖరాక్ సింగ్ కేసులో సుప్రీం తీర్పును ఈ సందర్భంగా గ్రోవర్ గుర్తుచేశారు. కాగా, ఇంటర్నెట్ యుగంలో వ్యక్తిగత జీవిత గోప్యతపై దివాన్ ఆందోళన వ్యక్తంచేశారు.

జులై 27: ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, గోప్యత హక్కును సవాల్ చేయడానికి వీల్లేదని చెప్పారు. ప్రజాబాహుళ్యానికి సంబంధించిన ప్రతి అంశం రక్షితంగా ఉంటుందని తెలిపారు. ఆర్టికల్ 21లో అది అంతర్భాగమే తప్ప, ప్రత్యేక చట్టమేదీ లేదు. జనగణన, ఓటు నమోదు, పాస్‌పోర్టు డాటా పబ్లిక్ డొమైన్‌లో ఉంచడంపై ఆందోళన చెందాల్సిన పనిలేదు అని చెప్పడం ద్వారా కేంద్రం తన వాదనలను ముగించింది.

ఆగస్టు 2: సుమారు గంటపాటు అన్ని రకాల కౌన్సెల్స్ వాదనలు విన్న తర్వాత, రాజ్యాంగ ధర్మాసనం గోప్యత అంశంపై తీర్పును నిలిపివుంచింది. కాగా, రిజర్వు తీర్పును గురువారం బహిర్గతం చేసింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని స్పష్టం చేసింది.



గోప్యత వివాదంపై సుప్రీంలో ఉద్ధండులైన న్యాయవాదులు తమ తమ వాదనలు వినిపించారు. సీనియర్ లాయర్లలో అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, అడిషనల్ సొలిటర్ జనరల్ తుషార్ మెహతా, అరవింద్ డాటార్, కపిల్ సిబర్, గోపాల్ సుబ్రహ్మణ్యం, శ్యామ్ దివాన్, ఆనంద్ గోవర్, సీఏ సుందరం, రాకేశ్, ద్వివేది తదితరులు ఉన్నారు.

9 మంది జడ్జీలు వీరే..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కేనని తొమ్మిది మందితో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా సంచలన తీర్పు వెల్లడించింది. వ్యక్తిగత గోప్యత అనేది వ్యక్తి జీవితానికి సంబంధించిన అంతర్గత వ్యవహారమని స్పష్టం చేసింది. వ్యక్తులకు వారిపై పూర్తి హక్కులు ఉండవంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో తాజా తీర్పు అందుకు పూర్తిభిన్నంగా ఉన్నది. ఈ తీర్పును వెలువరించిన రాజ్యాంగ ధర్మాసనంలోని తొమ్మిది మంది జడ్జీల గురించి క్లుప్తంగా..

జగ్దీశ్ సింగ్ ఖేహర్



2011 నుంచి సుప్రీం న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న జస్టిస్ జగ్దీశ్ సింగ్ ఖేహర్ సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా ఎంపికైన తొలి సిక్కు జడ్జి. ఇటీవల ముమ్మారు తలాఖ్‌ను విచారించిన రాజ్యాంగ ధర్మాసనంలోనూ ఖేహర్ సభ్యుడిగా ఉన్నారు.

జాస్తి చలమేశ్వర్




64 ఏళ్ల సీనియర్ న్యాయమూర్తి గతంలో కేరళ, గువాహటి హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తమిళనాడు జల్లికట్టు ఆందోళన నేపథ్యంలో సుప్రీం తీర్పు ఉద్దేశాన్ని చాటిచెప్పారు. జంతువుల పట్ల హింసా త్మక చర్యలను నివారించడమే న్యాయస్థానం లక్ష్యమని వివరించారు.

డీవై చంద్రచూడ్



57 ఏళ్ల ధనుంజయ యశ్వంత్ చంద్రచూడ్ అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు. కొద్ది సంవత్సరాల తర్వాత సుప్రీం ప్రధాన న్యాయమూర్తి కాదగిన వారిలో చంద్రచూడ్ ఒకరు. ఈయన తండ్రి వైవీ చంద్రచూడ్ సుదీర్ఘకాలం సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఘనత సాధించారు. చంద్రచూడ్ సీజే అయితే, సుప్రీం చరిత్రలో తొలిసారి తండ్రీకొడుకులు అత్యున్నత పదవిని అలకరించిన వారవుతారు.

ఆర్‌కే అగర్వాల్



64 ఏళ్ల రాజేశ్ కుమార్ 17 ఫిబ్రవరి 2014లో సుప్రీం జడ్జీగా నియమితులయ్యారు. అంతకు మునుపు ఆయన మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు.

ఏఎం సాప్రె



అభయ్ మనోహ ర్ సాప్రె మణిపూర్ హై కోర్టు తొలి ప్రధాన న్యా యమూర్తి. ప్రస్తుతం సుప్రీంలో సిట్టింగ్ జడ్డిగా ఉన్నారు. విక లాంగులకు అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచాలని తీర్పునిస్తూ, ఈ మేరకు ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేశారు.

ఎస్‌కే కౌల్



సుప్రీం న్యాయమూర్తిగా ఎంపిక కాకముందు సంజయ్ కిషన్ కౌల్ మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. పంజాబ్, హర్యానా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. 2008లో ఢిల్లీ హైకోర్టు జడ్జీగా ఉన్న సమయంలో ఎంఎఫ్ హుస్సేన్‌కు వ్యతిరేకంగా మోపబడిన అభియోగాలను కొట్టివేశారు.

రోహింగ్టన్ నారిమన్




1993లో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది హోదాను నారిమన్ పొందారు. నాటి చీఫ్ జస్టిస్ వెంకటాచలయ్య ఈయనకు సీనియర్ గుర్తింపును ఇచ్చారు. అప్పటికి అతని వయసు 37 సంవత్సరాలు. ఈ క్రమంలో అప్పటిదాకా ఉన్న 45 ఏళ్ల కనీస వయోపరిమితిని సడలిస్తూ సీజేఐ సవరణలు తీసుకువచ్చారు. 2011లో నారిమన్ సొలిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. అయితే కొద్ది కాలంలోనే (18 నెలలు) ఆయన రాజీనామా చేశారు. నాటి న్యాయశాఖ మంత్రి అశ్వనికుమార్‌తో విభేదాల కారణంగానే సొలిటర్ జనరల్ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది.

ఎస్ ఏ నజీర్



59 ఏళ్ల అబ్దుల్ నజీర్ నేరుగా సుప్రీం జడ్డి అయిన వారిలో మూడోవ్యక్తి. గతంలో ఏ హైకోర్టుకూ చీఫ్ జస్టిస్‌గా పనిచేయకుండానే సుప్రీం న్యాయమూర్తిగా నియమితు లయ్యారు. త్రిపుల్ తలాఖ్ విచారణ బెంచ్‌లో నజీర్ ఏకైక ముస్లిం న్యాయమూర్తి.

ఎస్‌ఏ బాబ్డే



మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన శరద్ అరవింద్ బాబ్డే ప్రస్తుత రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్నారు. ఆధార్ లేనంత మాత్రాన ప్రభుత్వ ప్రాథమిక సేవలు, సబ్సిడీలకు ఏ ఒక్క పౌరుడు దూరం కాకూడదని తీర్పు చెప్పిన త్రిసభ్య బెంచ్‌లో జాస్తి చలమేశ్వర్, చొక్కలింగం నాగప్పన్‌తోపాటు బాబ్డే కూడా ఉన్నారు. 25 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు 26 ఏళ్ల మహిళకు అనుమతి ఇచ్చిన బెంచ్‌లోనూ బాబ్డే ఉన్నారు.


సాన్నిహిత్యం నటించడం వరకే



కాజల్

వృత్తిగతం, వ్యక్తిగతం దేని దారి దానిదే అంటోంది అందాల జాబిలి కాజల్ అగర్వాల్. ఎక్కడి విషయాలు అక్కడే మర్చిపోతానని చెబుతోంది. నట ప్రయాణం, జీవితం మధ్య స్పష్టమైన రేఖ గీసుకుంటానని తెలిపింది. పనిలో భాగంగా కలిసి ఉండే నటులతో పరిచయాన్ని మనసు దాకా తీసుకెళ్లనని కాజల్ చెప్పింది. ఆకర్షణ ప్రమాదంలో పడకుండా జాగ్రత్త తీసుకుంటానంటోంది. అలా ఉండటం వల్లే ఇన్నాళ్లు ప్రశాంతంగా సినిమాలు చేయగల్గుతున్నానంది. వృత్తి, ఫలితంగా ఏర్పడే బంధాలపై కాజల్ స్పందించింది. ఆమె మాట్లాడుతూ...'మేము ఉన్నది గ్లామర్ ప్రపంచంలో అనే విషయం ఎప్పుడూ గుర్తుంటుంది. ఇక్కడి ఆకర్షణ పట్ల అప్రమత్తతో వ్యవహరిస్తాను. ఎంతోమంది నటులతో కలిసి పనిచేస్తాం. పాటల్లో డాన్సులు చేసి, రొమాంటిక్ సన్నివేశాల్లో సన్నిహితంగా ఉంటాం. ఇదంతా నటనలో భాగంగానే తీసుకుంటాను. ఎంత సన్నిహితంగా నటించినా...దాని ప్రభావానికి లోను కాను. నాతో నటించిన వాళ్లంతా స్నేహితులే. సినిమాలు చేసినా చేయకున్నా...నన్ను కలుస్తూ, మాట్లాడుతూ ఉంటారు. సెట్‌లో నుంచి బయటకు రాగానే అంతా మర్చిపోయినట్లే. మళ్లీ రేపటి షూటింగ్ వైపు ఆలోచన మళ్లుతుంది.' అని చెప్పింది. ఇటీవలే 'నేనే రాజు నేనే మంత్రి' సినిమాతో తెలుగులో విజయాన్నందుకున్న కాజల్... తమిళం, హిందీలో పలు చిత్రాలతో తీరిక లేకుండా ఉంది.

పైసా వసూల్ సెన్సార్ పూర్తి...!



బాలకృష్ణ

బాలకృష్ణ నటించిన తాజా చిత్రం 'పైసా వసూల్' సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. యూఏ ధృవీకరణతో విడుదలకు సిద్ధమవుతోంది. భవ్య క్రియేషన్స్ నిర్మాణంలో దర్శకుడు పూరీ జగన్నాథ్ ఈ చిత్రాన్ని రూపొందించారు. శ్రీయా, ముస్కాన్, కైరా దత్, నాయికలుగా నటించారు. సెన్సార్ పూర్తవడంతో సెప్టెంబర్ 1న 'పైసా వసూల్' ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు అన్ని సన్నాహాలు పూర్తయినట్లే. సెన్సార్ పూర్తయిన సందర్భంగా నిర్మాత వి ఆనంద్ ప్రసాద్ మాట్లాడుతూ...'సినిమా బాగా వచ్చింది. సెన్సార్ బోర్డు యూఏ ధృవీకరణతో ప్రదర్శనకు అనుమతి ఇచ్చింది. బాలకృష్ణ అభిమానులు కోరుకునే అంశాలన్నీ చిత్రంలో ఉంటాయి. బాలకృష్ణ చాలా ఉత్సాహంగా నటించారు. రేపు థియేటర్లో ఆయన నటన అందరినీ ఆకట్టుకుంటుంది. డూప్ లేకుండా పోరాట సన్నివేశాల్లో నటించారు. ఇవి ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. దర్శకుడు పూరీ బాలకృష్ణను కొత్తగా చూపించారు. అనూప్ పాటలకు మంచి స్పందన వస్తోంది. 'పైసా వసూల్' తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం.' అన్నారు. ఈ చిత్రంలో అలీ, విక్రమ్ జిత్, పవిత్రా లోకేష్, పృథ్వీ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.

భవిష్యత్తు చెప్పే ప్రాజెక్ట్ జెడ్



లావణ్య త్రిపాఠి

సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠీ జంటగా నటించిన చిత్రం 'ప్రాజెక్ట్ జెడ్'. జాకీ శ్రాఫ్ మరో ముఖ్య పాత్రలో నటించారు.ఈ సినిమాను దర్శకుడు సివి కుమార్ రూపొందించారు. ఎస్‌కే బషీద్, కరీమున్నీసా నిర్మాతలు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'ప్రాజెక్ట్ జెడ్' సెప్టెంబర్ రెండో వారంలో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత ఎస్‌కే బషీద్ మాట్లాడుతూ...'మా సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. యూఏ ధృవీకరణ పొందింది. సినిమా బాగా వచ్చింది. సందీప్ కిషన్ భిన్నమైన పాత్రలో కనిపిస్తారు. సందీప్ కెరీర్‌లో పెద్ద హిట్‌గా నిలుస్తుందని ఆశిస్తున్నాం. రాబోయే పది సంవత్సరాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలిపేదే ఈ చిత్ర కథ. త్వరలో ఆడియో విడుదల చేసి...సెప్టెంబర్ రెండో వారంలో సినిమాను తెరపైకి తీసుకొస్తాం. మా బ్యానర్‌లో మరో రెండు కొత్త చిత్రాలు రూపకల్పనకు సన్నాహాలు చేస్తున్నాం.' అన్నారు.

నా పేరు ఆనంద్.. నాకో ఓసిడి ఉంది



శర్వానంద్, మెహరీన్

నా పేరు ఆనంద్.. నాకో ఓసిడి ఉంది. ఓ సిడి అంటే బిటెక్, ఎమ్‌టెక్ లాంటి డిగ్రీలు కాదు డిజార్డర్. ఈ లక్షణాలు అతి శుభ్రం విపరీతమైన నీట్‌నెస్... అంటూ శర్వానంద్ వాయిస్ ఓవర్‌తో మహానుభావుడు టీజర్ విడుదలైంది. శర్వానంద్, మెహరిన్ జంటగా మారుతి దర్శకత్వంలో యు.వి. క్రియేషన్స్ నిర్మిస్తున్న చిత్రమిది. వంశీ, ప్రమోద్ నిర్మాతలు. ఇటలీ, ఆస్ట్రియా, క్రోయోషియో వంటి విదేశాలతో పాటుగా పొల్లాచ్చి, హైదరాబాద్‌లో షూటింగ్ జరిపారు. మహానుభావుడు విజయదశమికి విడుదలవుతుంది.

నిర్మాతలు మాట్లాడుతూ యువీ క్రియేషన్స్‌లో శర్వానంద్ నటిస్తున్న మూడవ చిత్రమిది.కామెడీని పండించగల దర్శకుడు మారుతి. వీరికాంబినేషన్‌లో ఈ సినిమా వస్తోంది. పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. నేటి నుండి డబ్బింగ్ మొదలైంది అన్నారు.

దర్శకుడు మారుతి మాట్లాడుతూ భలేభలే మగాడివోయ్ తర్వాత నాకు బాగా నచ్చిన క్యారక్టరైజేషన్‌తో చేస్తున్న చిత్రం మహానుభావుడు. సినిమాలో ఫుల్ కామెడీ ఉంటుంది. థమన్ మంచి బాణీలు అందించాడు అని చెప్పారు.

శర్వానంద్, మెహరిన్, వెన్నెల కిషోర్, నాజర్, హిమజ, వేణు, మధుమణి, రాగిణి, రజిత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం నిజార్ షఫి, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మారుతి.

వినూత్న ప్రేమ కథతో

తొంగి తొంగి చూడమాకు చందమామ



దిలీప్, శ్రావణి, రాజ్ బాలా

దిలీప్, శ్రావణి, రాజ్ బాలా, అపర్న, బేబీ అక్షర, ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తొంగి తొంగి చూడమాకు చందమామ'. హరి వల్లభ ఆర్ట్ పతాకంపై ఏఎం రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురు రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్టు సమర్పకులుగా వ్యవహరిస్తోంది. ఓ వినూత్న ప్రేమ కథతో దర్శకుడు ఆనంద్ కానుమోలు 'తొంగి తొంగి చూడమాకు చందమామ' సినిమాను రూపొందిస్తున్నారు. బస్ స్టాప్ సాయి, జబర్దస్త్ మహేష్, అప్పారావు, జెమినీ సురేష్ తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ప్రేమను వ్యక్తీకరించడంతో అన్ని ప్రేమ కథలు ప్రారంభమవుతాయి. అయితే ఈ సినిమాలో ప్రేమను తెలపడమే చివరి అంశం. నాయకా నాయికలు తమ ప్రేమను వ్యక్తీకరించుకోవడం చిత్ర ముగింపు. తొలి షెడ్యూల్ పూర్తయింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్ చిత్రీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు ఆనంద్ కానుమోలు చిత్ర ప్రోగ్రెస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ...'ఒకకాలనీలో జరిగే ప్రేమ కథ ఇది. ప్రేమ కథా చిత్రాల్లో ఓ వినూత్న ప్రయత్నం చేస్తున్నాం. తమ మధ్య ఉన్నది ఎలాంటి బంధమో తెలియని జంట...చివరివరకు ఒకరికి ఒకరు ఆ అనుభూతిని చెప్పుకోరు. తమ మధ్య ఉన్నది ప్రేమ అనే విషయం చివర్లో తెలుసుకుంటారు. ఈ లోగా వాళ్లకు అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. ఈ జంట తమ ప్రేమను పరస్పరం తెలుపుకోవడంతో కథ ముగుస్తుంది. క్లైమాక్స్ లో ప్రేమను చెప్పుకోవడం చిత్రానికి కొత్తదనాన్ని ఇస్తుందని నమ్ముతున్నాం. ప్రేమ అంశాలతో పాటు జబర్దస్త్ నటులు మంచి వినోదాన్ని అందిస్తారు. బొబ్బిలి టీపీ కళాశాలలో తొలి షెడ్యూల్ చిత్రీకరణ జరిపాం. సెప్టెంబర్ తొలి వారం నుంచి హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి డిసెంబర్ చివరి వారంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం.' అన్నారు.

ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - శ్రీనివాస్ విన్నకోట, సంగీతం - హరి గౌర, మాటలు - తిరుమల నాగ్, పాటలు - బాలాజీ, ఆర్ట్ - రమేష్, నిర్మాత - ఏఎం రెడ్డి, కథ స్క్రీన్ ప్లే, దర్శకత్వం - ఆనంద్ కానుమోలు.

భరత్ మళ్ళీ ప్రేమిస్తే

ప్రేమిస్తే ఫేమ్ భరత్, రుహాని శర్మ, అంగనా రాయ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం మళ్ళీ ప్రేమిస్తే. రామా రీల్స్ పతాకంపై జాన్ సుధీర్ పూదోట నిర్మాతగా రూపొందుతోంది. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. వచ్చే నెలలో ఈ సినిమాను విడుదలకు చేయడానికి నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు.

ప్రేమిస్తే తర్వాత భరత్ నటించిన ప్రేమకథా చిత్రమిది. తనను ప్రేమించిన అమ్మాయి మోసం చేస్తే తను పడిన మానసిక సంఘర్షణని ఎంతో అద్భుతంగా దర్శకుడు రవి భార్గవన్ చూపించారు. విజయ్ కురకాల సంగీత దర్శకత్వంలో ఐదు పాటలు చిత్రీకరణ పరంగా ఆకట్టుకుంటాయి. ప్రేమిస్తే చిత్రంలాగా మళ్ళీ ప్రేమిస్తే ఘనవిజయం సాధిస్తుందని నిర్మాత అన్నారు.

భరత్, రుహాని శర్మ, అంగనా రాయ్, కాశీ విశ్వనాథ్, సురేఖావాణి, సన, కోటేశ్వరరావు, త్రిశూల్, శివరాం తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం ముజీజ్ మాలిక్, సహ నిర్మాత కిరణ్ తనమాల, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం రవి భార్గవన్.



రుహాని శర్మ, భరత్,అంగనా రాయ్

ఆంధ్రప్రభ
క్రీడాప్రభ
శుక్రవారం 25 ఆగస్టు 2017 | హైదరాబాద్ | 12



శరీరం... చెక్కిన శిల్పంలా..

కాండీ: ఫిట్‌నెస్ అంటే విపరీతంగా ఇష్టపడే టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి.. సిక్స్ ప్యాక్‌పై దృష్టిపెట్టాడు. తన శరీరాన్ని చెక్కిన శిల్పంలా మార్చాలన్నది విరాట్ ఆశ. అందుకే జిమ్‌లో విపరీతంగా కసరత్తులు చేస్తున్నాడు. ఆ ఫొటోలు ఇపుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో విరాట్ ఫిట్‌నెస్‌ను గణనీయంగా పెంచాడు. రెండో వన్డేకు ముందు మైదానంలో జట్టు కసరత్తులు చేసే సందర్భంలో సహచరులకు తన శరీరాకృతిని ప్రదర్శిస్తున్నప్పుడు ఫొటోగ్రాఫర్లు క్లిక్‌మనిపించారు. గత రెండేళ్లుగా తాను కళ్లు చెదిరే ఫామ్‌తో ఉండడానికి ఫిట్‌నెసే కారణమని కూడా విరాట్ అంటున్నాడు.


"తక్కువ తినొద్దు. కానీ ఇంటిలో వండిన వంటనే తినండి. అదే ఆరోగ్యానికి మంచిది" అని కూడా ఉద్బోదిస్తున్నాడు. తనలో స్ఫూర్తిని నింపి, తాను ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడానికి దోహదపడింది మాజీ కోచ్ డంకన్ ఫెర్గూసన్ అని విరాట్ వెల్లడించాడు. ఫెర్గూసన్ సలహాపై ఆహారపు టలవాట్లను మార్చుకున్న విరాట్.. గత కొన్నేళ్లలో బరువు బాగా తగ్గాడు.

ధోని, భువి గెలిపించారు

- విఫలమైన మిడిలార్డర్
- దనంజయకు 6 వికెట్లు
- అయినా లంకకు తప్పని ఓటమి

లంక బ్యాట్స్‌మెన్ తొలి వన్డే కంటే కాస్త మెరుగ్గా ఆడారు... 50 ఓవర్లూ బ్యాటింగ్ చేశారు. గత మ్యాచ్ కంటే మెరుగైన స్కోరూ సాధించారు. వికెట్ ఏకపక్షంగా లేదు. భారత్ ఇన్నింగ్స్ ఎప్పటిలాగే దూకుడుగా ఆరంభమైంది. కానీ ఇంతలోనే షాక్. స్పిన్నర్ దనంజయ మాయాజాలానికి 131 పరుగులకే భారత్ 7 వికెట్లు చేజార్చుకుంది. మిడిలార్డర్ పూర్తిగా విఫలమైంది. రెండో ఇన్నింగ్స్‌కు ముందు వర్షం రావడంతో సవరించిన లక్ష్యం ప్రకారం గెలవాలంటే భారత్.. తక్కిన 3 వికెట్లు 100 పరుగులు చేయాలి. లంకలో ఆశలు చిగురించాయి. గెలుపుపై ధీమా ఏర్పడింది. కానీ అనూహ్యంగా ధోనీ, తొలి అర్థసెంచరీ సాధించిన భువనేశ్వర్ వారి ఆశలపై నీళ్లు చల్లారు. క్రీజులో పాతుకుపోయారు. అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు. వీరి విజృంభనలో భారత్ 44.2 ఓవర్లలో 7 వికెట్లకు 231 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లో 99వ స్టంపింగ్‌తో ప్రపంచ రికార్డును సమంచేసిన ధోని.. ప్రపంచకప్ పరీక్ష కూడా పాసయ్యాడు. ధోని, భువనేశ్వర్ 8వ వికెట్‌కు 100 పరుగులు జోడించడంతో భారత్ రెండో వన్డేలో 3 వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా 8 వికెట్లు లంక 236 పరుగులు సాధించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా దనంజయ ఎంపికయ్యాడు. మూడో వన్డే 27న జరుగుతుంది.





పల్లెకెలె: భారత్ ఇన్నింగ్స్ ఎప్పటి మాదిరిగానే సుడిగాలిలా ఆరంభమైంది. రోహిత్ (54, 45 బంతుల్లో, 5 ఫోర్లు, 3 సిక్స్), ధావన్ (49, 50 బంతుల్లో, 6 ఫోర్లు, 1 సిక్స్) ఒకరిని మించి ఒకరు చెలరేగిపోయారు. లంక బౌలింగ్‌ను చీల్చి చెండాడారు. వీరి జోరులో 15 ఓవర్లలోనే భారత్ 100 పరుగులు పూర్తి చేసుకుంది. 15.3వ ఓవర్లో ఒక్కసారిగా భారత బ్యాటింగ్‌లో కుదుపు. దనంజయ (6-54) తొలి దెబ్బ తీశాడు. రోహిత్‌ను ఔట్ చేశాడు. అప్పటికి స్కోరు 109-1. మరో నాలుగు పరుగులకే ధావన్ కూడా వెనుదిరిగాడు. తర్వాత వన్‌డౌన్‌లో వచ్చిన రాహుల్, జాదవ్, కోహ్లి, పాండ్య.. దనంజయ విజృంభణలో వెంటవెంటనే వెనుదిరిగారు. అపుడే వెటరన్ ధోని, బౌలర్ భువనేశ్వర్ ఆపద్బాంధవుల్లా జట్టును ఆదుకున్నారు. తడబాటుకు గురికాకుండా జట్టుకు విజయం కట్టబెట్టారు. ధోని సాయంతో భువి వన్డేల్లో తొలి అర్ధశతకం సాధించాడు.

కాస్త కోలుకున్న లంక: టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన లంక కాస్త గాడిన పడినట్లు కనిపించింది. డిక్వెల (31, 24 బంతుల్లో, 3 ఫోర్లు, 2 సిక్స్) దూకుడుగా ఆడాడు. ఒకటి రెండు ఓవర్లు కుదురుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చిన ఓపెనర్లు భువనేశ్వర్ వేసిన మూడో ఓవర్ నుంచి దూకుడు పెంచారు. రెండో బంతికి డిక్వెల బౌండరీ సాధించగా.. చివరి బంతికి గుణతిలక (19, 37 బంతుల్లో, 2 ఫోర్లు) ఫోర్ కొట్టాడు. ఈ ఓవర్లో వీరు 11 పరుగులు రాబట్టారు. తర్వాత ఓవర్‌కు డిక్వెల మరింత రెచ్చిపోయి ఓ ఫోర్, సిక్స్ సాధించాడు. వీరిద్దరు అడపాదడపా బౌండరీలు సాధించడంతో లంక 7 ఓవర్లు ముగిసేసరికి 40 పరుగుల స్కోరు చేసింది. ఓపెనర్లు కుదురుకున్నారు అనుకునే లోగానే తదుపరి ఓవర్లో బుమ్రా లంకను తొలి దెబ్బ తీశాడు. అతను వేసిన నాలుగో బంతిని ఆడబోయి డిక్వెల షార్ట్ మిడ్‌వికెట్‌లో ఉన్న ధావన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికి లంక స్కోరు 41-1 తర్వాత క్రీజులోకి వచ్చిన కుశాల్.. క్రీజులో కుదురుకోవడానికి సమయం తీసుకోగా.. గుణతిలక చెత్త బంతుల్ని బౌండరీకి తరలించే పనిలో పడ్డాడు. 11వ ఓవర్లో విరాట్ బౌలింగ్ మార్పు చేశాడు. లెగ్‌స్పిన్నర్ చచల్, పాండ్యలను బౌలింగ్‌కు దించాడు. 15వ ఓవర్ మొదటి బంతికే చచల్.. గుణతిలకను పెవిలియన్ దారిపట్టించాడు. గుణతిలక ఫ్లైటెడ్ డెలివరీని ఆడబోయి ధోని స్టంప్ చేయడంతో ఔటయ్యాడు. మొదటి ప్రయత్నంలో ధోని దాదాపు స్టంప్ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. ఐతే గుణతిలక మరీ ముందుకు పోవడంతో రెండో ప్రయత్నంలో ధోని పొరపాటుకు తావివ్వలేదు. వన్డేల్లో ధోనీకిది 99వ స్టంపింగ్. దీంతో సంగక్కర ప్రపంచ రికార్డును సమం చేశాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తరంగ (9) పేలవ ఫామ్ నుంచి బయటపడకపోవడంతో తక్కువ స్కోరుకే మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. పాండ్య వేసిన ఓ సాదీసీదా బంతికే అతను రెండో స్లిప్‌లోని కోహ్లికి క్యాచ్ ఇచ్చాడు. అప్పటికి లంక స్కోరు 81-3. మాథ్యూస్ (20, 41 బంతుల్లో, 2 ఫోర్లు)తో కలిసి 18 పరుగులు జోడించిన కుశాల్ (19, 48 బంతుల్లో, 2 ఫోర్లు) చచల్ బౌలింగ్ ఎల్బీగా ఔటై వెనుదిరిగాడు.

సిరివర్ధన అర్ధసెంచరీ: కుశాల్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన సిరివర్ధన (58, 58 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్) ఓ వైపు కుదురుకొని ఆడుతూ 22 పరుగులు జోడించగానే మాథ్యూస్ కూడా స్పిన్నర్ అక్షర్ బౌలింగ్‌లో ఎల్బీగా పెవిలియన్ దారిపట్టాడు. దీంతో 28 ఓవర్లలో 121 పరుగులకే లంక సగం వికెట్లు కోల్పోయింది. అనంతరం ఆల్‌రౌండర్ కపుగెదెర (40, 61 బంతుల్లో, 2 ఫోర్లు)... సిరివర్ధనతో జత కలిసి ఇన్నింగ్స్‌ను సరిదిద్దేందుకు ప్రయత్నించాడు. లంక బ్యాట్స్‌మెన్‌లో అర్ధసెంచరీ సాధించిన సిరివర్ధన ఒక్కడే సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. మూడు బౌండరీలు సాధించిన అతను బంతికో పరుగు చొప్పున రాబట్టాడు. కపుగెదెరతో కలిసి ఆరో వికెట్‌కు 91 పరుగులు జోడించిన తర్వాత సిరివర్ధన 45వ ఓవర్లో వెనుదిరిగాడు. బుమ్రా పదునైన బంతితో సిరివర్ధన, కపుగెదెర జోడీని విడదీశాడు. అప్పటికి లంక స్కోరు 212-6. తర్వాత వెంటవెంటనే కపుగెదెర, దనంజయ ఔట్ కావడంతో చివరి ఐదు ఓవర్లలో లంక 18 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్లలో బుమ్రా (4-43) నాలుగు, చచల్ (2-43) రెండు వికెట్లు తీశారు. పాండ్య, అక్షర్ చెరో వికెట్ తీశారు.

స్కోరు బోర్డు

శ్రీలంక ఇన్నింగ్స్: డిక్వెల (సి) ధావన్ (బి) బుమ్రా 31, గుణతిలక (స్టంప్డ్) ధోని (బి) చచల్ 19, కుశాల్ మెండిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చచల్ 19, తరంగ (సి) కోహ్లి (బి) పాండ్య 9, మాథ్యూస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అక్షర్ 20, సిరివర్ధన (సి) రోహిత్ (బి) బుమ్రా 58, కపుగెదెర (బి) బుమ్రా 40, ధనంజయ (సి) అక్షర్ (బి) బుమ్రా 9, చమీర నాటౌట్ 6, ఫెర్నాండో నాటౌట్ 3, **ఎక్స్‌ట్రాలు 22, మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 236**

వికెట్ల పతనం: 1-41 (డిక్వెల), 2-70 (గుణతిలక), 3-81 (తరంగ), 4-99 (కుశాల్), 5-121 (మాథ్యూస్), 6-212 (సిరివర్ధన), 7-221 (కపుగెదెర), 8-230 (దనంజయ).

బౌలింగ్: భువనేశ్వర్ 10-0-53-0, బుమ్రా 10-2-43-4, చచల్ 10-1-43-2, పాండ్య 5.2-0-24-1, అక్షర్ 10-0-30-1, జాదవ్ 4.4-0-32-0

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) దనంజయ 54, దావన్ (సి) మాథ్యూస్ (బి) సిరివర్ధన 49, రాహుల్ (బి) దనంజయ 4, జాదవ్ (బి) 1, కోహ్లి (బి) దనంజయ 4, ధోని నాటౌట్ 45, పాండ్య (స్టంప్డ్) (బి) దనంజయ 0, అక్షర్ (ఎల్బీ) (బి) దనంజయ 6, భువనేశ్వర్ నాటౌట్ 53, ఎక్స్‌ట్రాలు 15, **మొత్తం (44.2 ఓవర్లలో 7 వికెట్లకు) 231**

వికెట్ల పతనం: 1-109 (రోహిత్), 2-113 (ధావన్) 3-114 (జాదవ్), 4-118 (కోహ్లి), 5-119 (రాహుల్), 6-121 (పాండ్య), 7-131 (అక్షర్)

బౌలింగ్: మలింగ 8-0-49-0, ఫెర్నాండో 6.2-0-32-0, మాథ్యూస్ 3-0-11-0, చమీర 10-0-45-0, దనంజయ 10-0-54-6, సిరివర్ధన 10-0-39-1

తెలుగు తేజం పీవీ సింధు ప్రి క్వార్టర్స్‌లో అద్వితీయంగా పోరాడి గెలిచింది. తొలి గేమ్ ఓడినా ఆమె వెరవకుండా తక్కిన రెండు సెట్లను పోరాడి గెలుచుకుంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్ ఫైనల్లో సింధు 19-21, 23-21, 21-17 తేడాతో హాంకాంగ్ షట్లర్ చెంగ్ నగన్ యిపై స్ఫూర్తిదాయక విజయం సాధించింది.

మలి అడుగు అదిరింది

- పోరాడి గెలిచిన సింధు
- క్వార్టర్స్‌లో ప్రవేశం
- సైనా, శ్రీకాంత్ సునాయాసంగా ముందుకు



గ్లాస్గో: ఉత్కంఠభరితంగా సాగిన పోరులో సింధు పోరాటపటిమను ప్రదర్శించింది. చెంగ్, సింధు పోరు 27 నిమిషాల పాటు హోరాహోరీగా సాగింది. రెండో గేమ్‌లో కూడా ఓ దశలో 13-16తో వెనుకబడినా చెక్కుచెదరని సింధు పోరాడింది. విరామానికి రెండు పాయింట్లు వెనుకబడినా తరువాత పుంజుకుంది. ఓ దశలో ఇద్దరు 19-19తో నిలిచారు. చివరకు గేమ్ సింధు వశమైంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఆదిలోనే 11-6 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. కానీ చెంగ్ తేరుకొని స్కోరును 12-12తో సమం చేసింది. తర్వాత సింధు తన ఆధిక్యాన్ని పెంచుకుంటూ పోయి గేమ్‌ను, మ్యాచ్‌ను గెలుచుకుంది. సైనా 21-19, 21-15తో సంగ్ (కొరియా)పై గెలిచి క్వార్టర్స్‌కు వెళ్లింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లలో సాయిప్రణీత్ 21-19, 10-21, 12-21తో చైనీస్ తైపీ ఆటగాడు చోయు తీన్ చెన్ చేతిలో.. అజయ్ జయరామ్ 11-21, 10-21తో చైనా షట్లర్ చెన్ లాంగ్ చేతిలో ఓటమి పాలయ్యారు.



శ్రీకాంత్ అలవోకగా: పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ సునాయాసం గా గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరాడు. అతను ప్రపంచ నెంబర్ 18 ఆం టన్‌సేన్‌ను 21-14, 21-18 తో మట్టికరిపించాడు. తొలి రెండు రౌండ్ల మాదిరిగానే కిదాంబి మూడో రౌండ్‌ను కూడా సునాయాసంగా గెలుచుకున్నాడు. "ఇది చాలా అద్భుత మ్యాచ్. కొన్ని తీవ్ర ర్యాలీలు నడిచి నా చివరకు గెలిచినందుకు సంతోషంగా ఉంది" అని శ్రీకాంత్ అన్నా డు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ జరీ చోప్రా, సిక్కిరెడ్డి జోడీ 22-20, 18-21, 18-21తో ఇండోనేషియా జోడీ డెబీ సుశాంతో, ప్రవీణ్ జోర్డాన్ చేతిలో పరాజయం పాలయ్యారు.

పోరాడి ఓడిన టైటాన్స్

లక్నో: యూపీ యోధాతో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ పోరాడి ఓడింది. గురువారం జరిగిన ప్రొ కబడ్డీ లీగ్ పోరులో టైటాన్స్ 23-25 స్వల్ప తేడాతో ఓటమి పాలైంది. చివరి రెండు నిమిషాలలో నితిన్ తోమర్ కీలక సమయంలో పాయింట్లు సాధించి యోధాను గెలిపించాడు. అదే సమయంలో టైటాన్స్ రైడర్లు నిరాశజనక ప్రదర్శనతో తేలిపోయారు. రాహుల్ చౌదరి ఆట రెండో నిమిషంలో తొలి రైడ్ పాయింట్ గెలిచి టైటాన్స్‌ను 2-1 ఆధిక్యంలో నిలిపాడు. సురీం దర్ సింగ్ నాలుగో నిమిషంలో రెండు పాయింట్లు గెలిచి యోధాను 3-2 ఆధిక్యంలోకి తీసుకుపోయాడు. తొలి పది నిమిషాల్లో రెండు జట్ల పోరు నువ్వానేనా అన్నట్లు సాగడంతో 5-5తో సమంగా నిలిచాయి. నితిన్ తొలిసారి రైడ్ విజయవంతంగా పూర్తి చేయడంతో 12వ నిమిషానికి యోధా 7-5 ఆధిక్యం సాధించింది. టైటాన్స్ తేరుకొని పాయింట్లు సాధించడంతో 15వ నిమిషానికి 8-9తో నిలిచింది. తరువాత కొద్ది నిమిషాలు టైటాన్స్‌కు కలిసి రాలేదు. దీంతో 17వ నిమిషానికి టైటాన్స్ 10-9తో వెనుకబడింది. ఐతే విరామానికల్లా 12-10తో ఆధిక్యంలోకి దూసుకుపోయింది.

కార్లోస్‌కు జైలు శిక్ష



రియోడి జనీరో: తన పిల్లల పోషణకు డబ్బు ఇవ్వనందుకు బ్రెజిల్ ఫుట్‌బాల్ హీరో రాబర్టో కార్లోస్‌కు జైలు శిక్ష పడింది. బ్రెజిల్ అంతర్జాతీయ జట్టుతో పాటు రియల్ మాడ్రిడ్ క్లబ్‌లో ఫుల్‌బ్యాక్ ఆటగాడైన 44 ఏళ్ల కార్లోస్ తన మాజీ భాగస్వామి బార్బరా థర్లర్‌కు సుమారు 20 వేల డాలర్లు బకాయి పడ్డాడు. తొమ్మండుగురు సంతానానికి తండ్రయిన కార్లోస్.. బార్బరా ద్వారా ఇద్దరిని కన్నాడు. ఆమె కుటుంబ కేసులు విచారించే రియోడి జనీరో రాష్ట్ర కోర్టులో కేసు వేసింది. వాయిదాల పద్దతిలో కార్లోస్ ముందుకు వచ్చినప్పటికీ ఆ ప్రతిపాదనను అతని కుటుంబం తిరస్కరించిందని వెల్లడించిన న్యాయమూర్తి అతనికి జైలు శిక్ష విధించారు. కార్లోస్ జైలుకు వెళ్లే అవసరం లేకుండా అతని కుటుంబంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని న్యాయవాది తెలిపాడు. ప్రపంచకప్ గెలిచిన బ్రెజిల్ జట్టు సభ్యుడైన కార్లోస్.. దేశం తరపున 125 మ్యాచ్‌లాడాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో జీవిస్తున్న కార్లోస్... రియల్ మాడ్రిడ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాడు.

సైక్లింగ్ విజేతలకు కేసీఆర్ అభినందన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: లండన్‌లో జరిగిన 1436కిలోమీటర్ల సైక్లింగ్ రైడ్‌ను విజయవంతంగా పూర్తిచేసి, వెండి పతకాలు సాధించిన తెలంగాణ బృందాన్ని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అభినందించారు.

లండన్‌లో గత జూలై 30నుండి ఆగస్టు 4వరకు 1436కిమీ సైక్లింగ్ రైడ్ జరిగింది. లండన్ నుండి ఎడిన్ బర్గ్ వరకు ఈ రైడ్ జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక టీమ్‌లు పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్రం నుండి ఇంటెలిజెన్స్ డిఎస్పీ వి.సదానందరెడ్డి నాయకత్వంలో సైక్లిస్టులు పాల్గొని వెండిపతకం సాధించారు.

ఈ బృందంలో సదానందరెడ్డితో పాటు రాజేష్ కృష్ణమనేని, ప్రద్యుమ్న, పెన్మత్స, గౌతమ్ నార్నె, సాయిరామకృష్ణ, కృష్ణ కూనం, జితేందర్ దడ్వాయి ఉన్నారు. వీరంతా గురువారం ప్రగతిభవన్‌లో సిఎంను కలిశారు. సిఎం వీరిని అభినందించారు. కార్యక్రమంలో క్రీడా సాధికారిత సంస్థ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆశల పల్లకిలో...

- ప్రపంచ బాక్సింగ్‌కు భారత బాక్సర్లు
- నేటి నుంచి ఛాంపియన్‌షిప్


శివ


వికాస్

హాంబర్గ్ (జర్మనీ): ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో మరిన్ని పతకాల వేటపై భారత బాక్సర్లు కన్నేశారు. 19వ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ శుక్రవారం జర్మనీలోని హాంబర్గ్‌లో ఆరంభం కానుంది. పోటీలు పది రోజుల పాటు జరుగుతాయి. శివ థాపా, వికాస్ కృష్ణన్ నేతృత్వంలోని భారత బాక్సర్లు ఈ సారి పతకాల సంఖ్యతో పాటు రంగును కూడా మెరుగుపరచాలని కృతనిశ్చయంతో ఉన్నారు. ఇంతవరకు ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ప్రదర్శన ఏమంత చెప్పుకోవదగ్గ స్థాయిలో లేదు. నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు సాధించినవి కేవలం 3 పతకాలే. ఈ మూడూ కాంస్యాలే. పతకాల పట్టికలో మరో మూడు దేశాలతో పాటు భారత్‌ది 49 స్థానం. 2009, 2011, 2015లలో భారత బాక్సర్లు 3 కాంస్యాలను వశం చేసుకున్నారు. 2015లో శివ, 2011లో వికాస్, 2009లో విజేందర్ సింగ్ పతకాలను సాధించారు.

ఆశలన్నీ శివ, వికాస్‌పైనే..: ఈ సారి చాంపియన్‌షిప్‌లో 8 మంది బాక్సర్లతో కూడిన బలమైన భారత బృందం పోటీ పడబోతోంది. ఐతే అనుభవజ్ఞులైన శివ (60 కిలోలు), వికాస్ (75 కిలోలు)లపైనే ఈ సారీ ఆశలున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో తాష్కెంట్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో ప్రదర్శన ద్వారా బారత బాక్సర్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. "పోటీలకు మా సమాయత్తత అద్భుతంగా ఉంది. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో బాక్సర్లు రెండో రజత, రెండు కాంస్యాలు గెలిచారు. మొత్తంగా మూడో స్థానంలో నిలిచారు" అని భారత జట్టు కోచ్ శాంటియాగో నీవా (స్వీడన్) చెప్పాడు. "తర్వాత శిక్షణ, మెళకువల కోసం ఫ్రాన్స్, చెక్ రిపబ్లిక్ వెళ్లాం. అక్కడ ఫలితాలు అద్భుతంగా ఉన్నాయి. ఈ సారి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మన యువకుల ప్రదర్శన మెరుగ్గా ఉంటుందన్న విశ్వాసం నాకుంది" అని ఆయన చెప్పాడు. "సుదీర్ఘ ప్రయాణంలో చాలా పరిణామాలు చూశాం. ఒలింపిక్స్ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌నే ప్రముఖ టోర్నీ. దానికి నేను సిద్ధంగా ఉన్నాను" అని శివ అన్నాడు. 2015లో బాంటమ్ వెయిట్ విభాగంలో కాంస్యం గెలిచిన ఈ అస్సాం బాక్సర్ ఈ సారి 60 కిలోల లైట్‌వెయిట్ విభాగంలో పోటీపడుతున్నాడు. విభాగం మారినా శివ మెరుగైన ప్రదర్శన ఇచ్చాడు. మూడు మాసాల క్రితం జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రజతం సొంతం చేసుకున్నాడు. పతకంపై భారత్ ఆశలు పెట్టుకున్న మరో బాక్సర్ వికాస్. ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన 25 ఏళ్ల వికాస్... మిడిల్ వెయిట్ (75 కిలోలు) విభాగంలో పోటీ పడుతున్నాడు. డార్క్‌హార్స్‌గా పేరుబడ్డ వెటరన్ మనోజ్ కుమార్ (69 కిలోలు) కూడా బరిలో ఉన్నాడు.

భారత బృందం: అమిత్ ఫంగల్ (49 కిలోలు), కవిందర్ బిస్త్ (52 కి.), గౌరవ్ బిధురి (56 కి.), శివ థాపా (60 కి.), మనోజ్ కుమార్ (69 కి.), వికాస్ కృష్ణన్ (75 కి.), సుమీత్ సంగ్వాన్ (91 కి.), సతీష్ కుమార్ (ప్లస్ 91 కి.).

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.